thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 284 | కరీంనగర్ శనివారం, 21 డిసెంబర్, 2024 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## త్వరలో 'రైల్వే సూపర్ యాప్' ఆవిష్కరణ

న్యూఢిల్లీ : రైల్వే సేవలన్నీ ఒకే చోట లభ్యమయ్యే 'సూపర్ యాప్' త్వరలో అందుబాటులోకి రానుంది. టిక్కెట్ల బుకింగ్, రిజర్వేషన్లు, ప్లాట్‌ఫారం టిక్కెట్లు, కేటరింగ్... తదితర సేవలన్నింటినీ సమన్వయపరిచి ఒకే యాప్ రూపంలో ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. 'క్రిస్' సంస్థ ఈ నూతన యాప్ రూపకల్పనలో నిమగ్నమయింది. ఈ సమగ్ర మొబైల్ అప్లికేషన్ వచ్చే నెలలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ల ద్వారా ప్రయాణికులకు సేవలు అందుతున్నాయి. ఒక్కో సేవకు ఒక్కో అప్లికేషన్ ఉండడంతో వాటన్నింటినీ సమన్వయపరిచి సమగ్రమైన యాప్‌ను రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# కేటీఆర్‌కు బిగ్ రిలీఫ్


## ఈ నెల 30 వరకు అరెస్ట్ చేయొద్దు: హైకోర్టు



హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరిగింది. ప్రాథమిక దర్యాప్తు ఇప్పటికే పూర్తయినందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు హైకోర్టులో వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని, ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరారు. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం.. ఈనెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది.

**కేటీఆర్ తరఫు న్యాయవాదుల వాదనలు ఇలా..** "అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవు. ముఖ్యంగా 13(1)(%ఖ%) సెక్షన్ ఈ కేసుకు వర్తించదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అనేందుకు ఆధారాలు లేవు. ప్రొసీజర్ పాటించలేదనడం సరైంది కాదు. 14 నెలల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ కూడా లేకుండా కేసు పెట్టారు. కేవలం రాజకీయ కక్షసాధింపు కోసమే కేటీఆర్‌పై కేసు పెట్టారు. ఈ కేసులో ఎన్నో తప్పులు కనిపిస్తున్నాయి. కార్ రేస్ నిర్వహణకు 2022 అక్టోబరు 25న ఒప్పందం జరిగింది. సీజన్ 10 నిర్వహణకు స్పాన్సర్ వెనక్కి తగ్గారు. రేస్ నిర్వహణలో ఇబ్బందుల నివారణకే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇబ్బందులు రాకూడదనే హెచ్ఎండీఏ చెల్లింపులు చేసింది. సీజన్-9 వల్ల దాదాపు రూ.700 కోట్ల లాభం వచ్చింది. ఆర్థికశాఖ అనుమతి లేదని ఏసీబీ అధికారులు అంటున్నారు. కార్ రేసింగ్ ఒప్పందాన్ని కొత్త ప్రభుత్వం ఉల్లంఘించింది. కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దయింది. ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు. సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. సుప్రీంకోర్టు తీర్పులను ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి. 18న ఫిర్యాదు అందగానే.. 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్టు ఎక్కడా పేర్కొనలేదు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు. కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు" అని కేటీఆర్ తరఫు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు.

**కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుంది: ఏజీ...** రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "ఎఫ్ఐఆర్ నమోదు ప్రాథమిక అంశం మాత్రమే. అందులో పేర్కొన్న అంశాలే అంతిమం కాదు. దర్యాప్తులో తేలే విషయాల ఆధారంగా సెక్షన్లు చేరుస్తారు. రెండు నెలల క్రితమే కేసు నమోదుకు నిర్ణయించారు. కేసు నమోదు కోసం గవర్నర్ నిర్ణయానికి పంపారు. గవర్నర్ ఆమోదించాకే కేసు నమోదు చేశారు. ఫార్ములా సంస్థకు డబ్బు విదేశీ కరెన్సీలో చెల్లించారు. దీంతో హెచ్ఎండీఏపై అధిక భారం పడింది. విదేశీ కరెన్సీలో చెల్లింపు కోసం ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదు. ఆర్థికశాఖ అనుమతి కూడా లేదు" అని ఏజీ వివరించారు. గవర్నర్ అనుమతి కాపీని కోర్టు అడగడంతో ఏజీ అందజేశారు. చెల్లింపుల్లో కేటీఆర్ పాత్ర ఏంటని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుందని ఏజీ తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు అనేది దర్యాప్తు కోసమేనని వివరించారు. కేసు పూర్తి వివరాలు అభియోగపత్రంలో ఉంటాయని, రూ.56 కోట్లకు పైగా చెల్లింపుల్లో నిబంధన ఉల్లంఘన జరిగిందని ఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు.




## ఒక పార్టీ, రెండు ఆఫీసులు - పాలమూరులో గులాబీల గలాట!

పాలమూరు : ఆ జిల్లాలో బీఆర్ఎస్‌కి ఒక్క పార్టీ కార్యాలయం సరిపోవడం లేదట... ఎన్నికల్లో ఘోరపరాజయం పాలైన గులాబీ పార్టీకి అక్కడ రెండు జిల్లా కార్యాలయాలు కనిపిస్తుండటం అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది... ఒకటేమో పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో నిర్మాణం జరిగితే ..మరొకటేమో మొన్నీమధ్య నియోజకవర్గం ఆఫీసు నుంచి జిల్లా పార్టీ కార్యాలయంగా అప్ గ్రేడ్ అయింది. గులాబీ బాస్ కేసీఆర్ స్వయంగాప్రారంభించిన పార్టీ సొంత భవనానికి అప్‌గ్రేడ్ అయిన పార్టీ కార్యాలయం పోటీ ఇవ్వడం ఇప్పుడు జిల్లా పాలిటిక్స్‌లో ఆసక్తి రేపుతోంది. అఫిషియల్ ఆఫీసు ఏదో అర్థంకాక కేడర్లో గందరగోళం నెలకొంటోంది .. అసలింతకీ ఆ జిల్లా ఏది? ఆ పార్టీ కార్యాలయాల గోలేంటి? మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ పాలిటిక్స్ విచిత్రంగా తయారయ్యాయి. అక్కడ బీఆర్ఎస్ రాజకీయాలు ప్రజలకు కాదు... అసలు పార్టీ శ్రేణులకే అర్థం కావడం లేదంట. ఎన్నికల ముందు పార్టీ కార్యక్రమాలు అంటే ఎంతో హడావిడి ఉండేది. ఇప్పుడు అసలు పార్టీ జిల్లా అధ్యక్షుడితో పాటు, మాజీ ఎమ్మెల్యేలు ఎవరు పెద్దగా ఆక్టివ్‌గా లేరని క్యాడర్ లో చర్చ నడుస్తోంది. ఇక జిల్లా కేంద్రంలో అయితే ఆ పాలిటిక్స్ మరింత ఇంట్రెస్టింగ్‌గా కనిపిస్తున్నాయి. పార్టీ సొంత నిధులతో నిర్మితమైన జిల్లా కార్యాలయం ఎన్నికల్లో ఓటమి తర్వాత నిరుపయోగంగా మరిందనుకుంటే... కొత్తగా మరో కార్యాలయం తెర మీదకు వచ్చింది. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యాలయం ఎన్నికల తర్వాత ప్రమోషన్ పొందింది. అందుకేనెమో ఇప్పుడు ఏకంగా జిల్లా పార్టీ కార్యాలయం అని స్టికర్ మార్చేసుకుంది. .. వాస్తవానికి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో జిల్లా పార్టీ కార్యాలయం వద్ద ఒకరో ఇద్దరు కూడా కనిపించేవారు కాదు. అదే టైంలో న్యూ టౌన్ లో ఉన్న నియోజకవర్గ కార్యాలయంలోనే కార్యకర్తలు, నాయకుల సందడి కనిపించేది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న శ్రీనివాస్ గౌడ్ నిత్యం ఇదే కార్యాలయానికి రావడం, కార్యక్రమాలు నిర్వహించి హడావుడి చేశారు.అనంతరం ఎంపీ ఎన్నికల్లోను అదే తరహా పార్టీ కార్యక్రమాలు నిర్వహించే వారు.. అంతవరకు అంతా బాగానే ఉన్నా... అకస్మాత్తుగా నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి జిల్లా పార్టీ కార్యాలయంగా పేరు మార్చడం గులాబీ క్యాడర్ లో చర్చనీయాంశం అయింది. జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున సొంత భవనం నిర్మంపచేసి.... జిల్లా పార్టీ కార్యాలయం అందులో ఏర్పాటు చేసి ఆ భవనాన్ని స్వయంగా కారు పార్టీ అధినేత కేసీఆరే ప్రారంభించారు... అలాంటి జిల్లా కార్యాలయానికి నియోజకవర్గ ఆఫీసు ఇప్పుడు పోటీగా మారింది. ఇదంతా ఎందుకు జరిగిందో ఏం జరుగుతుందో ఎవరికి అర్థం కావడం లేదు. పార్టీలో ఆధిపత్య పోరులో భాగంగానే ఇది జరిగిందా? అన్న అనుమానాలు కార్యకర్తల్లో వ్యక్తమవుతున్నాయి. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రస్తుతం మహబూబ్ నగర్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన హయాంలో ఇప్పటివరకు ప్రారంభోత్సవం తప్ప జిల్లా పార్టీ కార్యాలయంలో ఒక్క సమావేశం కూడా జరగలేదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న సమయంలోనూ ఎలాంటి సందడి లేకుండా బోసిపోయింది. జిల్లా పరిధిలోని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కేంద్రంగా పార్టీ వ్యవహారాలు కొనసాగాయి. దాంతో జిల్లా పార్టీ ఇన్చార్జ్‌కి పెద్దగా పనుండేది కాదని, పార్టీ కార్యకలాపాలు పర్యవేక్షించాల్సిన అవసరం కూడా రాలేందంటారు. పార్టీకి సంబంధించి ఏ పనులైన నేరుగా అధిష్టానంతో చర్చించుకొని నాటి ఎమ్మెల్యేలే చేయించుకునేవారట. దాంతో అటు జిల్లా అధ్యక్షుడు, ఇటు పార్టీ జిల్లా కార్యాలయాలకు ప్రాధాన్యత లేకుండా పోయింది.

ఎన్నికల తర్వాత సడన్‌గా మరో జిల్లా కార్యాలయం పుట్టుకు రావడం జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. మొదటి నుంచి లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో.. శ్రీనివాసగౌడ్ పర్యవేక్షించే నియోజకవర్గ కార్యాలయంలోనే పార్టీ హడావిడి జరుగుతోంది. లక్ష్మారెడ్డి పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండం వల్లే ఇలాంటి పరిణమాలు చోటు చేసుకుంటున్నాయని కేడర్ భావిస్తుంది. జిల్లా కేంద్రంలో తాను హడావిడి చేస్తే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో తనకు నేరుగా అభిప్రాయ బేధాలు వస్తాయని, లేనిపోని తలనొప్పి ఎందుకని లక్ష్మా రెడ్డి భావిస్తున్నట్లు చెప్తున్నారు. ఏదేమైనా సడన్‌గా నియోజకవర్గ కార్యాలయం... జిల్లా కార్యాలయంగా మార్పు చెందడంతో క్యాడర్ లో గందరగోళం నెలకొంది. ఇద్దరు మాజీ మంత్రుల మధ్య గ్యాప్ కారణంగానే శ్రీనివాసగౌడ్ నియోజకవర్గం ఆఫీసుకి జిల్లా పార్టీ కార్యాలయం బోర్డు పెట్టించారంటున్నారు. మొత్తానికి ఓటమి తర్వాత కూడా పాలమూరు జిల్లా బీఆర్ఎస్ నేతల రాజకీయం ఎవరికీ అంతుపట్టకుండా తయారైంది.




## ఏసీబీకి ఈడీ లేఖ..

## కేటీఆర్‌కు బిగుస్తున్న ఉచ్చు.. రంగంలోకి ఈడీ

హైదరాబాద్: ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఈడీ కూడా జోక్యం చేసుకోవడంతో రాజకీయంగా ప్రకంపనలు రేపుతోంది. కేటీఆర్ తనను కాపాడాలని ఢిల్లీ పెద్దల శరణు కోరారని ఆరోపించిన కాంగ్రెస్ నేతలపై బీజేపీ కౌంటర్లు వేస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో తీసుకున్న నిర్ణయాలను కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విషయానికి వస్తే ఫార్ములా ఈ కారు రేసులో రూ. 55 కోట్లు.. ప్రభుత్వం, సీఎస్ అనుమతి లేకుండా.. ఆ శాఖకు సంబంధించిన సెక్రటరీ, ప్రిన్స్‌పల్ సెక్రటరీ స్థాయి అధికారులతో రూ. 55 కోట్ల బదలాయింపు చేసినట్లు కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీనిపై ఏసీబీ కేసు ఇప్పటికే ఫైల్ అయింది. కొత్తగా అందులో ఈడీ జోక్యం చేసుకోవడంతో ఈ కేసు రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. మరోవైపు ఫార్ములా ఈ కారు రేసు కేసుపై ఈడీ ఫోకస్ పెట్టింది. అందులో భాగంగా తెలంగాణ ఏసీబీకి ఈడీ అధికారులు లేఖ రాశారు. కేటీఆర్‌పై నమోదైన కేసు వివరాలు.. ఎఫ్ఐఆర్‌తోపాటు హెచ్ఎండీఏ అకౌంట్ నుంచి ఎంత బదిలీ చేశారో వివరాలు ఇవ్వాలని ఈడీ కోరింది. దాన కిశోర్ ఫిర్యాదు కాపీ కూడా పంపాలని ఈడీ అధికారులు కోరారు. ట్రాన్సాక్షన్లు జరిగిన తేదీల వివరాలు కూడా ఇవ్వాలన్నారు.




# పేదల భూములు కాపేడేందుకే...

# 'భూ భారతి'

## భూ భారతి బిల్లుకు శాసనసభ ఆమోదం

హైదరాబాద్: తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'భూ భారతి' బిల్లుపై చర్చలో భాగంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "తెలంగాణలో ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి. భూమిని కాపాడుకునే ప్రయత్నంలో దొడ్డి కొమరయ్య వంటి వారు ప్రాణాలు కోల్పోయారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి అనేక మంది భూ పోరాటాలు చేశారు.

పేదల భూములు కాపాడేందుకు పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. భూమిలేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వ భూమి ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టింది. ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గత ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయి. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' మాత్రం రైతులను తమ భూములకు దూరం చేసింది. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకొస్తే.. ఒడిశా ప్రభుత్వం తప్పు చేసిందని ఎన్ఐసీ, కాగ్ సూచించాయి. అనుభవం లేని ఐ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం యువరాజుకు అత్యంత సన్నిహితుడైన గాదె శ్రీధర్‌రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న సంస్థలను ఐఎల్ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుంది. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతను అప్పగించారు.

ధరణి టెండర్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారింది. ఫాల్కన్ హెచ్‌బీ అనే ఫిలిప్పీన్ కంపెనీ, తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయి. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలను ఈ సంస్థ చేతిలో పెట్టారు. ట్యాక్స్ హెవెన్ దేశాల కంపెనీల చేతిలో మన ధరణి పోర్టల్ పెట్టారు. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జీన్ ఐలాండ్ మీదుగా ధరణి పోర్టల్ తిరిగింది. పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా.. సీఈవోగా గాదె శ్రీధర్‌రాజే ఉన్నారు" అని సీఎం వివరించారు. సీఎం ప్రసంగం తర్వాత భూ భారతి బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

**విపక్ష పార్టీ అహంకారంతో వ్యవహరిస్తోంది...** విపక్ష పార్టీ అహంభావంతో అహంకారంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభా మర్యాదలను ఉల్లంఘించి సభాపతిపైనే దాడి చేస్తామన్న ధోరణిలో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందన్నారు. "రెచ్చగొట్టడం ద్వారా భూ భారతి బిల్లుపై చర్చను పక్కదోవ పట్టించాలని ప్రయత్నించినా.. చాలా ఓర్పుతో సభాపతి వ్యవహరించారు. ఏ మాత్రం సహనం కోల్పోకుండా.. వాళ్లంతట వాళ్లే సహనం చచ్చిపోయి సహకరించాల్సిన పరిస్థితి కల్పించి సభను ముందుకు నడిపించారు. తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడే కీలకమైన, ముఖ్యమైన బిల్లుపై చర్చ జరిగే విధంగా కృషి చేసిన సభాపతిని అభినందిస్తున్నా" అని సీఎం తెలిపారు.



# రేవంత్ కుట్ర పన్నారు.. బీఆర్ఎస్ నేతల ధ్వజం

హైదరాబాద్‌ని సర్వనాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని శాసనమండలి ప్రతిపక్ష నేత, మధుసూదన చారి ధ్వజమెత్తారు. హైదరాబాద్ విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు మాజీ సీఎం కేసీఆర్ చాలా కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. కేటీఆర్ తనకున్న శక్తి మేరకు ప్రపంచ స్థాయి ఫార్ములా ఈ రేస్ హైదరాబాద్ నగరానికి తెచ్చారని తెలిపారు హైదరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్ మీద పెట్టిన అక్రమ కేసుపై సభలో చర్చించాలని డిమాండ్ చేశామని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి అన్నారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్సీల మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా రేస్‌లో కేటీఆర్ మీద పెట్టిన అక్రమ కేసు తీవ్రంగా నిరసన తెలుపుతున్నామని మధుసూదన చారి అన్నారు. కేటీఆర్ మీద పెట్టిన కేసు ఉ పసంహరించుకునేవరకు పోరాడుతామని చెప్పారు. హైదరాబాద్ విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు మాజీ సీఎం కేసీఆర్ చాలా కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. కేటీఆర్ తనకున్న శక్తి మేరకు ప్రపంచ స్థాయి ఫార్ములా ఈ రేస్ హైదరాబాద్ నగరానికి తెచ్చారని తెలిపారు.తెలంగాణలో విదేశీ పెట్టుబడులు పెట్టేలా ఈ రేస్ చేపట్టారని మధుసూదన చారి అన్నారు. మొదటి రేసు విజయవంతమైందని.. రెండో రేసును రేవంత్ ప్రభుత్వం ఆపేసిందని చెప్పారు.

హైదరాబాద్‌ను సర్వనాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారని మండిపడ్డారు. అన్ని వివరాలు కేటీఆర్ వివరించారని.. ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదని చెప్పారు. ప్రభుత్వం తప్పులను ఎత్తి చూపుతునందుకే ఈ అక్రమ కేసు పెట్టారని అన్నారు. రాష్ట్రంలో భయానక వాతావరణం, అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుందని చెప్పారు. కేసీఆర్ బిడ్డలకు పోరాటాలు కొత్తకాదు ఎలాంటి కేసులైన ధైర్యంగా ఎదుర్కొంటారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మధుసూదన చారి అన్నారు.

**కేటీఆర్‌పై కేసు అక్రమం: మహమూద్ అలీ** కేటీఆర్ మీద పెట్టిన కేసు అక్రమమని మాజీ హెూంమంత్రి మహమూద్ అలీ అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఈ రేస్ తెచ్చారని.. అనుకున్న దానికంటే ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని గుర్తుచేశారు. హైదరాబాద్ ఇమేజ్ మరింత పెంచేందుకు ఈ రేస్ తెచ్చారన్నారు. రేవంత్ రెడ్డి కేటీఆర్ మీద కేసులు పెట్టడం కాదని.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మహమూద్ అలీ డిమాండ్ చేశారు.

**కుట్రలో భాగంగానే అక్రమ కేసులు: ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్** మండలిలో ప్రజాసమస్యలపై పోరాడుతున్నామని.. సమస్యలను పక్కనపెట్టి బిల్లులు ఆమోదించుకుంటున్నారని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. లగచర్ల రైతులను అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం ప్రభుత్వ కుట్రలో భాగమేనని చెప్పారు. గిరిజన లగచర్ల రైతులకు అండగా నిలిచినందుకే కేటీఆర్‌పై కేసులు పెట్టారని ఆరోపించారు. లంబాడీలు, గిరిజనులు అంతా ఏకమై ప్రభుత్వం కుట్రలను తిప్పికొడతామని అన్నారు. రేవంత్ రెడ్డికి సరైన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు.

# ఆ నోటీసు కేవలం ట్రైలర్ మాత్రమే - కాంగ్రెస్



దిల్లీ: రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై విపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం నోటీసులు కేవలం ట్రైలర్ మాత్రమేనని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఆయనపై అవిశ్వాసం కోసం విపక్షాలు మళ్లీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఉపరాష్ట్రపతిని తొలగించేందుకు ఇచ్చిన నోటీసు అనాలోచిత చర్యగా పేర్కొంటూ డిప్యూటీ ఛైర్మన్ దానిని తిరస్కరించిన విషయం తెలిసిందే. "ఛైర్మన్‌పై అభిశంసన తీర్మానం కోసం మేం ఇచ్చిన నోటీసులు తిరస్కరించారు. అవిశ్వాస తీర్మానం ఎన్నిసార్లు ఇవ్వాలనే అంశంపై రాజ్యాంగంలో ఎలాంటి పరిమితి లేదు. అందుకే, జనవరి 30 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో దీనిని మళ్లీ పరిశీలిస్తాం" అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. విపక్షాలు మరోసారి నోటీసులు ఇస్తాయా? అన్న ప్రశ్నకు అవునని బదులిచ్చారు.

ఇది తొలి అడుగు మాత్రమేనని, అవిశ్వాస తీర్మానానికి సంబంధించినంత వరకు ఇదొక ట్రైలర్ మాత్రమేనని చెప్పారు.

**జేపీసీకి జమిలి ఎన్నికల బిల్లు...** రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్‌ను తొలగించాలని కోరుతూ 60 మంది విపక్ష సభ్యులు సంతకాలు చేసి ఈ నెల 10వ తేదీన అభిశంసన తీర్మానం కోసం నోటీసు ఇచ్చారు. ఆయన పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై నమ్మకం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(బీ) కింద వారు ఈ నోటీసు ఇచ్చారు. తనపై ఇచ్చిన నోటీసుపై తాను నిర్ణయం తీసుకోకూడదంటూ గురువారం ధన్‌ఖడ్ సభకు అధ్యక్షత వహించలేదు. డిప్యూటీ ఛైర్మన్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో హరివంశ్ సభాధ్యక్ష స్థానంలో కూర్చుని ప్రతిపక్షాల నోటీసును తిరస్కరిస్తూ రూలింగ్ ఇచ్చారు.

ఉప రాష్ట్రపతిని తొలగించేందుకు 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని.. ప్రస్తుతం ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసు 24వ తేదీ తర్వాతే చెల్లుతుందని అన్నారు.

# ఫార్ములా-ఈ కార్‌పై ఎప్పుడైనా?ఎక్కడైనా చర్చకు సిద్ధం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌పై సభలో చర్చించాలని కేటీఆర్ ఇంతకాలం ఎందుకు అడగలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ.. "ఈ కార్ రేస్ ప్రతినిధులు వచ్చి నన్ను కలిశారు. రూ.600 కోట్లు పెండింగ్ నిధులు రావాల్సి ఉంది.. ఇవ్వమని అడిగారు. మీరు ఊ.. అంటే మరోసారి రేసింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఎఫ్ఈవో ప్రతినిధులు వచ్చి కలిసిన తర్వాతే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హెచ్‌ఎండీఏ ఖాతాలోని రూ.కోట్ల నిధులు లండన్‌లోని కంపెనీకి నేరుగా ఎలా వెళ్తాయి? నిర్వాహకులతో కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం రూ.600 కోట్ల విలువైనది. మిగతా డబ్బు కోసం వాళ్లు వచ్చినప్పుడే ఈ విషయం నా దృష్టికి వచ్చింది. ఓఆర్ఆర్ అమ్మినా.. హెచ్‌ఎండీఏ నిధులు కాజేసినా.. అడగవద్దన్నట్లు మాట్లాడుతున్నారు. నేను జాగ్రత్త పడటం వల్ల రూ.450 కోట్లు మిగిలాయి. ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై ఏసీబీ విచారణ జరుగుతోంది.. హైకోర్టులో కేటీఆర్ వేసిన పిటిషన్‌పై విచారణ జరుగుతోంది కాబట్టి ఎక్కువ వివరాలు వెల్లడించలేను. న్యాయపరంగా చిక్కులు లేకపోతే ఈ వ్యవహారంపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధం. అవసరమైతే భారాస కార్యాలయానికి వెళ్లి అయినా చర్చిస్తాం. రూ.55 కోట్లు చిన్న విషయం కాదు" అని సీఎం అన్నారు.

# భారాస ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయాలి: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్: భారాస ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. స్పీకర్‌ను అవమానించిన వారి సభ్యత్వం రద్దుకు డిమాండ్ చేస్తున్నామన్నారు. దళిత వ్యక్తి సభాపతి అయినందునే ఎమ్మెల్యేలు పేపర్లు చింపి విసిరారన్నారు.

వారి ప్రవర్తన దురహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. దళితుడైన స్పీకర్‌పై పరుష పదాలతో మాట్లాడారని చెప్పారు. గతంలో సంపత్‌కుమార్ పేపర్ విసిరేస్తే అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. భారాస ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని స్పీకర్, సీఎంను కోరుతున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలిపారు.

**అసలేం జరిగిందంటే..** శుక్రవారం తెలంగాణ శాసనసభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. భారాస ఎమ్మెల్యేలు పార్ములా ఈ-రేసుపై చర్చకు పట్టుబట్టారు. అది ఒక వ్యక్తికి సంబంధించిన అంశమని స్పీకర్ తెలిపారు. దీంతో భారాస ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు. ఈక్రమంలో భారాస శాసనసభ్యులు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అనంతరం భారాస ఎమ్మెల్యేలు ఉన్న వైపు కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పేపర్లు చించి విసిరారు. వారంతా పరస్పర నినాదాలు, ఆరోపణలు చేసుకున్నారు.

# కేటీఆర్ తప్పు చేశారు.. ఎమ్మెల్సీ కోదండరాం షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్: ఫార్ములా వన్ రేస్ అంశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై చర్యలు తీసుకోవడం తప్పేం కాదని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు.ఏబీఎన్‌తో ఎమ్మెల్సీ కోదండరాం ఇవాళ(శుక్రవారం) ఫార్ములా వన్ రేస్ కేసు విషయంలో కేటీఆర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ఇలా ఎందుకు అయ్యిందో విచారణకు వచ్చి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చెప్పాల్సిందేనని కోదండరాం అన్నారు. కాళేశ్వరం విచారణకు రావడం కేసీఆర్ బాధ్యత అని చెప్పారు. క్యాబినెట్ అనుమతి లేకుండా ఫార్ములా వన్ రేసు కోసం ప్రజాధనం ఎలా దుర్వినియోగం చేస్తారని ప్రశ్నించారు. ఫార్ములా వన్ రేసు తొందరపాటు నిర్ణయం కాదని.. కేసీఆర్ ప్రభుత్వ తప్పిదమని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఫార్ములా వన్ రేసులో కేటీఆర్ తప్పు చేశారని అన్నారు.కొత్త కారు కొనడంపై వస్తున్న విమర్శలపై కోదండరాం స్పందించారు. తాను ఈరోజు కాకపోతే రేపైనా కొత్త కారు కొనుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. తన కారు ఇప్పటికే చాలా కిలోమీటర్లు తిరిగిందని... కొత్తది కొనడం తప్పక కొన్నానని తేల్చిచెప్పారు. ఎమ్మెల్సీ అయ్యాక ఇచ్చే లోన్ తీసుకొని కొత్త కార్ తీసుకున్నానని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద కట్టాల్సిందేనని చెప్పారు. మేడిగడ్డ పనికిరాదని సీడబ్ల్యూసీ తేల్చి చెప్పిందని అన్నారు. పనికిరాని స్థలంలో మేడిగడ్డ కట్టారని విమర్శించారు. అన్ని డబ్బులు ఖర్చు చేసినా డిజైన్ లోపాలు, నాణ్యత లోపాలు ఉన్నాయని అన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర నిర్మాణం చేయాలనే డిమాండ్‌కి రేవంత్ ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని నమ్ముతున్నానని అన్నారు. కాళేశ్వరం పనికిరాదని నిపుణులు చెబుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు.




హైదరాబాద్: గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలో భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారి ఆందోళనల మధ్యే భూ భారతి బిల్లుపై పొంగులేటి తన ప్రసంగాన్ని కొనసాగించారు. "భారాస సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్‌కు తెలుసు. ఆయన 80వేల పుస్తకాలు చదివారు. పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి ధరణి పోర్టల్ రూపొందించారని అనుకునేవాళ్లం. ఆ చట్టానికి మూడేళ్లకే వందేళ్లు నిండాయి. ఇందిరమ్మ రాజ్యంలో 1971లో చేసిన చట్టం.. 49 ఏళ్లుగా ప్రజల్లో ఉంది. భూ భారతి బిల్లుకు సంబంధించి భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అనేక సూచనలు ఇచ్చారు. ఈ బిల్లు సభలో ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని ఆశించాం. అవి చట్టంలో పొందుపరచాలని భావించాం. కేసీఆర్ రాలేదు.. సభలో ఉన్నవాళ్లు ఈరకంగా గొడవ చేస్తున్నారు. భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు" అని పొంగులేటి వ్యాఖ్యానించారు.

**హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం...** అంతకుముందు హరీశ్‌రావు తీరుపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాస సభ్యుల ఆందోళన సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. "హరీశ్‌రావు తీరు రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసేలా ఉంది. సభను తప్పుదోవ పట్టించడం సరికాదు. భూ భారతి ముఖ్యమైన బిల్లు. ప్రజలకు సంబంధించిన బిల్లులపై చర్చల సమయంలో ఇలా ప్రవర్తించడం సరికాదు. ఈ బిల్లు ఇష్టం లేదా? రైతులకు సాయం చేయడం ఇష్టం లేదా?"అని స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.




హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఫార్ములా ఈ-రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ భారాస ఎమ్మెల్యేలు చర్చకు పట్టుబట్టారు. ఈ క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం, తదితర పరిణామాలతో సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఫార్ములా ఈ-రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడం.. దీనిలో ఏ-1గా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేరును చేర్చడంపై ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో నిరసన వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు పట్టుబట్టారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ భూ భారతి బిల్లుపై ప్రభుత్వం చర్చకు సిద్ధమైన నేపథ్యంలో తర్వాత నిర్ణయం తీసుకుందామని భారాస సభ్యులను ఉద్దేశించి చెప్పారు. ఫార్ములా ఈ-రేసు అంశం ఒక వ్యక్తికి సంబంధించినదని.. భూ భారతి బిల్లు రాష్ట్ర ప్రజలకు చెందినదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు భారాస సభ్యులు యత్నించారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో పలువురు భారాస ఎమ్మెల్యేలు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అదే సమయంలో కొందరు కాంగ్రెస్ సభ్యులు పేపర్లు చించి భారాస వైపు విసరడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది.

**అక్రమ కేసు కాకపోతే సభలో చర్చించాలి: హరీశ్‌రావు...** అంతకుముందు భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారు. కేటీఆర్‌ను అప్రతిష్ఠ పాల్జేసి భారాసను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఈ అంశంపై రకరకాల లీకులు ఇస్తున్నారు. మేం ఎలాంటి తప్పు చేయలేదు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా ఈ-రేసుపై నిర్ణయం తీసుకున్నాం. మేం తప్పు చేశామంటున్నారు.. దీనిపై సభలో చర్చించి ఆ తప్పేంటో చెప్పాలి. పెట్టింది అక్రమ కేసు కాకుంటే వెంటనే సభలో చర్చించాలి. మేం తప్పు చేయలేదని కేటీఆర్ చెప్పారు. ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తాం"అని హరీశ్‌రావు అన్నారు.

# జైలుకెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?: మంత్రి సీతక్క



హైదరాబాద్: పార్లమెంటులో అంబేడ్కర్‌ను, అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను అవమానించారని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడారు. క్యాబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈ-రేసుకు కేటీఆర్ డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకు అని అడిగారు. గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని చెప్పారు. బీఏసీలో ఫార్ములా ఈ-రేసు మీద చర్చ కోసం భారాస ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ముసుగు వేసుకుని భారాస రాజకీయం చేస్తోందని విమర్శించారు. "జైలుకు వెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు. తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా? కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళ్తే తప్పుపట్టిన ఆయన.. ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు? కేటీఆర్‌కు నిజాయతీ లేదు. లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే భూ భారతి బిల్లుపై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారు. వాళ్ల భూ కబ్జాల బాగోతం బయట పడుతుందనే ఇలా చేస్తున్నారు. అందరూ చట్టం ముందు సమానులే.. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందే" అని సీతక్క చెప్పారు.

# కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ చేయాలి: అక్బరుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్: ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించడంతో సభలో కాసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భారాస సభ్యుల తీరును ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. ఈ రోజు సభలో జరిగింది పదేళ్ల భారాస పాలనను తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు. సభ్యులు ప్రజల సమస్యలు ప్రస్తావించేందుకు సభకు వస్తారని.. ఇలా ఆందోళన చేసేందుకు కాదన్నారు. పదేళ్ల భారాస పాలన.. కచరా గవర్నెన్స్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఇవాళ సభలో జరిగింది భారాస సంస్కృతికి నిదర్శనం. భారాస సభ్యులకు కేసీఆర్ బోధించింది ఇదేనా? ధరణి.. ఒక కుటుంబం కోసం.. ఒక పార్టీ కోసమే తెచ్చారు. భూముల ఆడిటింగ్ జరగాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నా. నా డిమాండ్‌ను భారాస ఏనాడూ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ చేయాలి" అని అక్బరుద్దీన్ కోరారు. సభలో చర్చ కొనసాగుతుండగానే భారాస సభ్యులు వాకౌట్ చేశారు.

# హద్దుల్లేని కేటీఆర్ అక్రమాలతో వారు బలి

హైదరాబాద్, డిసెంబర్ 20: మాజీ మంత్రి కేటీఆర్‌పై  ఈ ఫార్ములా కేసు సక్రమమే అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. ఫార్ములా ఈ కారు రేసులో అక్రమాలు జరిగిన మాట వాస్తవమన్నారు. అక్రమాలు జరిగినట్టు పలు ఆధారాలున్నా... కడిగిన ముత్యమంటూ కేటీఆర్ తనకు తానే సర్టిఫికేట్ ఇచ్చుకోవడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వం పంపిన ఆధారాలపై గవర్నర్ న్యాయసలహా తీసుకొని కేసుకు అనుమతించాక ఇది అక్రమ కేసు ఎలా అవుతుందని ప్రశ్నించారు. చట్టపరంగా కేసు నమోదు అయినందున దీనిపై అసెంబ్లీలో కాదు, కోర్టులో తేల్చుకోవాలని సలహా ఇచ్చారు. హెచ్ఎమ్‌డీఏ భాగస్వామ్యం కాకున్నా.. దాని ఖాతా నుంచి ఆర్థికపరమైన అనుమతులు లేకుండానే రూ.54.88 కోట్లు చెల్లించేలా కేటీఆర్ ఒత్తిడి తెచ్చారన్నారు. ఆధారాలు కనిపిస్తున్నా.. అక్రమాలకు పాల్పడలేదని కేటీఆర్ బుకాయిస్తున్నారని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలాగా కాంగ్రెస్ అక్రమంగా కేసులు బనాయించట్లేదని తెలిపారు. రేసింగ్ స్కాంలో నిబంధనల ప్రకారం గవర్నర్ అనుమతి తీసుకునే అధికారులు ముందుకెళుతున్నారని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కంపెనీలకు ఫండ్స్ మంజూరు ఎలా చేస్తారని ప్రశ్నించారు. హద్దుల్లేని కేటీఆర్ అక్రమాలతో అధికారులు బలిపశువులుగా మారారన్నారు. నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో విదేశాలకు నిధులు బదిలీ చేయడంతో హెచ్‌ఎండీఏ ఆదాయ పన్ను శాఖకు రూ.8 కోట్లకు పైగా పన్ను చెల్లించాల్సి వచ్చిందన్నారు. నిబంధనలను కాదని మూడేళ్లలో రూ.600 కోట్లు చెల్లించేలా ఒప్పందం కేటీఆర్ అనుమతితోనే జరిగిందని చెప్పారు




## హెచ్1బీ వీసాలు సరళతరం.. భారతీయులకు బైడెన్ శుభవార్త..!

అమెరికాలో ఉద్యోగాలు చేయాలని కలలు కనే యువతకు బైడెన్ కార్యవర్గం ఓ శుభవార్త చెప్పింది. మరింత తేలిగ్గా ప్రత్యేక నిపుణులైన విదేశీయులను నియమించుకొనేందుకు అమెరికా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతోపాటు సులువుగా ఎఫ్-1 విద్యార్థి వీసాలను హెచ్-1బీ వీసాలుగా మార్చుకొనే అవకాశం కల్పించింది. ఇది లక్షల మంది భారతీయ వృత్తి నిపుణులకు ప్రయోజనం కల్పించనుంది. హెచ్-1బీ వీసా నాన్ ఇమిగ్రెంట్ కేటగిరీలోకి వస్తుంది. టెక్నాలజీ కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను దీని సాయంతో నియమించుకొంటుంటాయి. ముఖ్యంగా భారత్, చైనా దేశాలు ఈ వీసా నుంచి చాలా లబ్ధి పొందాయి. ఈనేపథ్యంలో కంపెనీలకు సౌలభ్యం కల్పించేలా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సరికొత్త నిబంధనలను ప్రకటించింది. దీనిప్రకారం నాన్‌ప్రాఫిట్, ప్రభుత్వేతర పరిశోధన సంస్థల నిర్వచనం, నిబంధనల్లో మార్పులు చేసింది. దీని ప్రకారం సంస్థలు అవసరాలకు తగినట్లు నియామకాలు చేసుకొని ప్రపంచ పోటీ మార్కెట్లో నిలదొక్కుకోవచ్చు.

వచ్చే నెల ట్రంప్ ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో బైడెన్ కార్యవర్గం ఈ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ కొత్త నిబంధన ప్రకారం ఎఫ్-1 విద్యార్థి వీసాలను తేలిగ్గా హెచ్-1బీ వీసాలుగా మార్చుకొనే అవకాశం లభిస్తుంది. ఇప్పటివరకు ఎఫ్-1 వీసాలకు ఉన్న చట్టపరమైన అడ్డంకులు తొలగినట్లైంది. దీంతోపాటు గతంలోనే హెచ్1బీ వీసా పొందినవారి పౌరసత్వం, ఇమిగ్రేషన్ సేవలకు సంబంధించిన దరఖాస్తులను వేగంగా ప్రాసెస్ చేయనున్నారు. అమెరికాలోని వ్యాపార సంస్థలకు కార్మికుల అవసరాలు తీర్చేందుకు బైడెన్ ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు ఆ సంస్థలపై పడుతున్న అనవసర ఆర్థిక భారాన్ని కూడా తగ్గిస్తుంది. ఇక కొత్త విధానంలో లేబర్ కండీషన్ అప్లికేషన్ కచ్చితంగా హెచ్1బీ వీసా పిటిషన్‌కు అనుగుణంగా ఉండాలి. ఇక ఈ నిబంధనలు 2025 జనవరి 17 నుంచి అమలుకానున్నాయి. అమెరికాలో ఏటా 65 వేల హెచ్1బీ వీసాలకు అనుమతిస్తుంది. అదనంగా మరో 20 వేల అడ్వాన్స్ డిగ్రీ వీసాలను కూడా జారీ చేస్తుంది. కానీ, చాలా నాన్‌ప్రాఫిట్ సంస్థలు దీనినుంచి మినహాయింపులు ఉన్నాయి. కొత్త నిబంధనల కింద ఈ సంస్థలు తమ పనిని 'పరిశోధన'గా పేర్కొనాల్సి ఉంటుంది. "అత్యంత నాణ్యమైన వృత్తి నిపుణులను నియమించుకొనేందుకు అమెరికా వ్యాపార సంస్థలు హెచ్1బీ వీసాలపై ఆధారపడ్డాయి. తాజా మార్పులతో యజమానులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను నియమించుకొనేందుకు మరింత సౌలభ్యం లభిస్తుంది. ఇది మన ఆర్థికవ్యవస్థలో పోటీతత్వాన్ని కూడా మెరుగుపరుస్తుంది. అమెరికా సృజనాత్మకతను మరింత పెంచుతుంది" అని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ అలెజాండ్రో ఎన్ మేయోర్కాస్ పేర్కొన్నారు. ఇక అమెరికా సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ డైరెక్టర్ జడ్డో స్పందిస్తూ.. "1990లో అమెరికా కాంగ్రెస్ హెచ్1బీ వీసాల జారీ కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. ఈనేపథ్యంలో కాలానుగుణంగా దేశ ఆర్థిక వ్యవస్థలకు ప్రయోజనం ఉండేలా దానిని ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు.




జపాన్‌కు చెందిన దిగ్గజ వాహన తయారీ సంస్థలు హోండా మోటార్, నిస్సాన్ మోటార్ విలీనం కానున్నాయని తెలుస్తోంది. ఈమేరకు ఇరు సంస్థలు చర్చలు జరిపినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పోటీని ఎదుర్కొనేందుకు ఈ విలీన ప్రక్రియకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో బుధవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో నిస్సాన్ షేర్లు 24శాతం దూసుకెళ్లాయి. ఇది కంపెనీ ఇంట్రాడేలో సరికొత్త రికార్డు. ఈ రెండు సంస్థల మధ్య రాత్రి చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో విలీనం, మూలధన వ్యయ ఒప్పందాలతో సహా అనేక అవకాశాలను హోండా పరిశీలిస్తున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ షింజీ అయోమా బుధవారం తెలిపారు. అయితే దీనిపై పూర్తి సమాచారం అందించేందుకు ఆయన నిరాకరించారు. ఒకవేళ విలీనం జరిగితే.. హోండా, నిస్సాన్ సంయుక్తంగా వాహనాల వార్షిక ఉత్పత్తిని 74లక్షలకు తీసుకెళ్లనున్నాయి. దీంతో టయోటా, వోక్స్‌వ్యాగన్ తర్వాత వాహనాలు విక్రయాల ద్వారా ప్రపంచంలోని మూడో అతిపెద్ద ఆటో గ్రూప్‌గా అవతరించనుంది. ఇదిలాఉండగా.. ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఈ ఏడాది మార్చిలోనే రెండు సంస్థలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పరచుకున్న విషయం తెలిసిందే.




## అమెరికా వీసా కష్టాలకు చెక్.. తగ్గనున్న అపాయింట్‌మెంట్ వెయిట్ టైమ్

అమెరికా వెళ్లాలనుకునే భారతీయులకు అగ్రరాజ్యం మరో శుభవార్త చెప్పింది. వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ కోసం నెలల తరబడి నిరీక్షించే పరిస్థితిని తగ్గించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం షెడ్యూలింగ్, రీషెడ్యూలింగ్‌లో కొత్త నిబంధనలు తీసుకొస్తోంది. ఇకపై ఎలాంటి అదనపు ఫీజు లేకుండా ఒకసారి అపాయింట్‌మెంట్‌ను రీషెడ్యూల్ చేసుకునే అవకాశం కల్పించనుంది. జనవరి 1, 2025 అంటే నూతన సంవత్సరం నుంచి ఈ కొత్త రూల్స్‌ను అమలు చేయనున్నట్లు భారత్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం వెల్లడించింది. "ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్‌లు కల్పించాలి. వెయిటింగ్ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో నిబంధనల్లో కొన్ని మార్పులు చేస్తున్నాం. జనవరి 1, 2025 నుంచి ఇవి అమల్లోకి రానున్నాయి. నాన్‌ఇమ్మిగ్రెంట్ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు మీకు నచ్చిన లొకేషన్‌లో ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ కు తొలి షెడ్యూల్‌చేసుకోవచ్చు. ఒకవేళ ఏ కారణం చేతనైనా మీరు రీషెడ్యూల్ చేసుకోవాల్సిన పరిస్థితి వస్తే.. ఎలాంటి అదనపు రుసుము లేకుండా ఒకసారి షెడ్యూల్‌ను మార్చుకోవచ్చు. ఆ తర్వాత ఒకవేళ మీరు అపాయింట్‌మెంట్‌ను మిస్ అయినా.. లేదా రెండోసారి రీషెడ్యూల్ చేసుకోవాలనుకున్నా.. కొత్త అపాయింట్‌మెంట్ కింద బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. దానికి మీరు మళ్లీ అప్లికేషన్ రుసుము చెల్లించాలి" అని ఎంబసీ ఓ ప్రకటనలో వెల్లడించింది. అపాయింట్‌మెంట్ ప్రక్రియను సులభతరం, వేగవంతం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు దౌత్యకార్యాలయం తెలిపింది. దరఖాస్తుదారులు షెడ్యూల్ చేసుకున్న సమయంలో ఇంటర్వ్యూలకు హాజరవ్వాలని సూచించింది. గత కొంతకాలంగా భారతీయులు అమెరికా వీసా అపాయింట్‌మెంట్ల కోసం నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం బీ1/బీ2 విజిటర్ వీసా కోసం ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ కావాలంటే ముంబయిలో 438 రోజులు ఎదురుచూడాలి. హైదరాబాద్‌లో అయితే ఈ సమయం 429రోజులుగా ఉంది. ఇక, స్టూడెంట్ వీసా అపాయింట్‌మెంట్‌కైతే హైదరాబాద్‌లో 115 రోజులు వేచి చూడాలి.

ఇదిలా ఉండగా.. ఇప్పటికే హెచ్-1బి వీసా నిబంధనలను అమెరికా సరళతరం చేసింది. ఎఫ్-1 విద్యార్థి వీసాలను సులభంగా హెచ్-1బి వీసాలుగా మార్చుకొనే వెసులుబాటునూ కల్పించింది. దీంతో గతంలోనే హెచ్-1బి వీసా కోసం ఆమోదం పొందిన వారి దరఖాస్తులిక వేగంగా ప్రాసెస్ అవుతాయి. ఈ నిబంధనలు జనవరి 17 నుంచి అమల్లోకి రానున్నాయి.

# అమిత్ షాకు అండగా బాబు...సైలెంట్ గా జగన్



కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నడూ లేని విధంగా పెను రాజకీయ దుమారంలో చిక్కుకున్నారు. ఆయన రాజ్యసభలో చేసిన కొన్ని వ్యాఖ్యలతో అంబేద్కర్ మీద అనుచితంగా వ్యాఖ్యలు చేశారంటూ విపక్షాలు నాన్ స్టాప్ గా ఆందోళనలు చేస్తున్నాయి. పార్లమెంట్ బయట కూడా బీజేపీ ఇండియా కూటమి ఎంపీల మచ్చ రచ్చ కూడా జరిగింది. అమిత్ షా అంబేద్కర్ గురించి మాట్లాడుతూ దేవుడి పేరుని పదే పదే తలచుకుంటే స్వర్గానికి పోతారు అని కామెంట్స్ చేశారు. అయితే హోం మంత్రి పూర్తి పాఠాన్ని వినకుండా కట్ చేసి ఇలా ఇవ్వడం వల్లనే చిక్కులు వచ్చాయని బీజేపీ అంటోంది. ఆయన అంబేద్కర్ ని ఏమీ కామెంట్స్ చేయలేదని అంబేద్కర్ పేరుతో రాజకీయం చేస్తున్న వారి మీదనే సెటైర్లు వేశారని అంటోంది. ఇదిలా ఉంటే ఎన్డీయేలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ ఈ విషయంలో తన స్టాండ్ ఏంటో చెప్పాలని ఆప్ అధినేత ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఒక లేఖను బాబుకు సంధించిన విషయం విధితమే. అయితే బాబు ఓపెన్ గా మీడియాతో దీని మీద ఏమీ కామెంట్స్ చేయకపోయినా గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతూ అంబేద్కర్ మీద అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తప్పుగా చిత్రీకరిస్తున్నారు అని అన్నట్లుగా చెబుతున్నారు. గతంలో తన విషయంలోనూ ఇలాగే జరిగిందని వ్యవసాయం దండుగ అని తాను అన్నట్లుగా లేని దానిని ప్రచారం చేశారని బాబు గుర్తు చేసుకున్నారు. మరో వైపు చూస్తే అంబేద్కర్ ని బీజేపీ గౌరవించిందని భారత రత్నను ప్రకటించిందని బాబు అన్నారు. అలాగే వీపీ సింగ్ ప్రధానిగా ఉండగా పార్లమెంట్ లో ఆయన విగ్రహాన్ని స్థాపించారని కూడా చెప్పారు. అదే కాంగ్రెస్ టైం లో అంబేద్కర్ ని ఎన్నికల్లో పోటీ చేస్తే ఓడించారని కూడా బాబు అన్నారు. మొత్తానికి అమిత్ షాకు అండగా నిలబడి పూర్తిగా బాబు మద్దతు ఇచ్చిన వైనంగా దీనిని చూస్తున్నారు. అంతే కాదు అంబేద్కర్ కి ఎవరు గౌరవించారు అన్న దాని మీద డిబేట్ జరగాలని కూడా బాబు కోరుకున్నారు. ఈ నేపథ్యంలో చూస్తే అమిత్ షా వ్యాఖ్యలకు అనుకూలంగా వ్యతిరేకంగా దేశంలోని పార్టీలు చీలి పోయి తమ కామెంట్స్ చేస్తున్నాయి. చిత్రంగా ఏపీలో విపక్షంలో ఉన్న వైసీపీ మాత్రం దీని మీద ఎలాంటి కామెంట్స్ చేయడం లేదు. జగన్ ఈ విషయంలో సైలెంట్ గానే ఉన్నారని తెలుస్తోంది అంటున్నారు. బీజేపీతో పొత్తులో ఉన్న కారణంగానే బాబు స్పందించారు అని వైసీపీ బయట ఉన్న పార్టీ కాబట్టి రియాక్ట్ కానవసరం లేదని అంటున్న వారూ ఉన్నారు. అయితే బీజేపీ కొన్ని విధానాల పట్ల వైసీపీ ఆలోచన చేస్తోందని ముఖ్యంగా వక్ఫ్ బోర్డు బిల్లు విషయంలో వ్యతిరేకిస్తోందని గుర్తు చేస్తున్నారు.

ఇపుడు అమిత్ షా వ్యాఖ్యల మీద ఒక రాజకీయ పక్షంగా వైసీపీ మౌనమే తన స్టాండ్ అని చెప్పడం ద్వారా న్యూట్రల్ విధానమే ఎంచుకుందని అంటున్నారు. ఏది ఏమైనా బీజేపీ టీడీపీ పొత్తులు ఉన్నాయి కాబట్టి బీజేపీకి పెద్దగా వైసీపీ అండ ఉండదని చెప్పడమూ ఇందులో ఉన్న మరో సంకేతం అని అంటున్నారు. ఇక ఇండియా కూటమి మొత్తం అమిత్ షా వ్యాఖ్యలను తప్పుపడుతోంది. జాతీయ రాజకీయాల్లో వైసీపీది తటస్థ విధానం కాబట్టే ఇలా సైలెంట్ గా ఉందని కూడా అంటున్నారు.

# శ్రీనివాస్ గౌడ్ కు షాక్!

## టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సీరియస్!

తెలంగాణ విడిపోయిన సమయంలోనే కానీ, గత వైసీపీ ప్రభుత్వంలో కానీ తమకు ఇబ్బందులు లేవని.. ఇప్పుడు మాత్రం తెలంగాణ రాష్ట్రానికి చెందిన భక్తులపై వివక్ష చూపుతున్నారంటూ తిరుమల తిరుపతి దేవస్థానంపై మాజీ మంత్రి, బీఆరెస్స్ నేత శ్రీనివాస్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై టీటీడీ ఛైర్మన్ సీరియస్ గా స్పందించారు. అవును... గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్... తెలంగాణకు చెందిన భక్తులపై తిరుమలలో వివక్ష చూపుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణలో పుట్టిన ప్రతీ బిడ్డ.. శ్రీవారిని దర్శించుకుని, తలనీలాలు సమర్పించుకుంటారని అన్నారు. ఇదే సమయంలో... గతంలో ఏపీ తెలంగాణ విడిపోయిన సమయంలో తెలంగాణ భక్తులకు కొండపై అన్ని రకాల సౌకర్యాలు కల్పించేవారని.. అప్పట్లో ఎలాంటి వివక్షా చూపించలేదని.. వైసీపీ హయాంలో కూడా ఎటువంటి వివక్ష లేదని.. అయితే, ఈ



మధ్యకాలంలో మాత్రం తెలంగాణ భక్తులపై తిరుమలలో వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈ ఆరోపణలపై తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పందించారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. ఇందులో భాగంగా... తిరుమల పవిత్ర క్షేత్రమని.. ఇది రాజకీయ వేదిక కాదని.. రాజకీయంగా తిరుమలను ఏ ఒక్కరూ వేదికగా చేసుకున్నా చర్యలు తప్పవని గతంలోనే హెచ్చరించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో... తిరుమల పవిత్రతను కాపాడే విషయంలో వెనకడుగు వేయకూడదనే తమ పాలకమండలి తొలి సమవేశంలోనే ప్రత్యేక ఎజెండాగా ఈ విషయంపై చర్చించి నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఈ సందర్భంగా... తిరుమల కొండపై రాజకీయ వ్యాఖ్యలు చేస్తే అది ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా... ఇటీవల తెలంగాణకు చెందిన ఒక నేత తిరుమల వేదికగా రాజ్యకీయ వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపిన టీటీడీ ఛైర్మన్... అతనిపై చర్యలకు ఆదేశిస్తున్నట్లు పేర్కొన్నారు.

# మహిళా మంత్రి ఫిర్యాదు...

## లైంగిక వేధింపుల కేసులో బీజేపీ ఎమ్మెల్సీ అరెస్ట్!

ఈ నెల 9వ తేదీ నుంచి కర్ణాటక శాసనసభ శీతాకాల సమావేశాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సమావేశాల్లో ఓ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా.. తనను కించపరిచేలా ప్రవర్తించారంటూ ఓ మహిళా మంత్రి ఫిర్యాదు చేయడంతో.. బీజేపీ ఎమ్మెల్సీ పై కేసు నమోదు చేసిన పోలీసులు, అతన్ని అరెస్ట్ చేశారు. అవును... కర్ణాటక లెజిస్లేటివ్ కౌన్సిల్ లోని భారతీయ జనతాపార్టీ సభ్యుడు సిటీ రవిపై ఎఫ్.ఐ.అర్. నమోదు కావడంతో ఆయనను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. అంతకముందు రోజు శాసన మండలిలో



కాంగ్రెస్ నాయకురాలు, కర్ణాటక మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ పై కించపరిచే పదాన్ని ఉపయోగించారని కేసు నమోదైంది. తనను కించపరిచేలా మాట్లాడారంటూ మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ పై హిరేబాగేవాడీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో.. భారత న్యాయ సంహిత (బీ.ఎన్.ఎస్.) సెక్షన్ 75 (లైంగిక వేధింపులు), సెక్షన్ 79 (పదాలు, సంజ్ఞలు, శబ్ధాలతో స్త్రీ అణకువను అవమానించే చర్య) కింద కేసు నమోదు అయ్యింది. ఈ నేపథ్యంలో గురువారం అరెస్ట్ చేశారు.

ఈ నేపథ్యలో రవిని బెంగళూరు తీసుకొచ్చి, శుక్రవారం ప్రజాప్రతినిధుల కోర్టులో హాజరుపరచనున్నట్లు చెబుతున్నారు. దీంతో... ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. కాగా... బెళగావిలోని కర్ణాటక అసెంబ్లీ శీతాకాల సమావేశాల చివరి రోజైన గురువారం రాష్ట్ర మహిళా మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ శాసన మండలిలో ప్రసగింస్తున్నారు.

ఈ సమయంలో బీజేపీ ఎమ్మెల్సీ సిటీ రవి.. తనపై అసభ్యకరమైన పదాన్ని ఉపయోగించారని ఆమె ఆరొపించారు. దీనిపై మండలి ఛైర్మన్ కు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో.. ఈ వ్యవహారంపై స్పందించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య.. అటూంటి బాషను ఉపయోగించడం లైంగిక వేధింపులకు పాల్పడటం కిందకే వస్తుందని పేర్కొన్నారు!

చురకలు

## సంపాదకీయం

# హైదరాబాద్ టు యూకే... ఏమిటీ ఫార్ములా-ఈ రేస్ స్కామ్?

నాటి మున్సిపల్ శాఖ మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్ ను ప్రధాన నిందితుడి (ఏ1) గా పేర్కొం టూ కేసు నమోదు చేసింది తెలంగాణ ఏసీబీ. దీంతో.. ఈ విషయం ఒక్కసారిగా తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో నమోదైన ఈ కేసు ఎఫ్.ఐ.ఆర్.తో సంచలన విషయాలు తెరపైకి వస్తున్నాయని అంటున్నారు. అవును... ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో బీఆరెస్స్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పై తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో కేటీఆర్ తో పాటు మున్సిపల్ శాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ (ఏ2), హెచ్.ఎం.డీ.ఏ. అప్పటి చీఫ్ ఇంజినీర్ బీ.ఎల్.ఎన్. రెడ్డి (ఏ3) లనూ ఎఫ్.ఐ.ఆర్. లో చేరింది.

**ఏమిటీ ఫార్ములా-ఈ రేస్ స్కామ్మ్..?** ఫార్ములా ఈ-రేసుల నిర్వహణ కోసం భారత చట్టాల ప్రకారం నమోదైన 'ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్'.. యూకే చట్టాల ప్రకారం నమోదైన 'ఫార్ములా-ఈ ఆపరేషన్స్' (ఎఫ్.ఈ.ఓ) సంస్థ.. 'తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ %డ% అర్బన్ డెవలప్మెంట్' మధ్య ఫార్ములా ఈ-రేస్ నిర్వహణ కోసం అక్టోబర్ 25 - 2022న త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఈ మూడింటి మధ్య కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం... ఈవెంట్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్ అయిన ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ భరించాలని.. ట్రాక్ ను హోస్ట్ సిటీ అయిన తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ - అర్బన్ డెవలప్మెంట్ (ఎంఏయూడీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సమయంలో ఫిబ్రవరి 11 - 2023న జరిగిన ఈ ఈవెంట్ కోసం ఎంఏయూడీ తరుపున హైదరాబాద్ మెట్రో డెవలప్మెంట్ కార్పొరేషన్ అథారిటీ (హెచ్.ఎం.డీ.ఏ) రూ.12 కోట్లు వెచ్చించగా.. రేసు నిర్వహణ ఖర్చును స్పాన్సర్ అయిన ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ భరించింది. ఈ క్రమంలో... ఎఫ్.ఈ.వో., ఏస్ నెక్స్ట్ జెన్ మధ్య విభేధాలు తలెత్తాయి. దీంతో... 2023 మే నాటికి రేసు నిర్వహణ ఖర్చుల చెల్లింపుల్లో బకాయిలు పేరుకుపోయాయి. ఈ సమయంలో.. హెచ్.ఎం.డీ.ఏ., ఎఫ్.ఈ.వో. మధ్య చర్చలు జరిగాయి. ఇందులో... స్పాన్సర్ ఆ సొమ్మును ప్రభుత్వం చెల్లించే అవకాశాలపై చర్చించారు. ఈమేరకు హెచ్.ఎం.డీ.ఏ. అప్పటి కమిషనర్ అరవింద్ కుమార్.. కేటీఆర్ కు ప్రతిపాదనలు పంపారు. ఇందులో భాగంగా... స్పాన్సర్ గా ఏస్ నెక్స్ట్ జెన్ వైదొలగడంతో ప్రమోటర్ గానూ, హోస్ట్ సిటీగానూ హెచ్.ఎం.డీ.ఏ.నే వ్యవహరించాలని ప్రతిపాదించారు! దీనికి అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి హోదాలో కేటీఆర్ ఆమోదించారు. అనంతరం.. రుసుములు, పన్నుల కింద సుమారు రూ.110 కోట్లు (90 లక్షల గ్రేట్ బ్రిటన్ పౌండ్లు) మంజూరు చేశారు. వీటితో పాటు పాటు రేసు నిర్వహణకు అయ్యే పనుల నిమిత్తం మరో రూ.50 కోట్లు మంజూరు చేశారు.

**హైదరాబాద్ టు యూకే మనీ ట్రన్స్ ఫర్!:** హెచ్.ఎం.డీ.ఏ., ఎఫ్.ఈ.వో. మధ్య జరిగిన ఒప్పందం మేరకు ప్రమోటర్ ఛార్జెస్ కింద మొదటి వాయిదాగా రూ.22.69 కోట్లు, రెండో వాయిదాగా రూ.23.01 కోట్లతో పాటు టాక్సులు, కమిషన్లూ చెల్లించాలని ఎఫ్.ఈ.వో. నుంచి హెచ్.ఎం.డీ.ఏ. కు ఇన్వాయిస్ లు అందాయి. దీంతో.. అక్టోబర్ 3 - 2023న మొదటి వాయిదా, అదే నెల 11 న రెండో వాయిదా సొమ్ము చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు హెచ్.ఎం.డీ.ఏ. అప్పటి చీఫ్ ఇంజినీర్ బీ.ఎల్.ఎన్. రెడ్డి ప్రొసీడింగ్స్ ఇచ్చారు. దీంతో... అక్టోబర్ 11 - 2023న హైదరబాద్ లోని హిమాయన్ నగర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ నుంచి యూకే ఎఫ్.ఈ.వో. అకౌంట్ కు నేరుగా మొత్తం సొమ్ము బదిలీ అయ్యింది. ఈ సమయంలో.. విదేశీమారకద్రవ్యం చెల్లింపులకు సంబంధించి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు! దీంతో... హెచ్.ఎం.డీ.ఏ అదనంగా ఇన్ కం ట్యాక్స్ డిపార్ట్మెంట్ కు రూ.8.06 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. మరోవైపు ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియాకు పర్మిట్ ఫీజు, ఇంటర్ స్టేట్ ఛాంపియన్ షిప్ రుసుం కింద హెచ్.ఎం.డీ.ఏ. రూ.1.10 కోట్లు చెల్లించింది! అయితే... హెచ్.ఎం.డీ.ఏ నిబంధనల ప్రకారం రూ.10 కోట్ల కంటే ఎక్కువ ఎవరికైనా చెల్లించాల్సి వస్తే తప్పనిసరిగా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలి! అయితే.. అలాంటి అనుమతులు ఏమీ లేకుండానే సాధారణ నిధుల నుంచి మొత్తం రూ.54.88 కోట్లు చెల్లించింది హెచ్.ఎం.డీ.ఏ.. అని ఏసీబీ ఎఫ్.ఐ.ఆర్. లో పేర్కొంది!

**కేటీఆర్ రియాక్షన్ ఇదే!:** ఇలా తనపై తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేయడంపై కేటీఆర్ స్పందించారు. ఇందులో భాగంగా... ఫార్ములా - ఈ రేసు వ్యవహారంలో తాను ఎలాంటి తప్పు చేయలేదని.. అసలు ఆ వ్యవహారంలో అవినీతే జరగలేదని.. మరి అవినీతే లేనప్పుడు ఏసీబీ కేసు ఎక్కడుంది? అని అన్నారు. వీటిని రాజకీయ వేధింపులుగా అభివర్ణించారు. ఇందులో భాగంగా... ముఖ్యమంత్రి, ఆయన కుటుంబం చేస్తున్న అవినీతి, కుంభకోణాలను ఒక్కొక్కటిగా బయటపెడుతున్నందుకే ఇదంతా అని అన్నారు. అయితే... తాము ఉద్యమకారులమని, ఎన్ని కేసులు పెట్టుకున్నా భయపడేది లేదని అంటూ... "నువ్వు మా వెంట్రుక కూడా పీకలేవ్" అని స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యారు.


# తెలుగు భాషకు "వేదం" ఎనలేని సేవ - డిసెంబర్ 21...వేదం వెంకట రాయ శాస్త్రి జయంతి



పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధమున భారత దేశమంతటా అన్ని భాషలలో నూతన వికాసానికి తెర లేచింది. పాశ్చాత్య నాగరికత, అంగ్ల విద్య ప్రభావాలు ప్రజల వేష భాషలపై అనూహ్య ప్రభావాలు చూపాయి. ఇందుకు తెలుగు భాష, ప్రజలకు మినహాయింపు ఏమీ లేకుండే. ఆ సంధి కాలంలో వేంకటరాయ శాస్త్రి ఆగమనము ఆంధ్రవ్మాయమున క్రొత్త యుగమును సూచిక అయింది. వేదం వెంకట రాయ శాస్త్రి అంటే ఒక ప్రాచీన పండితుడిని తప్ప, అయన గొప్పతనం గురించి, ఆయన తెలుగు భాషకు చేసిన అమూల్య, అపూర్వ సేవల గురించి, అయన చూపిన నూతన మార్గాల గురించి నేటి తరంలో చాలా మందికి తెలియదు. కనీసం శాస్త్రి ఏమి రచనలు చేశారో కూడా నేటి సాహిత్యాభిమానులకు తెలియదు. గద్య పద్య నాటక విమర్శకాది విషయములలో శాస్త్రి చూపినా మార్గములు అనేకాలు. నాటి కాలంలో శాస్త్రి గ్రంథములు విమర్శకు గురి అయినట్లు ఆధునికులలో ఎవ్వరి గ్రంథాలు కాలేదన్నది వాస్తవం. సుప్రసిద్ధ పండితుడు, కవి, విమర్శకుడు , నాటకకర్త అయిన వేదం వేంకటరాయ శాస్త్రి... వేంకట రమణశాస్త్రి, లక్ష్మమ్మ దంపతులకు డిసెంబర్ 21, 1853న చెన్నైలో జన్మించారు. 1886లో మద్రాసు క్రైస్తవ కళాశాలలో సంస్కృత పండిత పదవిని 25 సంవత్సరాలు సమర్థవంతంగా నిర్వహించారు. 1887లో బి.ఎ. పరీక్షలలో ఆంగ్లం, సంస్కృతంలలో ప్రథమస్థానంలో ఉత్తీర్ణుడయ్యారు. పరవస్తు చిన్నయసూరికి సహపాఠు లైన, సంస్కృతాంధ్రములలో గొప్ప పండితులు అయిన తండ్రి వేంకటరమణ శాస్త్రి ప్రభావం వేంకట రాయ శాస్త్రి పై పడింది. దాని ప్రభావం వ్యవహార భాషా సాంప్రదాయం అనుసరణకు ప్రేరణ అయింది. 1899లో తెలుగు భాషాభిమాని నాటక సమాజాన్ని స్థాపించారు. ఈ సంస్థలో వెంకటరాయ శాస్త్రి వ్రాసిన నాటకాలని ప్రదర్శించేవారు. ఆయన మూల నాటకాలలో 1897లో వ్రాసిన ప్రతాపరుద్రీయ నాటకం, 1901లో వ్రాసిన ఉషా నాటకం ప్రముఖమైనవి. అనేక సంస్కృత నాటకాలను తెనుగించారు. 1916లో సూర్యారాయాంధ్ర నిఘంటువుకు ప్రధాన సంపాదకుడుగా కొంతకాలం పనిచేశారు. అముక్తమాల్యద, శృంగార నైషధ తదితర వ్యాఖ్యలు శాస్త్రి పాండిత్యానికి నిలువుటద్దాలు. ఆముక్త వ్యాఖ్య శతాధిక వసంతాల ను చూసింది. 24-6-1920 నాడు ప్రారంభించి 20-10-1920 నాటికి పూర్తి చేసినట్లు ఆయనే తన జీవిత చరిత్రలో సుస్పష్టంగా చెప్పు కున్నారు. ఆముక్తమాల్యద - సంజీవినీ వ్యాఖ్య, భోజ చరిత్రము, శ్రీకృష్ణ దేవరాయ, విజయము-నాటకము కథా సరిత్సాగరము పలు భాగాలు, దశకుమార చరితం, శతక వ్మాయ చరిత్ర - ప్రథమ సంపుటం, చరిత్ర రచన - ప్రథమ భాగం, తెనుగు లఘు వ్యాకరణము వ్యామోహము తదితరుల అయన ప్రముఖ రచనలు. నాగానందం, బొబ్బిలి యుద్ధం, ఉత్తరరామ చరిత, ఆంధ్ర విక్రమోర్వశీయ, ప్రతాపరుద్రీయ, ఉషా నాటకము ప్రియదర్శికాది నాటకములు, అమర కావ్యం, ఆంధ్ర హితోపదేశము - చంపువు, శ్రీ శారదా కాంచిక, ఆంధ్ర బిల్హణియము, విక్రమార్క చరిత్రము, కావ్యాలంకార చూడామణి, మేఘ సందేశం వ్యాఖ్యానం, ఉదయన చరిత్రము, భరతాభారత రూపక మర్యాదలు, తిక్కన సోమయాజి విజయము, ఆంధ్రవ్యాకరణ సర్వస్వ తత్త్వము, ఆంధ్ర భాషా సర్వస్వ నియమ కతిపయములు, ఆంధ్ర సాహిత్య దర్పణము, విమర్శ వినోదము, ఆంధ్ర ప్రసన్నరాఘవ విమర్శనము తానాషా అక్కన్న మాదన్నలు, ఆంధ్ర రత్నావళీ నాటిక, సారంగధర చరిత్రము, పుష్పబాణ విలాసం, రసమంజరీ, కుమార సంభవము వ్యాఖ్య, ఉదయన చరిత్రము, పంచ తంత్రం, ఆంధ్ర దశకుమార చరిత్రము తదితర రచనలు గావించారు. 1920లో ఆంధ్ర మహా సభ చేత 'మహోపాధ్యాయ' బిరుదు పొందారు. 1922లో ద్వారక పీఠ శంకరభగవత్పాదులచేత 'సర్వతంత్ర స్వతంత్ర', 'మహామహోపాధ్యాయ', 'విద్యాదానవ్రత మహోదధి' అనే సత్కారాలు పొందారు. 1927లో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు చేత 'కళా ప్రపూర్ణ' గౌరవంతో సన్మానించబడ్డారు. 1958లో కుమార సంభవ ప్రబంధకర్త నన్నెచోడుని కవిత్వంపై వీరు రాసిన 'నన్నెచోడుని కవిత్వము' అనే విమర్శనా గ్రంథానికి 'ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి' బహుమతి లభించింది. వెంకటరాయ శాస్త్రి 1929, జూన్ 18న మద్రాసులో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# బాల సాహిత్యంలో ధృవ తార అవసరాల - డిసెంబర్ 21...అవసరాల రామకృష్ణారావు జయంతి


అవసరాల రామకృష్ణారావు ప్రముఖ సాహితీవేత్త, నవలా రచయిత. తెలుగు సాహిత్యం బతికి బట్ట కట్టినంత కాలం గుర్తుంచుకునే కథా కురు పితా మహుడు ఆయన. 1931, డిసెంబర్ 21న చెన్నైలో జన్మించిన రామ కృష్ణారావు కు బాల సాహిత్యంలో అజరామరంగా నిలిచిన చందమామతో ఆయనకు గల బంధం, అనుబంధం విడదీయరానిది. ఏడు పదుల ఏళ్ళ కిందట తన 15 సంవత్సరాల తొలి సంధ్యలో చంద మామ 1947 జూలై - సంచికలో "పొట్టిపిచిక కథ" తో ప్రారంభిం చింది మొదలు మలి సంధ్యలో 80ఏళ్ళ వయసు వరకు రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన విశిష్ట కథా రచయిత . పొట్టి పిచిక కథ ప్రారంభ, ముగిం పులు ఇలా ఉంటాయి. అనగా అనగా ఓ వూర్లో వక పొట్టి పిచిక వుండేది. అదేం చేసింది. ఊరల్లా తిరిగి ఉలవగింజ, చేనల్లా తిరిగి సెనగ్గింజ పెరడల్లా తిరిగి పెసరగింజ ఇల్లాంటివి ఎన్నోగ్గింజలు పోగు చేసుకొని కొట్టి కొట్టి కొండంత రొట్టి చేసుకుంది. చేసుకుని, చింత చెట్టుమీద కూర్చుని, ఆపిచిక ఆ రొట్టెను ఎగరేసుకుంటూ ఎగరేసు కుంటూ, తింటూ ఉంటే, చీమ తలకాయంత ముక్క చెట్టు తొర్రలో పడిపోయింది. అప్పుడు ఈగ ఏం చేసింది. వెంటనే వెళ్లి ఆవు చెవులో దూరి నానా అల్లరి చేసింది. ఆవు ఆ బాధ భరించలేక అతని తన్నింది. తాతకి కోపం వచ్చి అవ్వని కొట్టాడు. అవ్వకు ఒళ్లు మండి పిల్లి మీద వేడి పాలోపింది, పిల్లి కోపం కొద్దీ ఎలక వెంట పడింది. ఎలక భరించలేక బోయ చెప్పులు కొరికింది. బోయ కోపం తీర్చుకోడానికి లేళ్ల కాళ్లను విరగ కొట్టేడు. లేళ్లు కోపంతో రాజుగారి తోటను పాడుచేశాయి. రాజుకి బుద్ధివచ్చి, వడ్డంగిని శిక్షించేడు. వడ్రంగి చచ్చినట్టు చెట్టును నరికి, తొర్ర తవ్వి చీమ తలకాయంత రొట్టె ముక్కను చేతిలో పెట్టాడు. పిచిక **మళ్లీ ఎగవేసుకుంటూ ఆ రొట్టె ముక్కను కమ్మగా తిన్నది...** ఒక చిన్న ప్రాణి, తాను కష్టపడి సంపాదించుకున్న చిన్న రొట్టె ముక్కను పోగొట్టుకుని, ఎవరి సాయం పొందక పోయినా, పట్టిన పట్టు విడువని చిన్ని జీవి నైజం, చివరకు అనుకున్నది సాధించిన వైనంకు సంబంధించిన కథ ఇది. 'పొట్టి పిచిక కథ' రచనే తన విజయ సూత్రం అవుతుందని ఆనాడు, ఏనాడూ అనుకోలేదని చెప్పేవారు. పదిహేనేళ్ల ప్రాయంలో రాసిన, ఈ కథ ఇచ్చే సందేశం నిజంగా అద్భుతం. వెయ్యి పైగా రచనలు చేసి, తల వంచక, కలం దించక తెలుగు కథకుడిగా కొనసాగిన సుదీర్ఘ సాహితీ వ్యాసంగంలో పక్షులతో జంతువులతో మనుషుల్ని కలిపి సామాజికాంశాల్ని అలవోకగా కథా వస్తువులుగా చేసు కోవడానికి చందమామ పత్రికనే భూమిక అని చెప్పేవారు. చందమామ కథ ఇచ్చిన ఊపుతో తాను రాసిన సుప్రసిద్ధ పిల్లల రచనల్లో 'కేటూ డూప్లికేటూ,' 'మేథ మేట్రిక్స్,' మూడు భాగాలూ, 'ఆంగ్రేజీ మేడీజీ,' 'ఆంగ్రేజీ యమ ఈజీ' వంటి అరడజను రచనలు భాగమని కూడా ఆయన ఘనంగా చెప్పుకున్నారు. తెలుగులో నవలలు, కథలు వెయ్యికి పైగా రాసి వన్నెకెక్కిన కథా రచయితగా పేరు తెచ్చుకున్నారు. ఆయన తుని ఎస్సార్ ఉన్నత పాఠశాలలో లెక్కలు, సైన్సు బోధించారు. ఒరిస్సాలో ఇంగ్లీషు రీడర్ గా పని చేశారు. విశాఖ పట్నంలో ఇంగ్లీషు లెక్చరర్ గా పనిచేశారు. వృత్తి జీవితమంతా ఆంగ్ల భాష బోధించినా, తెలుగు భాష పై ఉన్న వ్యామోహంతోనే దశాబ్దాల కాలంలో వెయ్యికి పైగా రచనలు మాతృ భాష లోనే చేశారు. ఆధునిక సమాజం తెస్తున్న మార్పుల్లో కొన్నింటికి దూరంగానే ఉన్నానని అంగీకరించారు. తను పాటించే నీతికి విరుద్ధమని తోచిన సందర్భాలలో, ప్రచురణకు పంపకుండా ఎన్నో రచనలను ఆయన అముద్రితంగా ఉంచు కున్నారు. "మనం మనుష్యులం, సహజీవన సౌభాగ్యం, ఇంకానా అంతరాలు?, అడుగో మావయ్య, ఆ వెనకే మేరీ, సంపెంగలూ, సన్న జాజులూ, మేం చేసిన తప్పు మీరూ చేస్తారా?, అది ప్రశ్న, ఇది జవాబు, హెడ్మిస్ట్రెస్ హేమ లత, పేక



ముక్కలు, కథావాహిని, గణిత విశారద, కేటూ, డూప్లికేటూ, అర్థమున్న కథలు, రామ చిలుక, మోహన రాగం, మేథమే ట్రిక్స్-1, మేథ మేట్రిక్స్-2, మేథమే ట్రిక్స్-3, అంగ్రేజీ మేడీజీ" తదితర రచనలు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం (1969), తెలుగు విశ్వ విద్యాలయం హాస్య రచయిత పురస్కారం (1994), జ్యేష్ఠ లిటరరీ అవార్డు ( 1998), కొలసాని చక్రపాణి అవార్డు (1999), ఢిల్లీ తెలుగు ఎకాడమీ ఉగాది పుర స్కారం (2000), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తెలుగు వైభవం పురస్కారం (2004) తదితర అవార్డులు, పురస్కారాలు ఆయనకు లభించాయి. చందమామకు తన చివరి కథలు పంపి, బాల సాహిత్యానికి తన అవసరం తీరిందనుకున్నారేమో, అవసరాల 2011, నవంబర్ 28 న హైదరాబాదులో తుది శ్వాస విడిచి, ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# హనుమ అంటే గుర్తొచ్చేది అర్జానే - డిసెంబర్ 21...అర్జా జనార్ధన్ రావు జయంతి



పౌరాణిక చిత్రాలలో హనుమంతుని వేషం ధరించి, తెలుగు ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న నటుడు అర్జా జనార్ధన్ రావు. హనుమ అనగానే గుర్తువచ్చే విధంగా ఆయన దేహ దారుఢ్య రూపం, నటన అలా ఆంజనేయుని ప్రతిరూపంగా ఉండేవి. హనుమంతుడే ప్రత్యక్షంగా కనిపిస్తున్నా డా అన్నంతగా, ఆయన ఆ పాత్ర పోషణలో లీనమై నటించే వాడు. అర్జా జనార్ధనరావు (డిసెంబర్ 21, 1926 - నవంబర్ 4, 2007) ప్రసిద్ధ తెలుగు నాటక, సినిమా నటుడు. అర్జా జనార్ధన రావు 1926 డిసెంబరు 21న కాకినాడలో జన్మించాడు. స్వస్థలం కాకినాడలోనే బి.ఎ., బి.ఎస్.సి చదువుకున్నాడు. చదువుకొనే సమయంలోనే ఆయనకు నాటక రంగంలో కొంత అనుభవం కలిగింది. ఆయనకు చిన్నతనం నుండి ఆటలమీద, కసరత్తులు చేయడం మీద ఉత్సాహం ఉండేది. ఆ ఉత్సాహమే ఆయనను మిస్టర్ ఆసియా, మిస్టర్ హెర్క్యులస్ (1954), మిస్టర్ ఇండియా (1955)గా ఎన్నిక చేసింది. అయన శబ్దగ్రహణ శాఖలో డిప్లొమా చదివి కొన్నాళ్ళు శ్యామలా స్టుడియోలో రికార్డిస్ట్‌గా పనిచేశాడు. లవకుశ (1963)బీ శ్రీకృష్ణావతారం (1967)బీ వీరాంజనేయ (1968)బీ శ్రీ రామాంజనేయ యుద్ధం (1974)బీ ముత్యాల ముగ్గు (1975)బీశంకరా భరణం (1979)బీ త్యాగయ్య (1981)బీ శ్రీ ఆంజనేయ చరిత్ర (1981)బీ దేవాంతకుడు (1984)బీ తదితర చిత్రాలలో జనార్ధన్ రావు విభిన్న పాత్రలు పోషించారు. 2007 నవంబరు 4 (వయసు 80)న ఆయన మరణించాడు. డిటెక్టివ్ నవలా రచయిత విశ్వప్రసాద్ కథ, మాటలు సమకూర్చిన, 1969 జూలై 25న సినిమా విడుదలైన, కృష్ణ, గుమ్మడి, ఎస్వీ రంగారావు, వాణిశ్రీ లు ప్రధాన పాత్రధారులుగా ఉన్న జగత్ కిలాడీలు' చిత్రంలో జనార్ధన్ రావు భిన్నమైన పాత్రలో నటించాడు. ఈ సందర్భంగా రామాంజనేయ యుద్ధం చిత్రంలో ఒక పాటను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. జనార్ధన్ రావు ... ఆంజనేయ పాత్రలో లీనమై నటించగా, ఆ సన్నివేశంలో, ఆయన హావభావాలు నాటి సినిమా ప్రియులు ఎన్నటికీ మరచి పోలేనివి. 1975లో పొట్లూరి వెంకట నారాయణ, ఎన్.ఎస్.మూర్తి కలిసి శ్రీరామాంజనేయ యుద్ధం పేరుతో కలర్ సినిమా నిర్మించారు. బాపు దర్శకత్వం వహించిన సినిమాకు ముళ్లపూడి వెంకటరమణ మాటలు రాయకుండా ఉన్న అరుదైన సినిమా శ్రీ రామాంజనేయ యుద్ధం. బాపు-ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి సినిమా శ్రీరామాంజనేయ యుద్ధం. గతంలో గబ్బిట వెంకటరావు రాసిన పద్యనాటకం లోని పద్యాలను యధాతథంగా వాడడంతో సంభాషణలు కూడా అతని చేత రాయించారు. ఎన్టీఆర్ రాముడిగా, అర్జా జనార్దనరావు ఆంజనేయుడుగా, బి.సరోజదేవి సీతగా, ధూళిపాళ్ల యయాతిగా నటించిన ఈ చిత్రానికి కె.వి.మహదేవన్ సంగీతం సమకూర్చారు. ఇందులో ఆంజనేయుడు ఆలపించే రెండు ఆర్ద్రమైన పాటలను వినూత్నంగా ఉంటుందని రఘురామయ్య చేత పాడించారు. వాటిలో మొదటిది 'రామ నీలమేఘ శ్యామా కోదండరామా' కాగా, రెండవది 'శరణు శరణయా జానకిరామా, కరుణ జూపవా మారుతిపై సాకేత సార్వభౌమా' అనే పాట. ఈ రెండవ పాటకు కె.వి. మహదేవన్ ఒక హిందీ పాట బాణీని అనుకరించడం వింతగా చెప్పుకున్నారు. అందుకు కారణం...మహదేవన్ ఎప్పుడూ ముందుగా ఇచ్చే బాణీకి పాట స్వరపరచ లేదు. కవి రాసిన ఎటువంటి పాటకైనా అద్భుతంగా బాణీలు కట్టటం మహదేవన్ నైజం. అందుకు భిన్నంగా 'సాకేత సార్వభౌమా' పాటకు మహదేవన్ అనుకరించిన హిందీ పాట దోస్తీ లోనిది. 1964లో రాజశ్రీ ప్రొడక్షన్స్ నిర్మాత తారాచంద్ బరజాత్యా సత్యన్‌బోస్ దర్శకత్వంలో నిర్మించిన సూపర్ డూపర్ హిట్ చిత్రం 'దోస్తీ'లో మహమ్మద్ రఫీ పాడిన 'చాహూంగా మై తుఝ్హే సాంఝ్ సవేరే...ఫీర్ భి కభీ అబ్ నామ్ కో తేరే ఆవాజ్ మై న దూంగా' మహదేవన్ అనుకరించడాన్ని విశేషంగా చెప్పుకుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ప్రతిభ ఉన్నా చిత్రసీమలో కొనసాగలేని శ్రీధర్ - డిసెంబర్ 21...సూరపనేని శ్రీధర్ జయంతి



సినిమా రంగంలో సమర్థత ఉండీ తగిన గుర్తింపు, అవకాశాలు రాని కళాకారులు ఎందరో. అలాంటి వారిలో అగ్రభాగాన నిలుస్తాడు ఒకనాటి హీరో శ్రీధర్ (ముత్యాల ముగ్గు సినిమా ఫేం). చిత్రసీమలో ముత్యాల ముగ్గు చిత్రంతో అడుగిడి, సహజ నటునిగా పేరెన్నిక గన్నా, మూడు దశాబ్దాల కాలంలో ఆయన 150 చిత్రాలలో విభిన్న పాత్రలలో రాణించినా, ఆశించిన స్థాయిలో, రీతిలో ముందుకు వెళ్ళలేక పోయాడు. ప్రతిభావంతమైన కళాకారుడైన శ్రీధర్ ఏనాడు వేషాలకోసం అర్థించలేదు. తనకు అవకాశం వచ్చిన సినిమాలలో నటించాడు. హీరోవేషాలు వస్తున్నప్పుడు శ్రీధర్‌చే ఎన్టిఆర్ తనస్వంత చిత్రం శ్రీరామ పట్టాభిషేకంలో గుహుడు వేషం వేయించారు. దాంతో శ్రీధర్‌కు వచ్చే హీరోవేషాలు కూడా రాకుండా పోయాయి. అంతకుముందు ఎన్టిఆర్ గుహుడు వేషానికి డ్రయివర్ రాముడులో సెకెండ్‌హీరో వేషానికి లింకుపెట్టి ఇచ్చారు. కానీ, డ్రయివర్ రాముడు చిత్రం హిట్‌కూడా శ్రీధర్‌ను మరిన్ని చిత్రాలలో హీరోని చేయలేక పోయాయి. సహాయ పాత్రలను తెచ్చి పెట్టాయి. ఇలా శ్రీధర్‌కు తాను నటించిన హిట్ చిత్రాలు ఆశించిన ప్రయోజనాన్ని కల్పించలేదు. జస్టిస్ ఛౌదరి సినిమాలో ఎన్టీ రామారావు కొడుకుగా నటించాడు. ఒకప్పుడు కృష్ణ నటించిన సినిమాలన్నింటి లోనూ శ్రీధర్ కనిపించేవాడు. అమెరికా అమ్మాయి, అడవి రాముడు, జస్టిస్ చౌదరి, కరుణామయుడు, ఈనాడు, బొమ్మరిల్లు, సీతా మహాలక్ష్మీ, యశోధకృష్ణ వంటి చిత్రాలు పేరు తెచ్చి పెట్టాయి. కృష్ణా జిల్లా, ఉయ్యూరు సమీపంలోని కుమ్మమూరు గ్రామంలో 1939 డిసెంబర్ 21 న ఒక దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన శ్రీధర్, తల్లా? పెళ్లామా? చిత్రంతో తెలుగు జాతి మనది అనే పాటలో విద్యార్థిగా సినీ రంగ ప్రవేశం చేశాడు. మచిలీపట్నంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకొని 1964లో హైదరాబాదుకు వచ్చి ప్రభుత్వ పనుల శాఖలో గుమాస్తాగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. ఉద్యోగం చేస్తూనే సాయంత్రం కళాశాలకు వెళుతూ బి.ఏ పూర్తిచేశాడు. కళాశాల సాంస్కృతిక విభాగంలో క్రియా శీలకంగా పనిచేస్తూ కార్యదర్శి అయ్యాడు. పరీక్ష, చీకటి తెరలు, అభాగ్యులు, సాలెగూడు, మండే కొండలు మొదలైన అనేక నాటకాల్లో ప్రధాన పాత్రలు పోషించాడు. ఈయన ప్రధానపాత్ర పోషించిన మంచుతెర అనే నాటకానికి గాను ఆంధ్ర నాటక కళా పరిషత్ నుండి ద్వితీయ బహుమతి అందుకున్నాడు. తల్లా? పెళ్లామా? (1970), విశాలి (1973), చక్రవాకం (1974), దేవదాసు (1974), మాంగల్య భాగ్యం (1974), ముత్యాల ముగ్గు (1975), యశోద కృష్ణ (1975), శ్రీరామాంజనేయ యుద్ధం (1975), అమెరికా అమ్మాయి (1976), దొరలు దొంగలు (1976), బంగారు మనిషి (1976), భక్త కన్నప్ప (1976), వెలుగు బాటలు (1976), అడవి రాముడు (1977), తరం మారింది (1977), మనవడి కోసం (1977), అంగడి బొమ్మ (1978), ఇంద్ర ధనుస్సు (1978), కరుణా మయుడు (1978), గోరంత దీపం (1978), పల్లెసీమ (1978) బొమ్మరిల్లు (1978), శ్రీరామ పట్టాభిషేకం (1978), సీతామాలక్ష్మి (1978), జూదగాడు (1979), డ్రైవర్ రాముడు (1979), బొట్టు కాటుక (1979), ఆడది గడప దాటితే (1980), కలియుగ రావణాసురుడు (1980) కోడళ్ళొస్తున్నారు జాగ్రత్త (1980), పొదరిల్లు (1980), బంగారు బావ (1980), మంచిని పెంచాలి (1980), సంధ్య (1980), సంసార బంధం (1980), దేవుడు మావయ్య (1981), మా పెళ్ళి కథ (1981), ఆపద్బాంధవులు (1982), ఈనాడు (1982), జస్టిస్ చౌదరి (1982), డాక్టర్ మాలతి (1982), కిరాయి కోటిగాడు (1983), నేటి చరిత్ర (1990), గోవిందా గోవిందా (1994) తదితర చిత్రాలలో ప్రతిభా వంతంగా నటించాడు. మూడు దశకాల పాటు సాగిన సినీ ప్రస్థానంలో సుమారు 150 సినిమాలలో నటించిన శ్రీధర్ తెలుగు సినిమా రంగములో ముత్యాల ముగ్గు సినిమాతో గుర్తింపు పొందాడు. సినిమాలలో సరైన అవకాశాలు లేక, టివి సీరియళ్ల కోసం అవకాశం వెతుక్కుంటూ వచ్చినా, నటించ డానికి ఇష్టపడలేదు. ఆ సీరియళ్లు నటిస్తే శ్రమ ఎక్కువ తప్పితే ఆర్థికంగా ఫలితాలు బహు తక్కువ అని తెలుసుకుని నటనకు దూరంగా ఉన్నాడు. స్వంతచిత్ర నిర్మాణాలపై ఆసక్తి కనబరచలేదు. చివరికి రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో ఉండి, విభిన్న పాత్రల్లో కనిపింపించిన శ్రీధర్ నటించిన చివరి చిత్రం గోవిందా గోవిందా.ఆయన ఊపిరితిత్తుల క్యాన్సర్ తో బాధపడుతూ, చికిత్స పొందుతుండగా గుండెపోటుతో జూలై 11, 2007 న మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# గంగాధర కూడలి.. ప్రమాదాల లోగిలి

గంగాధర: కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి.. గంగాధర, రామడుగు, బోయినపల్లి, కొడిమ్యాల మండలాల్లోని ఆయా గ్రామాలకు ప్రధాన కూడలి.. గంగాధర చౌరస్తా (మధురానగర్ గ్రామ పంచాయతీ). ఇక్కడి నుంచి రోజూ వేలాది వాహనాలు వెళ్తుంటాయి. ఎవరి ఇష్టమొచ్చినట్లు వారు వెళ్తారు.. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. ఆర్నెల్ల కిందట రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని బాలుడి మృతి చెందగా.. జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించి ఆక్రమణలు తొలగించింది. రెండేళ్లపాటు ట్రాఫిక్ నిబంధనలు అమలు చేసింది. తర్వాత వదిలేశారు. ఈనెల 14న గంగాధర ప్రధాన కూడలిలో మూడు ప్రమాదాలు జరిగాయి. వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం మరో వాహనాన్ని ఢీకొన్న



ఘటనలో కురిక్యాల ఎంపీటీసీ మాజీ సభ్యుడు అలువోజి నందయ్య ప్రాణాలు కోల్పోగా మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదేరోజు ఓ ప్రయాణికుడు బస్సులోంచి కింద పడిపోగా తీవ్రంగా గాయపడ్డారు. మరో ప్రమాదంలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు.

**రహదారులు ఆక్రమణ**

కొందరు దుకాణదారులు రోడ్డును ఆక్రమించారు. అక్కడికి వచ్చే వినియోగదారులూ తమ వాహనాలు రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఇటీవల స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సీపీ అభిషేక్ మహంతి, ఆర్టీసీ అధికారులతోనూ మాట్లాడారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు.

**రోడ్లపైనే ఆగుతున్న బస్సులు**

స్థానికంగా ప్రయాణ ప్రాంగణం ఉన్నా.. బస్సులు నామమాత్రంగానే అందులోకి వెళ్తున్నాయి. ప్రయాణికులు కూడా రోడ్లపైనే నిరీక్షిస్తున్నారు. ప్రైవేటు రవాణా వాహనాలను కూడా కూడలి నుంచి మరో చోటకు తరలించాలి. ఈ దిశగా ఆర్టీసీ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకుంటేనే తప్ప ప్రమాదాలు తప్పేలా లేవు.

**చర్యలు తీసుకుంటాం**

ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రధాన కూడలిలో ఇద్దరు పోలీసులను నియమించి ట్రాఫిక్ సమస్యలు తీర్చుతున్నాం. రహదారులపై ఆక్రమణలు తొలగిస్తాం. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సులు, ప్రయాణికులు ప్రయాణ ప్రాంగణంలోకి వెళ్లేలా జాగ్రత్తలు తీసుకుంటాం.– ఎస్సై నరేందర్‌రెడ్డి, గంగాధర

# వివరాలన్నీ.. ఆన్‌లైన్‌లో..!

నల్గొండ : రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. అందులో భాగంగా గణకులు, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఎలాంటి ఇబ్బందులకు, పొరపాట్లకు తావులేకుండా జిల్లా అధికారులు ఈ ప్రక్రియను నిరంతరం పరిశీలించారు. కాగా సేకరించిన కుటుంబాల వివరాలన్నీ గత నెలలో ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను మొదలు పెట్టారు. ఆన్‌లైన్ నమోదు కోసం ఒప్పంద ఉద్యోగులు, ప్రైవేటు ఆపరేటర్లకు ఒక్కో కుటుంబానికి రూ.14, రూ.30 చొప్పున చెల్లించనున్నారు. కాగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పూర్తి కావొచ్చింది. ప్రస్తుతం 99.02 శాతం ఆన్‌లైన్ నమోదును పూర్తి చేశారు. నమోదును ఎప్పటికప్పుడు పరిశీలించేలా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాగా మరో రెండు రోజుల్లో పూర్తి చేసేందుకు అధికారులు తీసుకుంటున్నారు.

**ఆన్‌లైన్‌లో 11.18 లక్షల కుటుంబాల వివరాలు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా 11,42,708 కుటుంబాల వివరాలు సేకరించారు. గత నెలలో ప్రారంభమైన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో ఇప్పటి వరకు 11,18,544 కుటుంబ వివరాలను నమోదు చేశారు. ఇంకా 24,164 నమోదు చేయాల్సి ఉంది. త్వరలో వాటిని కూడా నమోదు చేసేందుకు సిబ్బంది



సమాయత్తం అవుతున్నారు. వివరాల సేకరణలో భాగంగా కొందరు కుటుంబ సభ్యులు సిబ్బందికి సహకరించకపోవడంతో నిబంధనల ప్రకారం వివరాలు సేకరించలేకపోయారు. దీంతో ఆన్‌లైన్ నమోదుకు ఆలస్యమైందని అధికారులు పేర్కొంటున్నారు. అయినా సమష్టిగా సర్వేను పూర్తి చేసినందుకు, ఆన్‌లైన్ ప్రక్రియను దశకు తీసుకొచ్చినందుకు జిల్లా ఉన్నతాధికారులు సిబ్బందిని అభినందిం చారు.

**పత్రాలు భద్రపరిచేలా ఆదేశాలు**

సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసిన తరువాత పత్రాలను కట్టుదిట్టంగా భద్రపరిచేలా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. ఆన్‌లైన్ నమోదులో తప్పులు దొర్లితే మరోసారి వాటిని సరిచేసేందుకు పత్రాలు సహకరిస్తాయి. ఉమ్మడి జిల్లాలో నమోదు ప్రక్రియ మొత్తం పూర్తికాగానే పాలనాధికారి పర్యవేక్షణలో వాటిని ప్రత్యేక గదుల్లో భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

# ఆయకట్టులో.. సాగు సందడి

హుజూర్‌నగర్ : నాగార్జునసాగర్ ఆయకట్టుకు యాసంగి నీటి విడుదల అధికారికంగా ఖరారైంది. ఈనెల 15 నుంచి వచ్చే ఏప్రిల్ 23 వరకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన ఏడు విడతలుగా 81 రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆన్ ఆఫ్ పద్ధతిలో నీరు విడుదల చేస్తుండటంతో రైతులు వాటిని సక్రమంగా వినియోగించుకుని పంటలు పండించుకుంటున్నారు. నీటిని పొదుపుగా వాడుకుని డ్యామ్‌లోకి మళ్లీ నీరు వచ్చే వరకు వాడుకునేందుకు వీలుగా అధికారులు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతి పాటిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో సాగర్ ఆయకట్టు విస్తరించి ఉంది. ఈ రెండు జిల్లాల్లో 3.85 లక్షల ఎకరాలకు (ఎత్తిపోతలతో కలిపి) ఈ యాసంగిలో సాగునీరు ఆన్ ఆఫ్ పద్ధతిలో విడుదల చేయనున్నారు. మొత్తం ఏడు విడతల్లో నీటిని విడుదల చేస్తారు. మొదటి విడత మాత్రం నాట్లు జరుగుతున్నందున 27 రోజుల పాటు ఉంటుంది. తరువాత ఆరు విడతలుగా.. ప్రతి సారి 9 రోజుల పాటు నీటిని వదులుతారు.

# లక్ష్యం ఘనం... ఆచరణ శూన్యం




సిరిసిల్ల : కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల పట్టణంలో ఎక్కువగా నిరుపేదలు ఉంటున్నారు. వారికి కోసం గాంధీనగర్‌లో ఆహార నిధి (ఫుడ్ బ్యాంక్), గీతానగర్‌లోని రైతు బజార్‌లో వస్త్ర నిధి కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిని పట్టణ ప్రజలు వినియోగించుకోవడం లేదు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. పురపాలక సంఘం పరిధిలోని వివాహాలు, ఇతర శుభకార్యాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలను ప్రధాన కాలువలు, చెత్త కుప్పలు, పట్టణ శివారు ప్రాంతాల్లో పడేసి వెళ్తున్నారు.

కార్మిక క్షేత్రంలో చాలా మంది నిరుపేదలు తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆహార పదార్థాలను వృథా చేయకుండా ఫుడ్ బ్యాంకులో పెడితే ఇటువంటి వారికి ఉపయోగపడతాయి.

పట్టణంలోని రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మిగిలిపోయిన ఆహారం గాంధీనగర్‌లోని ఫుడ్ బ్యాంక్‌లో పెడితే నిరుపేదలకు కడుపు నిండుతుంది. అధికారులు దీనిపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

**నిరుపయోగంగా వస్త్ర నిధి**

పట్టణంలోని గీతానగర్ మానేరు నది తీరంలోని రైతు బజార్‌లో పురపాలక సంఘం అధికారులు వస్త్ర నిధిని ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఇది మూలకు చేరింది. పట్టణ ప్రజలు దుస్తులను తీసుకొచ్చి ఇందులో భద్రపరిస్తే నిరుపేదలకు ఉపయోగ పడతాయి.

**అవగాహన కల్పిస్తున్నాం**

సిరిసిల్ల పురవీధుల్లో ఉదయం, సాయంత్రం చెత్త బండి ద్వారా ఇంటింటి ప్రచారం చేయిస్తున్నాం. ఇంట్లో మిగిలిన ఆహారంతో పాటు శుభకార్యాల్లో పండ్లు, ఫలాలు తీసుకొచ్చి ఫుడ్ బ్యాంక్‌లో వేయడం ద్వారా నిరుపేదల ఆకలి తీర్చినవారమవుతాం. గీతానగర్‌లోని రైతు బజార్‌లో దుస్తుల నిధి పెట్టాం. అందులో ఉంచేందుకు దుస్తులు ఉన్నట్లు పురపాలక సంఘం సిబ్బందికి తెలిపితే తీసుకొచ్చి భద్రపరుస్తారు. నిరుపేదలకు ఉపయోగపడతాయి. – డి.లావణ్య, కమిషనర్, సిరిసిల్ల పురపాలక సంఘం

# మెరుగైన బోధన.. పాఠ్యాంశాల



పెద్దపల్లి : ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాల కోసం జిల్లా యంత్రాంగం తొంబై రోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. అధ్యాపకులు వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కళాశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కారణాలు తెలుసుకుంటున్నారు. వారు కళాశాల బాట పట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది ఫలితాల్లో అట్టడుగు స్థానంలో నిలవడంతో లోపాలు సరిదిద్దుతున్నారు. పరీక్షల తేదీలు వెలువడిన నేపథ్యంలో కథనం

**గైర్హాజరు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆరా**

కళాశాలల్లో గైర్హాజరు విద్యార్థుల ఇంటికి వెళ్లి కారణాలపై ఆరా తీస్తున్నారు. కళాశాలకు వచ్చేలా వారికి అవగాహన కల్పిస్తున్నారు. కాలేజీల్లో ఉదయం 9 గంటల నుంచి 9.45 వరకు మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా ఎప్పటికప్పుడు విద్యార్థుల చేత పరీక్షలు రాయిస్తున్నారు. వెనకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారు. ప్రి ఫైనల్‌కు సంబంధం లేకుండా జనవరి మొదటి వారం, చివరి వారంలో పరీక్షలు నిర్వహించనున్నారు.

**ఒత్తిడి జయించేలా..**

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 2,003, ద్వితీయ సంవత్సరంలో 1,841 మంది విద్యార్థులు చదువుతున్నారు. అధ్యాపకులు ఈ నెలాఖరులోపు సిలబస్ పూర్తిచేసి పునశ్చరణ ప్రారంభించి విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయనున్నారు. ఇప్పటికే విద్యార్థుల్లో ఏకాగ్రత, పరీక్షల భయం వీడేలా యోగా, ధ్యానం వంటివి చేయిస్తున్నారు. మానసిక నిపుణులతో చిట్కాలు అందిస్తున్నారు.

**భయం వీడితే సులువే**

గణితంపై ముందుగా విద్యార్థులు భయం వీడాలి. మాత్రికలు, ప్రమేయాలు, త్రిభుజ ధర్మాలు, త్రికోణమితి నిష్పత్తులపై సాధన చేయాలి. సరళరేఖలు, అవకలనం, అవకలజాల అనువర్తనాలు ఉజ్జాయింపులు, దోషాలపై దృష్టి సారిస్తే ఎక్కువ మార్కులు పొందవచ్చు. ద్విపద సిద్ధాంతం, వృత్తం, ప్రస్తారాలు, సంయోగాలను అర్థం చేసుకోవాలి.

రమేష్, గణిత అధ్యాపకుడు, సుల్తానాబాద్ కళాశాల

**వ్యాకరణంపై దృష్టిపెట్టాలి**

ఆంగ్లంలో అధిక మార్కులు సాధించేందుకు వ్యాకరణంపై దృష్టిపెట్టాలి. ప్రథమ సంవత్సరంలో ఫాదర్ ఆఫ్ ఫాదర్, ది గ్రీన్ ఛాంపియన్ తిమ్మక్క, ది ఫస్ట్ ఫోర్ మినిట్స్.. ద్వితీయంలో హౌ టు అవాయిడ్ ఫులీష్, ఒపీనియన్, ఫియర్, అవేక్ పాఠాలపై పట్టు సాధించాలి. పద్యాలు, వ్యాసాలకు సమాధానాలు రాస్తే మార్కులు పొందవచ్చు. లెటర్ రైటింగ్, నాన్ వెర్బల్ డాటా, ఫ్లో ఫిల్లింగ్, మ్యాచ్ ది ఫాలోయింగ్‌పై దృష్టిపెట్టాలి. వేణు, అధ్యాపకుడు (ఆంగ్లం) పెద్దపల్లి కళాశాల(బాలుర)

**వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం**

కళాశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళిక రూపొందించాం. వెనకబడిన విద్యార్థులకు సులభతరంగా బోధన చేస్తున్నాం. ప్రిఫైనల్ తరహాలో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తాం. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి.. పిల్లల గైర్హాజరును తగ్గిస్తున్నాం. కల్పన, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

# పర్యాటకానికి కొత్తరూపు.. రాజధానికి ఊపు

హైదరాబాద్: నగర పర్యాటకానికి నూతన విధానంతో కొత్త ఊపు వస్తుందని సర్కార్ భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ పర్యాటక విధానం(టూరిజం పాలసీ 2025-2030) హైదరాబాద్ పర్యాటకాభివృద్ధికి దోహదపడేలా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందులో భాగంగా నగరంతోపాటు చుట్టుపక్కల పర్యాటక ఆకర్షణలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో చార్మినార్, గోల్కొండ అగ్రస్థానంలో ఉన్నాయి. ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రదేశాలు.. ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న ఆకర్షణలను కేటగిరీలుగా విభజించారు.

**దేశ విదేశాల నుంచి..**

ఏటా చేప మందు కోసం నగరానికి దేశ విదేశాల నుంచి వేలాది మంది వస్తుంటారు. దీన్ని పర్యాటకంలో భాగం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హ్యాపెనింగ్ హైదరాబాద్ థీమ్‌తో ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో కార్యక్రమాలను నిర్వహించడం వల్ల స్థానికులతోపాటు బయటి వారు కూడా భాగస్వాములు అయ్యేందుకు అవకాశం కల్పించనున్నారు. నుమాయిష్‌కు కొత్త పర్యాటక విధానంలో స్థానం కల్పించారు. దుబాయ్‌లో నిర్వహించే గ్లోబల్ విలేజ్ కాన్సెప్ట్‌ను పరిగణలోకి తీసుకుంటున్నారు. ఎంటర్‌టైన్‌మెంట్, షాపింగ్, ఆహారం వంటి కీలక అంశాల ప్రాతిపదికగా జరిగే దుబాయ్ గ్లోబల్ విలేజ్ కాన్సెప్ట్‌ను అమలుచేయడం వల్ల సుమారు 45 నుంచి 60



రోజులపాటు ప్రత్యేక పర్యాటకం ఉండనుంది.

**ఫుడ్ ఫెస్టివల్స్‌తో రుచుల పరిచయం**

హైదరాబాద్ బిర్యానీతోపాటు తెలుగు రాష్ట్రాల ప్రత్యేకతలు చాటే అనేక ఆహార పదార్థాలున్నాయి. ఫుడ్ ఫెస్టివల్స్‌ను హోటళ్లు, ఆతిథ్య రంగంలోని వారితో కలిసి ప్రత్యేక క్యాలెండర్ ప్రకారం నిర్వహించేలా రూపొందించనున్నారు. హైదరాబాద్‌లో మెడికల్ టూరిజానికి కొత్తరూపు తీసుకువచ్చేలా పర్యాటక విధానంలో స్థానం కల్పించారు. రాష్ట్ర మెడికల్ టూరిజం సొసైటీని ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ స్టేట్ హెరిటేజ్ బోర్డు, హైదరాబాద్ కన్వెన్షన్ విజటర్స్ బ్యూరో, శిల్పారామం ఆర్ట్, క్రాఫ్ట్ కల్చర్ సొసైటీ, బుద్ధవనం ప్రాజెక్ట్, ఎకో టూరిజం బోర్డు నగర పర్యాటకానికి కొత్త జవసత్వాలు ఇచ్చేందుకు దోహదపడనున్నాయి.

# తప్పని నిరీక్షణ..!

నల్గొండ : సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించిన రైతులు డబ్బుల కోసం అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పనులు చేసే రైతులకు తపాలా శాఖలో ఖాతాలు ఉన్నాయి. సీసీఐకు పంట విక్రయించిన తర్వాత వారి బ్యాంకు ఖాతాల్లో వారం, పది రోజుల్లో డబ్బులు పడుతున్నాయి. తపాలా ఖాతాలో రూ.2 లక్షలు మించి నగదు తీసుకోవడానికి వీలు కాదు. ఈ నేపథ్యంలో మారుమూల గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డబ్బుల కోసం మార్కెట్, సీసీఐ, తపాలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులకు తపాలాశాఖలో ఖాతాలు ఉన్నాయి. వీరంతా సేవింగ్ ఖాతా ఓపెన్ చేస్తే సమస్య ఉండదని అధికారులు చెబుతున్నారు. ఆయా మండలాల పరిధిలో ఉన్న మార్కెట్ కార్యాలయాల్లో ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ ఆఫ్ ఇండియా) అనే ఫామ్‌ను సిబ్బంది ఇస్తున్నారు. రూ.2 లక్షల సమస్య ఉన్న తపాలా ఖాతా కలిగిన రైతులు ఈ ఫామ్ పూర్తి చేసి మార్కెట్ కార్యాలయంలో ఇస్తే.. డబ్బు తీసుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ చాలామంది రైతులకు ఈ విషయం తెలియక అవస్థలు



పడుతున్నారు. ముందుగానే అధికారులు దీనిపై అవగాహన కల్పిస్తే.. తమకు ఈ ఇబ్బందులు తప్పేవని వారు వాపోతున్నారు. పత్తి కొనుగోలుకు జిన్నింగ్ మిల్లు వద్ద రైతులు నిరీక్షించడం ఒక ఎత్తు అయితే.. పోస్టాఫీసు నుంచి డబ్బులు తీసుకోవడం మరో ఎత్తుగా మారిందని చెబుతున్నారు. రైతులు మార్కెట్ కార్యాలయంలో సంప్రదించాలి ఛాయాదేవి, ఏడీ, మార్కెటింగ్ శాఖ, నల్గొండరూ.2 లక్షల నగదు సమస్య ఉన్న తపాలా ఖాతా కలిగిన రైతులు ఎన్‌పీసీఐ ఫామ్‌ను మార్కెట్ కార్యాలయంలో తీసుకొని నింపి ఇస్తే సరిపోతుంది. ఈ సమస్య ఎదుర్కొంటున్న రైతులు మార్కెటింగ్ కార్యాల యంలో సంప్రదించాలి. నల్గొండ జిల్లాలో సీసీఐ ద్వారా 127235.60 మెట్రిక్ టన్నుల పత్తిని 42,037 మంది రైతుల నుంచి కొనుగోలు చేశాం. రూ.774.24 కోట్ల నగదును 34,670 రైతుల ఖాతాలో చేశాం.

# విచ్చలవిడిగా పాలిథీన్ వినియోగం

సిద్దిపేట : జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఒకేసారి వినియోగించి పారవేసే పాలిథీన్ సంచుల వినియోగం విచ్చలవిడిగా కొనసాగుతోంది. నియంత్రించేందుకు అధికారులు పక్కా చర్యలు చేపట్టడం లేదు. టీ దుకాణాలు, అంగళ్లు, హోటళ్లు, కిరాణాలు, అల్పాహారశాలల్లో వాడుతున్నారు. వేడుక మందిరాల్లోనూ ప్లాస్టిక్ పళ్లేలు, గ్లాసులు వినియోగిస్తున్నారు. నిబంధనలను నిర్వాహకులు పాటించటం లేదు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియా నియోజకవర్గ కేంద్రం కావటంతో నిత్యం దాదాపు 18 టన్నులకుపైగా చెత్త ఉత్పత్తి అవుతుంది. ఇందులో 30 శాతానికిపైగా పాలిథీన్ వస్తువులు వెలుగు చూస్తున్నాయి. ఇంటింటి వాహనాల ద్వారా చెత్త సేకరణ పూర్తి స్థాయిలో చేపట్టకపోవటంతో గజ్వేల్ శివారులో తూప్రాన్ రోడ్డు, ప్రజ్ఞాపూర్‌లోని 4వ వార్డు, ముట్రాజ్‌పల్లి శివారు, రాజీవ్‌రహదారి పక్కన, ప్రజ్ఞాపూర్ బస్సుడిపో సమీపంలో చెత్త పారబోస్తున్నారు. డంపుయార్డు నిర్మించినా పూర్తి స్థాయిలో వేరు చేయటం లేదు.

దుబ్బాక పురపాలికలో ప్రతి రోజు పురపాలికలో 11 టన్నుల తడి, పొడి చెత్తను చెత్త వాహనాల్లో సేకరిస్తున్నారు. వీటిలో 2 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. దుబ్బాక పురపాలికలో పారిశుధ్య అధికారి పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంది. అధికారుల పర్యవేక్షణ కరవైంది. పట్టణంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు, పట్టణ శివారు ప్రాంతాల్లోనూ దర్శనమిస్తున్నాయి. అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు నిర్వహించటంలేదు.చేర్యాల బల్దియాలో నిత్యం 7.50 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. ఇందులో 30 కిలోల పాలిథీన్ సంచులుంటున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ 70 శాతం మాత్రమే సాగుతుంది. ప్రధాన రహదారి వెంట రోడ్డుకిరువైపులా, ఆకునూరు వెళ్లేదారి, అంబేద్కర్ నగర్ శివారులో చెత్త పారబోస్తుండటంతో పారిశుధ్య సమస్య ఏర్పడుతోంది.హుస్నాబాద్ మున్సిపాలిటీలో రోజూ 9.5 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. సుమారు ఒక టన్ను వరకు పాలిథీన్ వ్యర్థాలు ఉంటాయి. ఇక్కడ ఇంటింటా 90 శాతం చెత్త సేకరణ జరుగుతుంది. **సిద్దిపేట ఆదర్శం**జిల్లా కేంద్రం సిద్దిపేట బల్దియాలో రోజుకు 54 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. ఇందులో పది శాతం వరకు పాలిథీన్ వస్తువులుంటున్నాయి. నూరు శాతం చెత్త సేకరణ జరుగుతుంది. పాలిథీన్ సంచుల వినియోగం ఈ మధ్య పెరిగింది. బస్నాపూర్ డంపుయార్డు వద్ద చెత్తతో సీఎన్‌జీ గ్యాస్‌తోపాటు, సేంద్రియ ఎరువులు తయారు చేస్తూ ఆదర్శంగా నిలుపుతున్నారు. అన్నింటా ఆదర్శంగా ఉన్నా వ్యాపార కేంద్రాలు, వేడుకల ప్రాంతాల్లో రోడ్ల వెంట చెత్త పారబోస్తున్నారు. 34 వార్డుల్లో స్టీల్ బ్యాంకులు అమలవుతున్నాయి.

# బ్యాటరీలే లక్ష్యం

చేర్యాల : ఇటీవల కాలంలో ట్రాక్టర్ వాహనాల బ్యాటరీలను చోరులు కాజేస్తున్నారు. యజమానులకు నిద్ర లేకుండా చేస్తున్నారు. ఎలాంటి పర్యవేక్షణ లేని ట్రాక్టర్ బ్యాటరీలే లక్ష్యంగా దుండగులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. దాదాపు నాలుగు నెలల కాలంలో చేర్యాల, గజ్వేల్, దుబ్బాక సమీప ఠాణాల పరిధుల్లో 64 బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. చేర్యాల, మద్దూరు ఠాణాల పరిధిలో 50 పైగా అపహరించారు. మద్దూరు మండలంలో అధికంగా ట్రాక్టర్ల నుంచి ఎత్తుకెళ్లారు. మద్దూరు, వల్లంపట్ల, రేబర్తి, ధర్మారం, సలాఖపురం, మర్మాముల, బంజెరా, నర్సాయపల్లి, లద్నూరు గ్రామాల్లో జరిగాయి. రెండు రోజులుగా చేర్యాల మండలంలో ఎగబడుతున్నారు. ఆకునూరు, చుంచనకోట గ్రామాల్లోనూ తీసుకెళ్లారు. **దూరంగా ఉండే పొలాల వద్ద ఎక్కువ**

కేసులు, కోర్టుల అవస్థ ఎందుకని కొందరు ట్రాక్టర్ల యజమానులు, రైతులు ఫిర్యాదులు చేయడం లేదు. గ్రామాల్లోని తమ ఇంటి వద్ద స్థలం లేక వ్యవసాయ బావుల వద్ద నిలుపుతారు. ఊరికి దూరంగా ఉండటంతో పాటు జన సంచారం లేకపోవడంతో బ్యాటరీల అపహరణ సులువుగా ఉంటోంది. కొత్త బ్యాటరీ కొనాలంటే రూ.10 వేలు ఖర్చవుతుంది. అపహరించిన బ్యాటరీలను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు రహస్యంగా అమ్ముకుంటారు.

గజ్వేల్ సర్కిల్ పరిధిలో ఇటీవల దొంగలను అరెస్టు చేసిన పోలీసులు. పది బ్యాటరీలను రికవరీ చేసుకొని, నిందితులను రిమాండ్ చేశారు.

దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో నాలుగు ట్రాక్టర్లవి చోరీ అయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేయలేదు. దుబ్బాక బల్దియా రెండు వాహనాల బ్యాటరీలు గతంలో చోరీకి గురయ్యాయి. రికవరీ చేశారు.ప్రత్యేక నిఘా పెట్టాం

ఎల్.శ్రీను, సీఐ, చేర్యాల

ఇటీవల చేర్యాల సర్కిల్‌లో బ్యాటరీల చోరీలు పెరిగాయి. నిఘా పెట్టాం. ప్రత్యేక బృందం దీనికోసమే ఏర్పాటు చేశాం. త్వరలో దుండగులను పట్టుకుంటాం.

## ప్రజావాణిలో ఫిర్యాదులు.. అధికారుల పరుగులు

హైదరాబాద్ : కొన్నేళ్లుగా అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రేటర్ పరిధిలోని పలుప్రాంతాల్లోని గృహ నిర్మాణ సంస్థ(హౌసింగ్ బోర్డ్) స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. తాజాగా ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తుండటంతో అధికారులు పరుగులు పెడుతున్నారు. ఖాళీ స్థలాల వేలానికి ప్రభుత్వం అనుమతించటంతో అక్రమార్కుల బాగోతాలు వెలుగులోకి వస్తున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ప్రజావాణి నుంచి వాటిని హౌసింగ్ బోర్డు కార్యాలయానికి పంపుతున్నారు. తీసుకున్న చర్యలపై నివేదికలు ఇవ్వాల్సి ఉండటంతో అధికారులు ఆఘమేఘాల మీద ఆయా ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. కబ్జాలను నిర్ధారిస్తే తొలగిస్తున్నారు. కూల్చివేతలు చేపట్టకుండా మమ అనిపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పర్యవేక్షణ కరవు**

ఖాళీగా ఉన్న ప్లాట్లకు ప్రహరీ నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ కొరవడుతోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. టెండర్లు నిర్వహించి గుత్తేదారులకు అప్పగిస్తున్నారు. బోర్డు రికార్డుల మేరకు విస్తీర్ణాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో కొలతలువేసిన తర్వాత గోడలను నిర్మించాల్సిఉంది. పర్యవేక్షణ లేకకొన్ని ప్రాంతాల్లో పది నుంచి పదిహేను అడుగుల విస్తీరం తగ్గించి నిర్మిస్తున్నారని స్థానికులు



ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్‌లో సుమారు 22 ప్రాంతాల్లో ప్రహరీల నిర్మాణం చేపట్టారు. తగ్గించి నిర్మించడంతో బోర్డు భారీగా నష్టపోతోందని వారు చెబుతున్నారు.

**విక్రయానికి విధి విధానాలు...**

హౌసింగ్ బోర్డు పరిధిలోని ఖాళీ స్థలాలు(ప్లాట్లు), నివాసాల(ఫ్లాట్లు) విక్రయానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో అధికారులు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. ఖాళీ స్థలాలకు ప్రహరీల నిర్మాణం జనవరి చివరి నాటికి పూర్తిచేయాలని నిర్ణయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ప్లాట్లు, ఫ్లాట్లను వేలం ద్వారా విక్రయించేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నారు. వాటిలో కొన్నింటిని గతంలో వేలం నిర్వహించినా అమ్ముడుపోలేదు. అప్పట్లో ఎందుకు విక్రయం కాలేదన్న అంశంపై దృష్టి సారించినట్లు ఓ అధికారి చెప్పారు. వేలం నాటికి పరిస్థితులను చక్కదిద్దటమో లేదా ఆయా స్థితులకు అనుగుణంగా ధరలు నిర్ణయించటమో చేయాల్సి ఉందని వివరించారు.

## పెద్ద దవాఖానాకు సుస్తీ!

కరీంనగర్ :తాళం వేసి కనిపిస్తున్నది ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎక్స్‌రే గది. ఇక్కడ ప్రతి రోజు కనీసం వంద మందికైనా ఎక్స్‌రే అవసరమవుతుంది. ఇక్కడ యంత్రాలు మరమ్మతుకు గురయ్యాయి. పరీక్ష అనంతరం ఎక్స్‌రే ఫిల్మ్ కూడా ఇవ్వరు. వాట్సప్‌లో వైద్యుడికి పంపిస్తారు. వైద్యులు పరీక్షించి ఫ్యాక్చర్ ఉందంటే ఉన్నట్టు.. లేదంటే లేదు. మరో వైద్యుడి అభిప్రాయం తెలుసుకోవడానికి ఫిల్మ్ ఇస్తే బాగుంటుందని రోగులు కోరుతున్నారు. ఇక్కడ యంత్రాలు పనిచేయకపోవడంతో రేడియాలజీ హబ్‌కు పంపిస్తున్నారు. రోగులకు సహాయకులకు, పేషెంట్ కేర్‌లకు ఇబ్బందిగా ఉంది.

సీటి, అబ్డామిన్ స్కాన్ వద్ద రోగులు, సహాయకులు వీరు. ఇద్దరు రేడియాలజిస్టులే ఉండటంతో సేవల్లో జాప్యం జరుగుతోంది. గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఇక్కడ కూడా ఎలాంటి ఫిల్మ్‌లు, నివేదికలు ఇవ్వరు. సమస్య ఉన్నది, లేనిది కాగితంపై రాసిస్తారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఇక్కడ సేవలు నిలిచిపోతాయి. అత్యవసర పరిస్థితుల్లో రోగులు వచ్చిన పరీక్షించిన వైద్యులు బయటే స్కానింగ్ చేసుకోవాలని చెబుతున్నారు. ఆసుపత్రికి ఎంతోమంది క్షతగాత్రులు వస్తుంటారు. వారికీ నిరంతర సేవలు అందుబాటులో లేకపోవడం లోపం.

కరీంనగర్ జిల్లా ప్రభుత్వ జనరల్ పెద్ద ఆసుపత్రి.. నిధులు లేక, రోగులకు సరైన సేవలందించలేక వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతుంది. రావాల్సిన, కావాల్సిన నిధులు రాకపోవడంతో వైద్యాధికారులు చేసేది ఏమిలేక చేతులు ఎత్తేస్తున్నారు. చిన్నపాటి మరమ్మతుకు కూడా డబ్బులు లేవంటున్నారు. సరిపడా వైద్యులున్నా సరైన పరికరాలు లేక.. ఉన్నవి పనిచేయక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు పొరుగు జిల్లాలకు ఇది పెద్దదిక్కుగా ఉంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుంటేనే రోగులకు మెరుగైన సేవలు దక్కేది.

**బడ్జెట్ లేకుండా.. నిధులెలా?**

ఆసుపత్రులకు మంచాల సామర్థ్యాన్నిబట్టి నిధులు మంజూరు కావాలి. ఒక మంచానికి ప్రతినెల రూ.7500 రావాలి. ఈ లెక్కన 542 మంచాలకు ప్రతినెల రూ.40,65,000 అవసరం. అరకొరగా నిధులు వస్తున్నాయి. చెత్త డబ్బాలు కొనుగోలు చేయలేక ఆసుపత్రి పరిసరాలు డంపింగ్ యార్డుగా తలపించిన ఘటనలు ఉన్నాయి. రోగులను తరలించే స్ట్రెచర్లు, వీల్‌ఛైర్లు, శస్త్రచికిత్స వైద్య పరికరాలు అవసరమైనంత లేవు. ఎక్స్‌రే యంత్రాలూ మరమ్మతు చేయలేని పరిస్థితి. మందులు కూడా రోగులకు పూర్తిస్థాయిలో పంపిణీ చేయడంలేదనే ఆరోపణలున్నాయి. 15 ఐసీయూ మంచాలు ఉండగా, నాలుగైదు వెంటిలేటర్లు పనిచేయడంలేదు. ఐసీయూ మంచాల సంఖ్య పెంచడంతోపాటు 24 గంటలు శస్త్రచికిత్సలు జరిగేలా చూడాల్సిన అవసరముంది.

**ప్రజాప్రతినిధులూ స్పందించండి**

రోగులకు అందుతున్న వైద్యసేవల వివరాలు తెలిసేలా బోర్డులు ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆసుపత్రి సందర్శించినప్పుడు సూపరింటెండెంట్‌కు సూచించారు. ఆయన బడ్జెట్ లేదని తెలపడంతో కలెక్టర్ ఆసుపత్రికి కావాల్సిన కొన్ని ఏర్పాట్లు చేశారు. వివరాలు తెలిపే బోర్డులతోపాటు ఐసీయూకి మూడు ఏసీలు అందజేశారు. ఉమ్మడి జిల్లాలో పేరొందిన పలువురు ప్రజాప్రతినిధులున్నా ఆసుపత్రి వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించడమే మరిచారు. తనిఖీలు చేయకున్నా.. తమ నిధులను ఒకసారి ఆసుపత్రికి మళ్లిస్తే రోగులకు మెరుగైన సేవలందుతాయి.

**ఉన్నతాధికారులకు నివేదించాం**

రోగులకు మెరుగైన సేవలందిస్తున్నాం. ఆసుపత్రికి కావాల్సిన వైద్య పరికరాలకు ఉన్నతాధికారులకు నివేదించాం. కొత్త ఎక్స్‌రే యంత్రాల కోసం ప్రతిపాదనలు పంపించాం.

– డాక్టర్ వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్

## వందల్లో వెరై‘టీ’లు



హైదరాబాద్ : ఆహార రాజధాని భాగ్యనగరంలో దేశ, విదేశీ వంటకాలే కాదు..జిహ్వకు జీవం పోసే వందలాది రకాల ‘టీ’లు లభిస్తున్నాయి. ఇరానీచాయ్, గ్రీన్ టీ, అల్లం టీ, మసాలా టీతో ఆగిపోకుండా 400 రకాల ‘టీ’లు నగరంలోని వేర్వేరు కేఫ్, టీబార్లలో లభిస్తున్నాయి. మల్లె, మందారపూల మకరందం, గులాబీల గుభాళింపుతో చవులూరిస్తున్నాయి. రుచుల్లోనే కాదు ధరల్లోనూ అనేక వ్యత్యాసాలున్నాయి. రూ.5 నుంచి రూ.1000 వరకు ధర పలుకుతున్న తేనీరు నగరంలో అందుబాటులో ఉంది.

**టీ, బన్ మస్కా కోసం పరుగులు..**

నగరవాసులకు, చాయ్‌కు ఉన్న అనుబంధం ఈనాటిది కాదు. వందల ఏళ్లుగా ఇది కొనసాగుతోంది. ఉదయాన్నే పొగలు కక్కే ఇరానీ చాయ్, బన్‌మస్కా కోసం పదుల కిలోమీటర్ల నుంచి పరుగున చార్మినార్, లక్డీకాపూల్‌కు వస్తుంటారంటే చాయ్‌బంధం ఎలాఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తలసరి ‘టీ’ వినియోగంలోనూ హైదరాబాదీలు తొలి వరసలో ఉన్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనంలో చాయ్ ప్రియుల గురించి వెల్లడించింది. ఇళ్లలో 89శాతం మంది ‘టీ’ తాగుతుండగా, 8శాతం మంది కాఫీ తాగుతున్నారని వెల్లడించింది. హైదరాబాదీల్లో తలసరి ‘టీ’ వినియోగం 302 గ్రాములుగా ఉందని లెక్కగట్టింది.

**వందలాది ఔట్‌లెట్లు..**

చాయ్ తయారీతోనే వేలాది మంది నగరంలో ఉపాధి పొందుతున్నారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో టీస్టాల్ అసోసియేషన్లు వెలిశాయి. టీమాస్టర్లకు రూ.20,000 వరకు వేతనాలిస్తున్నారంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. ‘టీ’ అమ్మకానికి ఫ్రాంఛైజీలు సైతం అనేకం ఉన్నాయి. రూ.2లక్షల నుంచి రూ.3లక్షలు చెల్లించి వాటిని తీసుకొని చాలామంది పట్టభద్రులు ‘టీ’ వ్యాపారంలోకి వచ్చారు. చాయ్ ప్రియులను ఆకర్షించేందుకు వేర్వేరు రకాల ‘టీ’లను పరిచయం చేస్తూ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు.

**ఎన్ని రకాలో..**

తందూరి మట్కాచాయ్, కాశ్మీరీ చాయ్, బెల్లం చాయ్, లెమన్ టీ, జాఫ్రానీ చాయ్, గ్రీన్ చాయ్, ఇలాచీ చాయ్, బాదం టీ, కేసర్ స్పెషల్ టీ, పెప్పర్ టీ, పీచ్ ఉలాంగ్, యాపిల్ సినామన్, బ్లాక్ ఫ్రూట్‌టీ, బెర్రీ ఫ్రూట్ టీ, సిల్వర్ నీడిల్స్, మొరాకన్ టీ, పెప్పర్ మింట్, రాయల్ మచా, సంజీవని, ఫ్రెష్ బ్రీజ్, ఇండియన్ స్పైస్, తులసీ మింట్, వెర్జిన్ హెర్బ్, జెస్టీ జింజర్, స్పియర్‌మింట్, రెడ్‌జెన్, రష్యన్‌కారవన్, సిల్వర్ నీడిల్ వైట్ టీ, గ్రీన్ టీ, బ్లాక్ టీ ఇలా విభిన్న రుచులను అందిస్తున్నాయి. ప్రస్తుతం నగరంలో గోల్డెన్ టిప్స్ బ్లాక్ టీ కప్పు ధర రూ.1000 ఉంది. దీనికి గిరాకీ ఎక్కువే. సిల్వర్ నీడిల్ వైట్‌టీ, ఉలాంగ్, మొరాకన్ మింట్, జపనీస్ సెన్చా తరహా టీలు రూ.300 నుంచి లభ్యమవుతున్నాయి.

## బెట్టింగ్ యాప్‌లతో జీవితాలు చిత్తు



హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో ప్రభావశీలురుగా చెప్పుకొనే వారు గ్యాంబ్లింగ్ యాప్‌లను యథేచ్ఛగా ప్రచారం చేస్తూ ప్రజలను..ముఖ్యంగా యువతను తప్పుదోవ పట్టిస్తున్నారు. తెలిసి కొందరు, తెలియక మరికొందరు ఆ యాప్‌ల విష వలయంలో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. రుణ ఉచ్చులో చిక్కి తల్లడిల్లిపోతున్నారు.

రాజేంద్రనగర్ పరిధిలో ఆనంద్(42) అనే వ్యక్తి బెట్టింగ్ యాప్‌లకు బానిసయ్యాడు. సొమ్మంతా అందులో పెట్టి రూ.లక్షలు పోగొట్టుకున్నాడు. ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియక భార్య, కుమారుడికి విషమిచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండలం రుద్రారానికి చెందిన ఇదారి నవీన్(27).. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై సుమారు రూ.26 లక్షలు పోగొట్టుకున్నాడు. వాటిని తీర్చే మార్గంలేక తీవ్ర మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఈ ఏడాది అక్టోబరులో బలవన్మరణానికి పాల్పడ్డారు.

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కడారిగూడేనికి చెందిన గణేశ్ (22) ఆన్‌లైన్ బెట్టింగ్‌లో భారీగా నష్టాలు చవిచూశాడు. రూ.లక్షల్లో అప్పుల పాలయ్యాడు. రుణాలిచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు.

నిషేధమున్నా..: ‘1867 గ్యాంబ్లింగ్ యాక్ట్’ ప్రకారం.. బెట్టింగ్, జూదం నిషిద్ధం. కఠిన నిబంధనలున్నా ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫారాలు ప్రచారం చేస్తూనే ఉన్నాయి. సామాజిక మాధ్యమాల్లో ఇన్‌ఫ్లూయెన్సర్లుగా ఉన్నవారిని ప్రచారకర్తలుగా ఎంచుకుంటున్నాయి. స్వలాభానికి బెట్టింగ్, పలు నిషేధిత ట్రేడింగ్ యాప్‌లను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

**నిషేధిత యాప్‌లే ఎక్కువ..**

మహాదేవ్, పరీమ్యాచ్, ఫెయిర్‌ప్లే, వన్‌ఎక్స్‌బెట్, లోటస్ 365, డఫాబెట్, బెట్‌వేసట్టాలతో సహా మొత్తం 174 యాప్‌ల వినియోగం మన దేశంలో నిషేధం. వీటి ప్రకటనలే సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా ప్రత్యక్షమవుతున్నాయి. పోలీసులకు దొరకకుండా ఆయా యాప్‌లకు ఎప్పటికప్పుడు పేర్లు మార్చి కార్యకలాపాలు సాగిస్తున్నారు. క్రికెట్ అభిమానులే లక్ష్యంగా బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. యాప్ డౌన్‌లోడ్ చేశాక మొదట్లో కొంత మొత్తంలో లాభాలు వచ్చినట్లు నిర్వాహకులు ఆశ చూపుతారు. తర్వాత ఎక్కువ మొత్తంలో లాగేసుకుంటారు. ఇది తెలియక పలువురు అప్పులు చేస్తున్నారు. రుణయాప్‌ల్లో ఇష్టారాజ్యంగా అప్పు తీసుకుంటున్నారు. తర్వాత రుణం తీర్చలేక వారి వేధింపులకు బలవుతున్నారు. బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## అధికారుల చర్చలు.. విస్తరణపై ఆశలు



గోదావరిఖని: రామగుండం విద్యుత్తు కేంద్రం విస్తరణ పనుల్లో ముందడుగు పడుతోంది. సింగరేణి, జెన్‌కో సంయుక్తంగా నిర్మించాలని నిర్ణయించగా దీనిపై రెండు సంస్థలకు చెందిన అధికారులు చర్చలు సాగిస్తున్నారు. ఈనెల 7న సింగరేణి, జెన్‌కో ఉన్నతాధికారులు సమావేశమై ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న విషయంపై చర్చించారు. ఆ తర్వాత మరోసారి కూడా రెండు సంస్థల అధికారులు సమావేశమయ్యారు. రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడి అవసరం ఉండటంతో ఇందులో ఎవరు ఎన్ని నిధులు వెచ్చించాలన్న అంశాలపై చర్చించినట్లు తెలిసింది. నిర్మాణానికి సంబంధించిన పనులు త్వరలోనే చేపట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్న అధికారులు ఇప్పటికే దీనికి సంబంధించిన నివేదికలు తయారు చేశారు. నెల రోజుల క్రితం రామగుండం జెన్‌కో కేంద్రాన్ని సందర్శించిన అధికారులు పలు వివరాలు సేకరించారు. ఒకవైపు సంయుక్తంగా నిర్మించే ప్లాంటుపై చర్చలు జరుపుతూనే మరోవైపు ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేస్తుండటంతో నిర్మాణానికి సంబంధించిన పనులు త్వరలోనే చేపట్టే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

**అందుబాటులో వనరులు** రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేసేందుకు స్థలంతో పాటు బొగ్గు, నీరు అందుబాటులో ఉన్నాయి. బొగ్గు సరఫరాకు సింగరేణి సిద్ధంగా ఉంది. పక్కనే గోదావరినది ఉండటంతో నీటికి ఇబ్బంది లేదు. దీంతో 62.5 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాన్ని తొలగించి దాని స్థానంలో 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి ప్రణాళికలు చేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆగస్టు 31న సందర్శించి సింగరేణి, జెన్‌కోలు సంయుక్తంగా ప్లాంటు నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఒకటి రెండు సార్లు ప్రభుత్వం వద్ద జెన్‌కో అధికారులతో సమావేశమయ్యారు. ఇదే క్రమంలో సింగరేణి అధికారులతో సైతం సమీక్షించారు. దీనికి సింగరేణి ముందుకు రావడంతో పనులు ప్రారంభించుకోవడానికి మార్గం సుగమమైంది. కాగా జెన్‌కో సంస్థ సైతం దీనికి ఆసక్తి చూపినప్పటికీ కొంత మంది ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు మాత్ర సంస్థ ద్వారానే ప్లాంటు నిర్మాణం చేపట్టాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

**ఎవరికి ఎంత శాతం** రెండు సంస్థలు సంయుక్తంగా నిర్మాణం చేపట్టనుండటంతో ఎవరి వాటా ఎంత అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ప్లాంటు నిర్మాణం తర్వాత నిర్వహణ బాధ్యత ఎవరికి ఉంటుందన్న విషయంలో కూడా ఇంకా నిర్ణయం తేలలేదు. రామగుండంలో నిర్మించే 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రంలో ఉద్యోగులు ఎవరు పనిచేస్తారన్న ప్రశ్న సైతం తలెత్తింది. ఇప్పటికే ఇందులో పనిచేస్తున్న జెన్‌కో ఉద్యోగులు, ఇంజినీర్లను తొలుత యాదాద్రికి మూకుమ్మడిగా బదిలీ చేశారు. అనంతరం వారి బదిలీలను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం విద్యుత్తు కేంద్రంలో ఉత్పత్తి నిలిపివేశారు. ఉద్యోగులు, అధికారులకు ఎలాంటి పని లేకపోయినా కొత్త ప్లాంటు నిర్మాణం జరిగే వరకు వారిని ఇక్కడే కొనసాగించేందుకు నిర్ణయించారు.

## మహబూబ్ గంజ్‌లో సమస్యల కొలువు

హైదరాబాద్: తెలంగాణలోనే అతి పెద్ద ఉల్లి విపణి మలక్‌పేట మార్కెట్ సమస్యలతో సతమతం అవుతోంది. మరోవైపు ఉన్న సౌకర్యాలను సక్రమంగా ఉపయోగించుకోలేని దుస్థితి నెలకొంది. నిత్యం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వందల లారీల సరకు మార్కెట్‌కు వస్తుంది. ప్రధానంగా ఉల్లి, మిర్చి, చింతపండు రైతులు, వ్యాపారులతో మార్కెట్ కిటకిటలాడుతుంటుంది. చిన్న చిన్న సమస్యలు సైతం ఏళ్ల తరబడి పరిష్కారం కావడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం బాగానే ఉంటున్నా.. వసతులు కల్పనపై దృష్టి సారించడం లేదని ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో మురుగు, పారిశుద్ధ్య సమస్యతో పాటు ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని రహదారులతో ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల క్రితం వేసిన మురుగు పైపుల సామర్థ్యం సరిపోకపోవడంతో తరచూ డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనుల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు. కాంటా సమస్య ఏళ్లయినా పరిష్కారం కావడంలేదు. మార్కెట్ ఎక్కడా చూసినా.. కుళ్లిన ఉల్లిగడ్డలు, ఇతర వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి.



అంతర్గత **రోడ్లు అధ్వానం..**

నిత్యం వందల లారీలు తిరిగే మార్కెట్ అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కంకర తేలడంతో సరకు వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. భారీ సంఖ్యలో లారీలు వస్తుండటం.. రోడ్లు గుంతలమయమై ఉండటంతో వాహనాలు నిలిచి పోతున్నాయని డ్రైవర్లు పేర్కొంటున్నారు. తరచూ వాహనాలు మొరాయిస్తుండటంతో డ్రైవర్ల మధ్య గొడవలు సాధారణమయ్యాయి. పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయని చెబుతున్నారు.

**వసతులు లేక అవస్థలు** సరకుతో అర్ధరాత్రి మార్కెట్‌కు చేరుకున్న రైతులు సాయంత్రం వరకు ఉండాల్సి వస్తుంటుంది. ఇక్కడ సదుపాయాలు లేకపోవడంతో నానా ఇక్కట్లు పడుతున్నారు. రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన విశ్రాంతి భవనం ఏడాది క్రితం ప్రారంభించినా వినియోగంలోకి రాలేదు. నిత్యం తాళం వేసి ఉండటంతో రైతులు క్యాంటీన్ వెలుపల, దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. సరకు వేలం తర్వాత చెల్లింపులకు సమయం ఉండటంతో.. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుందామన్నా అవకాశం లేదని నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన రైతు బసవేశ్వర్ ఆవేదన వ్యక్తంచేశారు.

## సహకార సంఘాల్లో ప్రాయోజిత సేవలు

ధర్మపురి : సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే అన్ని రకాల ఆన్‌లైన్ సేవలతో పాటు మరిన్ని ప్రాయోజిత సేవలను అందుబాటులోకి తేనుంది. ఇప్పటికే సంఘాల్లో సీఎస్‌సీ కేంద్రాల ద్వారా పలు రకాల సేవలందిస్తున్నారు. వీటిని బలోపేతం చేయడంతో పాటు మరిన్ని సేవలను అందించేందుకు ఈనెల 11న జిల్లా పాలనాధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో సహకార సంఘాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లకు, సీఈవోలకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలో 51 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా 15 సంఘాల్లో సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్ల)కేంద్రాలు నడుస్తున్నాయి. రైతులకు, ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు మిగతా సంఘాలకు లాగిన్ ఇచ్చారు. రైతులతో పాటు ఇతరులకు స్థానికంగానే సేవలందించాలన్న లక్ష్యంతో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆధార్‌కార్డు ద్వారా నగదు తీసుకునే విధంగా మినీ ఏటీఎం, ఆదాయపన్ను, ఇంటిపన్ను, విద్యుత్తు బిల్లుల చెల్లింపు, బీమా, రుణాల మంజూరుకు దరఖాస్తు, పాస్‌పోర్టు, రిజిస్ట్రేషన్లు లాంటి సేవలను చేరువ చేయనున్నారు. విమాన, బస్సు, రైలు రిజర్వేషన్లు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు సంఘంలోనే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం



కల్పించనున్నారు. జనరిక్ మందుల దుకాణాలను నెలకొల్పేందుకు నాలుగు సహకార సంఘాల నుంచి ప్రతిపాదనలను పంపినట్లు అధికారులు తెలిపారు. లావాదేవీలు నిర్వహించేందుకు సహకార సంఘం నుంచి కరెంట్ ఖాతాలను తెరిచారు.

**ఇబ్బందులను అధిగమిస్తేనే...**

సహకార సంఘం పరిధి ఆధారంగా ఆయా సంఘాల్లో సిబ్బంది ఉన్నారు. పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి తేవాలంటే ప్రత్యేకంగా ఓ వ్యక్తిని నియమించాల్సిన అవసరం ఉంటోంది. మెరుగైన ఇంటర్‌నెట్ కనెక్షన్ కూడా అవసరం. వీటన్నింటినీ అధిగమిస్తేనే ప్రజలకు మెరుగైన సేవలందించే అవకాశం ఉంటోంది.

దశలవారీగా అమలు మనోజ్‌కుమార్, జిల్లా సహకారశాఖాధికారి, జగిత్యాల సహకార సంఘాల్లో దశలవారీగా అన్ని రకాల ఆన్‌లైన్ సేవలను అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈనెల 11న ఇచ్చిన శిక్షణలో ప్రజలకు అందించాల్సిన సేవలను వివరించాము. శిక్షణతో పాటు సందేహాలు నివృత్తి చేశాము. సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నాం.

చురకలు



# పంచాయతీల్లో నిధుల లేమి

కరీంనగర్ : పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అనే జాతిపిత మహాత్మాగాంధీ ఆశయం నెరవేరడంలేదు.. పల్లెలు పరిపుష్టమైతే అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతోందనడంలో అతిశయోక్తి లేదు. కానీ ఆ పల్లెలు పాలకుల పట్టింపులేని తనంతో కొన్నేళ్లుగా నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. నెలలుగా ట్రాక్టర్ వాయిదాలు, మల్టీపర్పస్ కార్మికుల వేతనాలు, గతంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు నిధులు రాక మాజీ సర్పంచులు దైన్యస్థితిలో కాలం వెల్ల దీస్తున్నారు. చివరకు విద్యుత్తు బిల్లులు, నీటి ట్యాంకుల నిర్వహణకు సైతం నిధులు లేక ప్రత్యేక అధికారులు గ్రామాలు వెళ్లటానికి ముఖం చాటేస్తున్నారు. వివిధ అన్ని పద్దుల కింద జిల్లాకు అందాల్సిన బకాయిలు రూ.15.29 కోట్లుగా ఉన్నాయి.

**ప్రత్యేకాధికారుల పాలన..**

సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగిసింది. ఆరు నెలల్లోగా కొత్త పాలకవర్గాలు కొలువుదీరాలి. కానీ తొమ్మిది నెలలవుతున్నా ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతోంది. పైపెచ్చు గ్రామాలకు ప్రభుత్వపరంగా అందించాల్సిన ఆర్థిక చేయూత కొరవడింది.

పాలకవర్గాలు ఉంటే కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు అందేవి. వాటితో స్థానిక మౌలిక వసతుల సమస్యలు కొద్దో గొప్పో తీరిపోయేవి. జిల్లాకు సుమారు రూ.6 కోట్లు అందాల్సి ఉంది. అలాగే ఎస్ఎఫ్‌సీ సైతం అందటంలేదు.



పాలకవర్గం పదవీకాలం పూర్తికాగానే జిల్లాలోని 313 పంచాయతీలకు ప్రతి గ్రామానికి ఓ ప్రత్యేక అధికారిని నియమించింది. కానీ పంచాయతీలకు అందాల్సిన నిధులు సకాలంలో అందకపోవడంతో పల్లెల్లో మౌలిక వసతులపై చేతులెత్తేస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో కొద్దో గొప్పో ఇళ్ల పన్ను, ఇంటి అనుమతి నిధులు వంటి వాటితో కార్యదర్శులు పారిశుద్ధ్య నిర్వహణతోపాటు, కార్మికులకు అడపాదడపా జీతాలు చెల్లిస్తున్నారు.

పాలకవర్గాలు ఏర్పడితే గానీ పంచాయతీలు ఎంతోకొంత గాడిన పడవని స్థానికులు పేర్కొంటున్నారు. పంచాయతీ నిధులేమిపై జిల్లా పంచాయతీ అధికారి ఎ.రవీందర్‌ను సంప్రదించగా ఈ విషయంపై ప్రభుత్వానికి ప్రతిపాదిస్తూనే ఉన్నామన్నారు. నిధులు విడుదల కాగానే పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు 313

గ్రామాల్లో నివసిస్తున్న జనాభా (2011 జనాభా లెక్కల ప్రకారం) : 6,11,062

పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలు : రూ.1,12,92,000

వీధిదీపాలు విద్యుత్తు బిల్లులకు చెల్లించాల్సింది : రూ.75.97 లక్షలు (అక్టోబరు వరకు)

పంచాయతీల ట్రాక్టర్ల బ్యాంకు వాయిదాలు (137 పంచాయతీలు) పెండింగ్ : రూ.47,53,568

గతంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు మాజీ సర్పంచులకు అందాల్సిన నిధులు : రూ.12,86,90,783

# ఆగని ఇసుక దందా

కోరుట్ల: కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో ఇసుక అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. వాగుల్లోని ఇసుకను అక్రమ వ్యాపారులు విచ్చల విడిగా తవ్వకాలు చేపట్టి ఇతర జిల్లాలకు, ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మల్లాపూర్ మండలంలోని గోదావరి నది, కోరుట్ల, కథలాపూర్, మెట్‌పల్లి మండలాల్లో పెద్దవాగులు ఉన్నాయి. వీటిల్లో వానాకాలం వరదలకు పెద్దఎత్తున ఇసుక నిల్వలు ఏర్పడుతుంటాయి. ఈ ఇసుక మేటలను లక్ష్యంగా చేసుకొని అక్రమార్కులు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. కథలాపూర్ మండలంలోని సిరికొండ, తక్కలపల్లి గ్రామ శివారులోని వాగు ఒడ్డునున్న భూ యజమానులు.. వాగు తమ పరిధిలోకి వస్తుందని చెబుతూ ఇసుకను వ్యాపారులకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. వాగుల్లోంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి, తర్వాత లారీలు, టిప్పర్‌లలో నింపి ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. యథేచ్ఛగా ఇసుక తవ్వకాలతో పెద్దఎత్తున గొయ్యిలు ఏర్పడుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాద స్థితి ఏర్పడుతోంది. వాగుల్లో, గోదావరి నదిలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా ఇసుక తవ్వి విక్రయించినట్లయితే ప్రభుత్వానికి ఆదాయం సమకూర డంతోపాటు ఇసుక అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేసే అవకాశాలున్నాయి. నిబంధనలలోపే ఇసుకను తవ్వడంతో భూగర్భజలాలకు ప్రమాదం లేకుండా ఉంటుంది.

**రీచ్‌ల ఏర్పాటులో జాప్యమెందుకో?**

మల్లాపూర్ మండలంలోని గోదావరి నది, సాతారం.. మెట్‌పల్లి మండలంలో ఆత్మకూర్.. కోరుట్ల మండలంలోని పైడిమడుగు.. కథలాపూర్ మండలంలోని సిరికొండ ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, మైనింగ్ అధికారులు సర్వేలు చేశారు. వాగులో నీటి ప్రవాహం ఉన్నందున ఎంతమేర ఇసుకను తవ్వవచ్చని నీటి పారుదలశాఖ నుంచి అనుమతుల కోసం మైనింగ్‌శాఖ అధికారులు లేఖ రాశారు. నీటిపారుదల నుంచి అనుమతులు వస్తే కలెక్టర్ సూచనల మేరకు మైనింగ్ అధికారులు రీచ్‌లను ఏర్పాటు చేస్తారు. నిర్దేశించిన ధరల ప్రకారం అవసరమున్న వారు రెవెన్యూశాఖ అనుమతులతో ఇసుకను తీసుకునే వీలుంటుంది. రీచ్‌ల ఏర్పాటుతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. రెవెన్యూ, మైనింగ్, నీటి పారుదల శాఖల మధ్య సమన్వయ లోపంతో రీచ్‌ల ఏర్పాటులో జాప్యం జరుగుతుండగా.. ఇసుక అక్రమ వ్యాపారులకు వరంగా మారింది. దీనిపై మైనింగ్‌శాఖ ఏడీ జైసింగ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. నీటిపారుదల శాఖ అనుమతి రాగానే రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

**పట్టుకుంటున్నా..** కోరుట్ల మండలంలో 15 రోజుల్లో 18 ఇసుక ట్రాక్టర్‌లను రెవెన్యూ అధికారులు పట్టుకొని తహసీల్ కార్యాలయం, ఆర్టీసీ డిపోనకు తరలించారు. ఇటీవల మూడు ఇసుక లారీలను స్వాధీనం చేసుకొని రూ.50 వేల వరకు జరిమానా విధించారు.

# నిఘా.. దేవుడెరుగు!



కీసర : శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మొత్తం 12 సీసీ కెమెరాలుండగా అందులో 9 మాత్రమే పనిచేస్తున్నాయి.నగరంలోని ప్రార్థనా మందిరాల దగ్గర భద్రతపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రముఖ ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి. దీన్ని అవకాశంగా తీసుకుని ఆకతాయిలు, చోరులు రెచ్చిపోతున్నారు. తాజాగా సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలోకి దుండగుడు చొరబడి విగ్రహం ధ్వంసం చేసిన ఘటనతో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో నగరంలోని ముఖ్యమైన ఆలయాల వద్ద రక్షణ చర్యలను పరిశీలించగా.. అనేక లోపాలు వెలుగులోకి వచ్చాయి.

**పర్యవేక్షణ లేమితో సమస్యలు..!**

గ్రేటర్ హైదరాబాద్‌లో దేవదాయ శాఖ పరిధిలో 1700 ఆలయాలున్నాయి. ఆదాయాన్ని బట్టి 6ఎ, 6బీ, 6సీగా వాటిని వర్గీకరించారు. వీటి నిర్వహణ పూర్తిగా ఆలయ కమిటీలు పర్యవేక్షిస్తాయి.

తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం ప్రకారం కనీసం 100 మంది కంటే ఎక్కువ మంది రాకపోకలు సాగించే, గుమిగూడే అన్ని రకాల ప్రార్థనా స్థలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాల దృశ్యాలు కనీసం 30 రోజులు భద్రపరిచే విధానం ఉండాలి.

కేవలం నిర్వహణ లోపం, పర్యవేక్షణలేమితో అనేక చోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. భద్రతా సిబ్బంది తగినంత లేకపోవడంతో లోపంగా మారింది. ఆలయంలోకి ప్రవేశించే సమయంలో తనిఖీ చేసేందుకు మెటల్ డిటెక్టర్లు లేవు.

**చారిత్రక ఆలయాల్లో నిఘా వైఫల్యం**

ప్రముఖ పుణ్యక్షేత్రం కీసర గుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయం, ప్రసన్నాంజనేయస్వామి, అక్కన్న-మాదన్న ఆలయం, నాగదేవత ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కు తదితర ప్రాంతాల్లో 50 కెమెరాలున్నా 30 మాత్రమే పనిచేస్తున్నాయి. అడాప్టర్లు కాలిపోవడం, వైర్లు కోతులు తెంపేయడంతో 20 కెమెరాలు పనిచేయడం లేదు.

కాప్రాలోని హెచ్‌బీకాలనీలోని కైలాసగిరి శివకేశవుల ఆలయంలో 12 సీసీ కెమెరాలుండగా.. ఒక్కటీ పనిచేయడం లేదు. ఇటీవల వర్షాలకు అన్నీ చెడిపోగా బాగుచేయలేదు. కమలానగర్‌లోని సహస్రలింగేశ్వరాలయం, ఓల్డ్‌కాప్రాలోని చెన్నకేశవాలయం, కుషాయిగూడలోని పద్మావతి వేంటంకటేశ్వరాలయంలో ఒక్కచోట మెటల్ డిటెక్టర్లు లేవు.

సనత్‌నగర్‌లోని సుప్రసిద్ధ ఏడుగుడుల ఆలయంగా పేరొందిన హనుమాన్ దేవస్థానంలో మెటల్ డిటెక్టర్లు లేవు. ఇంత పెద్ద ఆలయానికి రాత్రిపూట ఒక్కరే కాపలాగా ఉంటున్నారు. 16 సీసీ కెమెరాలుండగా అన్నీ ఆలయం లోపలే ఉన్నాయి.రెజిమెంటల్‌బజార్‌లోని సంతోషిమాత గర్భగుడిలోకి ఇటీవల పట్టపగలు ఓ దొంగ ప్రవేశించి చోరీ చేశాడు. మరో వ్యక్తి భక్తురాలి బ్యాగు దొంగిలించాడు. సీసీ కెమెరాలున్నా సరైన పర్యవేక్షణ లేకపోవడం సమస్య.చందానగర్‌లోని శ్రీవేంకటేశ్వర దేవాలయానికి వెనుక భాగంలో అర్చకుల కోసం గదులు నిర్మించారు. ఇక్కడి నుంచి దేవాలయానికి వెళ్లే దారి సరిగా లేదు. సీసీ కెమెరాలు లేవు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ మార్గంలో ఆలయంలోకి ప్రవేశించే అవకాశముంది.బల్కంపేట ఎల్లమ్మ-పోచమ్మ దేవస్థానంలో 32 సీసీ కెమెరాలుండగా 20 మాత్రమే పనిచేస్తున్నాయి. వీఐపీ, బోనాల కాంప్లెక్స్, కల్యాణ మండపం, రెండు శాశ్వత రేకులషెడ్లలో నిఘానేత్రాలు లేవు.ఉప్పల్ స్టేడియం సమీపంలో వెలుగుగుట్ట మీద శ్రీమల్లికార్జునస్వామి దేవాలయంలో ఈ ఏడాది మూడుసార్లు దొంగలు హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. రెండుసార్లు చోరీ యత్నం జరిగింది. 16 సీసీ కెమెరాలు సగం కూడా పని చేయడం లేదు.

# సమృద్ధిగా భూగర్భ జలాలు



కరీంనగర్ : జిల్లాలో జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు పెరిగాయి.. భూగర్భ జల శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ ఏడాది మే నెలలో భూగర్భ జలమట్టం జిల్లా సగటు 9.26 మీటర్లు ఉండగా.. అక్టోబరు నెలాఖరులో 4.26 మీటర్లకు చేరుకుంది. అంటే 5 మీటర్ల నీటిమట్టం పెరిగింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో బోర్లు, వ్యవసాయ బావులు రీఛార్జి అవుతున్నాయి. వీటికితోడు ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల ఆధారంగా వరద కాలువ ద్వారా మధ్య మానేరు జలాశయం, దిగువ మానేరు జలాశయాలు నింపడంతోనూ చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతుండగా భూగర్భజలాలు అందుబాటులో ఉంటున్నాయి.

**ఇదీ పరిస్థితి..**

జిల్లా సాధారణ వర్షపాతం 748.9 మి.మీ కాగా వానాకాలంలో కొన్నేళ్ల కిందటి వరకు వర్షంనీటిని భూమిలోకి ఇంకించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టని కారణంగా నీటి ఇబ్బందులు ఏర్పడుతూనే ఉన్నాయి. రోజురోజుకూ జనాభా పెరగడంతో నీటి వినియోగం ఎక్కువైనా పొదుపు చర్యలు చేపట్టలేదు. జిల్లాలో నీటి వనరులు ఎక్కువగా ఉండటంతో సమస్య తీవ్రత కనిపించలేదు.

ఈ వానాకాలంలో 1025.6 మి.మీల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే 286.7 మి.మీ వర్షాలు అధికంగా కురవడంతో భూగర్భ జలమట్టం పెరిగింది. కురిసిన వర్షాలతో భూమిలోకి నీరు చేరి పాతాళగంగ పైకి వచ్చింది.

జిల్లాలో ప్రతి నెలా 33 ఫిజోమీటర్ల ద్వారా నీటి లెక్కలు తీస్తున్నారు. ఈ ఏడాది మే నెలతో పోల్చితే సగటు మట్టంతో పెరుగుదల నమోదైంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గత సెప్టెంబరులో 3.31 మీటర్ల పైకి జలాలు ఎగిసి వచ్చాయి.

జిల్లాలో దాదాపు 800 చెరువులు, కుంటలు, నాలుగు జలాశయాలు ఉన్నాయి. దాదాపు 70 శాతం జలాశయాలు నీటితో నిండగా ఇప్పటికీ వరదకాలువ ద్వారా మధ్యమానేరుకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు వరద ఇక్కడకు చేరింది.

**నీటిని పొదుపుగా వాడుకోవాలి**

వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో జిల్లాలో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి.

గతంలో ఎన్నడూ లేనివిధంగా జలాలు పెరగడంతో పొదుపుగా వాడుకోవాలి. ఎంత అవసరమో అంతే వినియోగించుకోవాలి. నీరుంది కదా.. అంటూ వృథా చేస్తే మళ్లీ నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

నీటి ఇక్కట్లు ఏర్పడిన సమయంలో ప్రతి బిందువు ఎంత విలువైందో తెలుస్తుంది. ఈ నీటిని జాగ్రత్తగా వాడుకుంటే రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండవని భూగర్భ జలశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో భూగర్భ జలాలు (హెక్టా మీటర్లలో..)

వార్షిక లభ్యత : 89,027 హె.మీ

వార్షిక వినియోగం: 24,690 హె.మీ

వినియోగస్థాయి: 27.73 శాతం

భవిష్యత్తు గృహ అవసరాలకు కేటాయింపు: 1200 హె.మీ

మిగులు: 64493 హె.మీ

# పునరావాస గ్రామం.. సమస్యలతో సతమతం

వేములవాడ : జలాశయ నిర్మాణంలో సర్వం త్యాగం చేసిన నిర్వాసితులు తమకు కేటాయించిన ఆర్అండ్ఆర్ కాలనీలో సమస్యలు తిష్ఠ వేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సదుపాయాలపై పాలకులు, అధికారులు దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయంలో కొడుముంజ గ్రామం ముంపునకు గురైంది. నిర్వాసితులకు నాంపల్లి శివారులోని నందికమాన్ వద్ద ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేశారు.జలాశయంలో నీటి నిల్వ అనంతరం నిర్వాసితులు తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకొని ఇక్కడే నివాసం ఉంటున్నారు.

కాలనీ ఏర్పాటు సమయంలో తాగునీటి పైపులైన్, మురుగు కాలువలు, ఇతర సదుపాయాలు కల్పించారు. అయితే నిర్వాసితులు కాలనీకి వచ్చిన అనంతరం ఏర్పడిన సమస్యలను పరిష్కరించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగిసిన అనంతరం గ్రామంలో ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది.

ప్రస్తుతం మిషన్ భగీరథ తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు, పారిశుద్ధ్య సమస్యలు నెలకొన్నాయి. అనేక సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

ప్రధాన సమస్యలు ఇవీ...

పలు చోట్ల కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తుంది.

దోమల బెడద అధికంగా ఉంది. దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదు.మిషన్ భగీరథ నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఉంటుంది. పలు చోట్ల ఎత్తుగా ఉండటం వల్ల పైపులైన్‌ల నుంచి నీరు రావడం లేదు. డ్రమ్ములలో నీటిని పట్టుకొని వాడుకుంటున్నారు.

నీటి సరఫరా పైపులైన్‌లు పలు చోట్ల లీకవుతున్నాయి. వీధులు బురదగా మారుతున్నాయి.

వైకుంఠధామానికి దారి లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పరిష్కరించాలి

గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పారిశుద్ధ్యం, నీటి సరఫరాపై ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వైకుంఠధామానికి వెళ్లే దారి సమస్య పరిష్కరించాలి.

బూర రాజశేఖర్, స్థానికుడు, కొడుముంజ, ఆర్అండ్ఆర్ కాలనీ

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

గ్రామంలో పారిశుద్ధ్యం, నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. సమస్యలను పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.రాజీవ్ మల్హోత్రా, ఎంపీడీవో, వేములవాడ

# విద్యుత్తేజం.. ఎన్టీపీసీ కాంతి కిరణం

కరీంనగర్ : దక్షిణాది విద్యుత్తు దిగ్గజం ఎన్టీపీసీ రామగుండం పరిశ్రమ ఏర్పడి నేటికి 46 వసంతాలు పూర్తి చేసుకుంది. అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ 1978 నవంబరు 14న పునాదిరాయి వేయగా, దక్షిణాది వెలుగులకు కేంద్రంగా రామగుండం పేరు తెచ్చుకుంది. 200 మెగావాట్ల 3 యూనిట్లు, 500 మెగావాట్ల 4 యూనిట్లతో.. 2600 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. పరిశ్రమ ఆవిర్భావం సందర్భంగా ప్రత్యేక కథనం..

**మరో మైలురాయికి సిద్ధంగా**

తెలంగాణ కోసం ప్రత్యేకంగా 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాలన్న నిబంధన మేరకు ఎన్టీపీసీ ఇప్పటికే రూ.10,598 కోట్ల వ్యయంతో 1600 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లను నిర్మించింది. రూ.29,344 కోట్ల అంచనా వ్యయంతో రెండో దశ నిర్మాణంలో భాగంగా 2,400 మెగావాట్ల విద్యుత్తు ప్లాంటును మరో మైలురాయికి సిద్ధం చేస్తోంది.

**హరితహారానికి నిధులు అందించి**

హరితహారానికి సంబంధించి ఎన్టీపీసీ యాజమాన్యం సామాజిక బాధ్యత పథకం(సీఎస్సార్) కింద గతంలో రామగుండం ప్రాజెక్టు నిధుల్లో సుమారు రూ.15 కోట్లు ప్రభుత్వానికి అందజేసింది. అలాగే తెలంగాణ ప్రాజెక్టు పరిసరాల అభివృద్ధిలో భాగంగా రూ.1.62 కోట్లను అందజేసింది. పరిశ్రమ నుంచి వెలువడుతున్న బూడిదను వినియోగించి సిమెంట్ రహిత(జియోపాలిమర్) రహదారిని నిర్మించి ఆదర్శంగా నిలిచారు. బూడిద చెరువులో పేరుకున్న పొర(సినోస్పి యర్)ను పింగాణి పరిశ్రమల్లో వినియోగానికి అధ్యయనం చేశారు.

**అన్‌లాగ్ నుంచి డిజిటల్ దిశగా**

15 ఏళ్ల క్రితం అన్‌లాగ్ విధానంలో ఎన్టీపీసీ విద్యుత్తు ఉత్పత్తి చేసింది. సాంకేతిక అభివృద్ధితో డిజిటల్ కంట్రోల్ సిస్టమ్ విధానంలో ఒకేచోట ఉండి నియంత్రణ చేపడుతున్నారు. పర్యావరణ రక్షణకు 200 మెగావాట్ల మూడు యూనిట్ల టర్బైన్, జనరేటర్ విభాగాలను ఆధునికీకరిస్తున్నారు. నేడు 680 మంది ఉద్యోగులు, అధికారులు నాణ్యమైన విద్యుత్తు ఉత్పత్తికి దోహదపడుతుండగా.. 4500 మంది



ఒప్పంద కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

**విష వాయువులను తగ్గించేందుకు**

2600 మెగావాట్ల రామగుండం ఎన్టీపీసీలో వెలువడే కర్బన ఉద్గారాలను తగ్గించటానికి ఎఫ్‌జీడీ(ఫ్యూయల్ గ్యాస్ డీసల్ఫరైజేషన్) యూనిట్‌ను నెలకొల్పనున్నారు. మరోవైపు సౌర విద్యుత్తును మరింత ఉత్పత్తి చేయటానికి మరో అడుగు ముందుకువేసింది. 100 మెగావాట్ల నీటిపై తేలియాడే సౌర ఫలకాల విద్యుత్తు కేంద్రం నిర్మాణం కూడా పూర్తిచేసింది.

ఎన్టీపీసీ సాధించిన అవార్డులు

2018-19 సంవత్సరానికి స్వర్ణశక్తి అవార్డు

నేషనల్ ఎనర్జీ లీడర్-2019 అవార్డు

2017-18 సంవత్సరానికి హీట్ రేట్ ట్రోఫీ

ప్రజా ఆధారిత అభ్యాసాలు, సీఎస్ఆర్ ఆవిష్కరణలకు కాంస్య అవార్డులు

ఐఎస్ఓ-50001 ధ్రువీకరణ సర్టిఫికెట్

ఎనర్జీ కన్జర్వేషన్ ఇండస్ట్రీస్ అవార్డు-2024 ఎనర్జీ కంపనీ, గ్రామీణ క్రీడల నైపుణ్య బంగారు అవార్డు సామాజిక అవగాహన యాడ్ ఫిల్మ్, హెచ్ఆర్ వైవిధ్య బంగారు అవార్డులుఅంతర్జాతీయ ఎనర్జీ, ఎస్ఆర్ఈఐ, పవర్ క్విజ్ విజేత అవార్డులు

# రుణమాఫీ నిధులపై కర్షకుల కలవరం

జగిత్యాల : ఈ నెలలో, డిసెంబరులో మిగిలిన రైతులందరికీ పంట రుణమాఫీ నిధులను విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. మరోవైపు అర్హులైఉండి మాఫీ నిధులందని జిల్లాలోని వేలాది మంది రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఇలా అయితే ఎలా?**

జిల్లాలోని ఓ రెండు బ్యాంకుల పరిధి 7 బ్రాంచిల్లో పంటరుణం తీసుకున్న 4,161 మంది రైతులకు చెందిన రూ.51 కోట్లు మాఫీ కాలేదు. ఇదేమని జిల్లా అధికారులు ఆరాతీస్తే హైదరాబాద్‌లోని సెంట్రల్ సర్వర్‌లో జరిగిన పొరపాటుగా గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం 12.12.2018 నుంచి 9.12.2023 వరకు తీసుకున్న నూతన రుణాలు, రెన్యూవల్స్‌ను పరిగణలోకి తీసుకుని పంట రుణాలను మాఫీ చేసింది కానీ.. ఈ రెండు బ్యాంకుల పరిధిలో 4,161 మంది రైతులు 12.12.2018 కన్నా ముందుగా రుణం తీసుకుని కటాఫ్ తేదీల్లోనే రెన్యూవల్ చేసినా జాబితాలో చేర్చలేదు. వీరికి మాఫీ రావాలంటే రాష్ట్ర కేబినేట్ తీర్మానం మేరకు ప్రిన్సిపల్ సెక్రెటరీ సంతకం అవసరమని రాష్ట్ర ఉన్నతాధికారులు పేర్కొన్నారు. తమకు నిధులందేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో 2.70 లక్షల పంటరుణ ఖాతాలుండగా రేషన్‌కార్డుల ఆధారితంగా కుటుంబానికి రూ.2 లక్షల వరకే మాఫీ వర్తింపచేయటం, ప్రభుత్వ ఉద్యోగులు, ఒకరి పేరిటనే ఎక్కువ రుణాలుండటం తదితర కారణాలను మినహాయిస్తే 1,38,142 మందికి అర్హులుగా గుర్తించారు.

అర్హుల్లోనూ రూ.2 లక్షల్లోపు రుణమున్నవారిలో మొదటి మూడు విడతల్లో అనేక కారణాలతో జిల్లాలో 4,474 మందికి నిధులందలేదని ఫిర్యాదు చేశారు.

రేషన్‌కార్డుల్లేని 11 వేల కుటుంబాలను గుర్తించగా రూ.2 లక్షలకన్నా అధికంగా రుణమున్నవారు 50 వేలమందికిపైగా ఉన్నట్లు గుర్తించారు.

పట్టాదారు పాసుపుస్తకం కలిగిన భర్త విదేశాలకు వెళ్లటంతో వారి భార్యల పేరిట పంటరుణాన్ని ఇచ్చారు.

ప్రస్తుతం మహిళల పేరిట పట్టాదారు పాసుపుస్తకం లేనట్లు జాబితాలో రావటంతో ఈ అంశంపై సందిగ్ధం నెలకొంది.

రుణ ఖాతాలను మూసివేయటం, అసలుకన్నా వడ్డీ అధికంగా ఉండటం, బంగారం తనఖా రుణాలు తదితర 35 రకాల కారణాలతో చాలామంది మాఫీ జాబితాలోకి రాకపోగా వీరి సమస్యలను నిధుల విడుదలలోపు పరిష్కరించాల్సి ఉంది. అర్హుల్లో పంటరుణం మాఫీగాని కారణాలను విశ్లేషించి పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదించినట్లు డీఏవో రాంచందర్, ఎల్‌డీఎం రామ్‌కుమార్ పేర్కొన్నారు. కొన్ని సంఘాల్లో తమ పేరిట ఒకటికన్నా ఎక్కువ రుణాలను తీసుకున్నట్లు వందలాది మంది రైతులు అధికారులకు ఫిర్యాదు చేయగా ఇవి బోగస్ రుణాలుగా గుర్తించారు.

# పక్కా ప్రణాళిక.. సబ్జెక్టులపై పట్టు..!

గాజువాక : డీఎస్సీ కోసం ఐదేళ్లుగా కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు విద్యార్థులు. కూటమి ప్రభుత్వ వారి ఆశలను నెరవేరుస్తూ ఇటీవల డీఎస్సీ పోస్టుల భర్తీకి ప్రకటన జారీ చేసింది. దీంతో జిల్లాలోని వేలాది మంది బీఎడ్, డీఎడ్ విద్యార్థులు ముమ్మర సాధనలో మునిగిపోయారు. ఏయూ, పౌరగ్రంథాలయాల్లో ఎటుచూసినా వారే కనిపిస్తున్నారు. ఎలాగైనా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని నిద్రాహారాలు మాని చదువుతున్నారు. అయితే ఒక్కో పోస్టుకు వందలాది మంది పోటీ పడుతున్న దశలో..ఉద్యోగం సాధించడం అంత సులువు కాదని డీఎస్సీ శిక్షణ నిపుణులు చెబుతున్నారు. సబ్జెక్టులపై పట్టు సాధించి పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచిస్తున్నారు.


**సాధనతోనే గణితంలో విజయం**

గణితం విద్యార్థులు మూడో తరగతి నుంచి పదోతరగతి వరకు గణితం పాఠ్య పుస్తకాలను క్షుణ్ణంగా చదవాలి. తరగతి వారీగా కాకుండా ఉన్న సిలబస్ అంతా ఒక నోట్స్‌లో రాసుకుని ప్రతిరోజు మననం చేసుకుంటూ సాధన చేయాలి. ముఖ్యంగా సరాసరి, నిష్పత్తి, సంఖ్యా పద్ధతులు, జామెట్రీ, సమీకరణాలు, కాలము మరియు పని, గణాంకాలు (సగటు, మధ్య, మోడ్ విలువ, శాతం), ప్రాచీన గణితం (సరళ వడ్డీ, చక్రవడ్డి, లాభం, నష్టం, నిష్పత్తి, భాగం, గ్రాఫ్, ఛార్టు, విశ్లేషణల నుంచి అధికంగా ప్రశ్నలు వస్తాయి. సాధనలో వేగంతోనే గణితంలో విజయం సాధించవచ్చు.

– టి.తులసీరావు, గణిత అధ్యాపకులు, బీసీ స్టడీ సర్కిల్

**ఒక ప్రశ్నకు నాలుగైదు విధాలుగా సన్నద్ధమవ్వాలి**

సాంఘికశాస్త్రంలో ఒక ప్రశ్నకు నాలుగైదు విధాలుగా సమాధానాలు తయారుచేసుకోవాలి. భూగోళ శాస్త్రంలో మొక్కలు, భూవాతావరణం అంశాలపై విద్యార్థులు దృష్టి పెట్టాలి. ముఖ్యంగా భారతదేశ భూగోళ వైవిధ్యం నుంచి అధికంగా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. చరిత్రకు వచ్చే సరికి ప్రాచీన భారతదేశం (సింధు నాగరికత, వేదకాలం), మధ్య యుగ భారతదేశం(మొఘలులు, రాజపుత్రులు), ఆధునిక భారతదేశం (బ్రిటీష్‌పాలన, స్వాతంత్ర్య పోరాటం) అధ్యయాల నుంచి



అధికంగా ప్రశ్నలు వస్తాయి. రాజనీతిశాస్త్రం(పొలిటికల్‌సైన్స్)లో భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, కర్తవ్యాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధులు, కర్తవ్యాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. అర్థశాస్త్రంలో భారత ఆర్థిక వ్యవస్థ అనగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, పేదరికం, నిరుద్యోగం, సంక్షేమ పథకాలు, నూతన చట్టాలు, అంతర్జాతీయ సంబంధాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతిరోజు వాటిని పునశ్చరణ చేయాలి. లేదంటే గుర్తున్నట్లే ఉంటుంది కానీ మరిచిపోతాం. – డాక్టర్ ప్రియాంక, సాంఘిక శాస్త్రం అధ్యాపకురాలు, బీసీస్టడీ సర్కిల్

**శ్రద్ధపెడితే సైన్స్‌లో అధిక మార్కులు**

జీవశాస్త్రంలో జంతు, వృక్ష వర్గీకరణ, రక్తంలో గ్రూపులు, జీవవైవిధ్యం, శరీరశాస్త్రంలో కీళ్లు, అవయవాలు అంశాలపై తరచూ ప్రశ్నలు వస్తున్నాయి. ఆయా పాఠ్యాంశాల్లో ఎక్కడి నుంచి ప్రశ్న వచ్చినా సమాధానం రాసేలా పట్టు సాధించాలి. మాదిరి ప్రశ్నపత్రాలు సాధన చేస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. రసాయన శాస్త్రంలో మూలకాలు, సంయోగ రసాయన క్రియలు, ఆమ్లాలు, క్షారాలు, పరమాణు నిర్మాణం, పిరియాడిక్ టేబుల్, భౌతిక, రసాయన మార్పులపై ఎక్కువ దృష్టి పెట్టాలి.భౌతిక శాస్త్రంలో శక్తి, శక్తి మార్పిడి, శక్తి మాధ్యమాలు, విద్యుత్, గమనికలు, శబ్దం, కాంతి, శ్రవణ శక్తి, ఉష్ణోగ్రత, థర్మోడైనమిక్స్ అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాలి. తద్వారా డీఎస్సీలో మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. – సూర్యారావు, సైన్సు అధ్యాపకులు, బీసీస్టడి సర్కిల్

# చెత్తకుండీలా వరాహ నది

ఎలమంచిలి : వరాహనదిని ప్లాస్టిక్ వ్యర్థాలతో నింపేస్తున్నారు. గ్రామాల్లో సంపద కేంద్రాలను ఏర్పాటు చేసినా పంచాయతీ అధికారులు వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి ఎదురైంది. నదుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్రమాదకర రసాయనాలను గుట్టలుగా పోస్తున్నారు. ఫలితంగా నదీ జలాలు కలుషితం అవుతున్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా పంచాయతీ అధికారు దృష్టి సారించడంలేదు. ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల సరిహద్దులో రాహనది ప్రవహిస్తోంది. ఇటు ఏటికొప్పాక, అటు



దార్లపూడి గ్రామాల్లో చెత్తంతా వాహనాల్లో తీసుకెళ్లి నదిలో డంపింగ్ చేస్తున్నారు. మాంస దుకాణాల్లో వ్యర్థాలను నదిలోనే జారవిడుస్తున్నారు. కాలం చెల్లిన పురుగు మందులు, రసాయనాలు, శీతల పానియాల సీసాలను పారబోస్తున్నారు. ఆ వ్యర్థాలతో నది గట్టుకు సమాంతరంగా గట్టు తయారవుతోంది. ఇవి నదిలోకి జారి నీటి ప్రవాహం వచ్చినప్పుడు సముద్రంలో కలుస్తోంది. వీటి కారణంగా తీరం అంతా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతోంది. గ్రామంలో వచ్చిన చెత్తతో సంపద తయారు చేయడానికి ప్రభుత్వ రూ. లక్షలు ఖర్చు చేసి కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిని అలంకారప్రాయంగా వదిలేశారు. ఏటికొప్పాక, దార్లపూడి రెండు పంచాయతీల్లోనూ ఈ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఏటికొప్పాక గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ను ఈ విషయమై వివరణ కోరగా చెత్తను నిల్వ చేసేందుకు ప్రభుత్వ స్థలం గ్రామంలో లేకపోవడంతో నదిలో వేస్తున్నారన్నారు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, నదిలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# నాసిరకం పనులు.. అప్పనంగా బిల్లులు



అనంతపురం : గత వైకాపా హయాంలో రాక్రీట్ సంస్థకు హిందూపురం గృహనిర్మాణశాఖ అధికారులు దాసోహమయ్యారు. ఆ సంస్థ చేపట్టిన నాసిరకం నిర్మాణాలకు పూర్తిస్థాయి బిల్లులు మంజూరు చేశారు. ఉన్నతాధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే.. నాణ్యత పరీక్షలు చేయకుండానే బిల్లులకు ఆమోద ముద్ర వేసేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణం, బిల్లులు మంజూరుపై విజిలెన్స్ విచారణ చేపట్టారు. అయితే వైకాపా హయాంలో పనిచేసిన అధికారులే క్షేత్రస్థాయిలో ఇప్పటికీ పనిచేస్తుండటంతో విచారణ సజావుగా జరగలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో విచారణకు వచ్చిన విజిలెన్స్ అధికారులు హౌసింగ్ అధికారులు చెప్పిన వివరాలు రాసుకుని వెళ్లిపోయారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పునాదుల సంఖ్యను ఎక్కువగా చూపి..**

కొటిపి లేఅవుట్‌లో 2,675 పునాదులు నిర్మించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో 2 వేలకు మించి లేవని స్థానికుల ద్వారా తెలుస్తోంది. అయినా పునాదుల సంఖ్యను ఎక్కువ చేసి చూపించారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఒక్కో పునాదికి రూ.50 వేల చొప్పున చెల్లించడం గమనార్హం. ఇలా రూ.కోట్లలో ప్రజాధనం దుర్వినియోగమైనట్లు స్పష్టంగా తెలుస్తోంది. హౌసింగ్‌శాఖ హిందూపురం పరిధిలో గతంలో పనిచేసిన అధికారులే ఇప్పటికీ కొనసాగుతున్నారు. అప్పట్లో రాక్రీట్ సంస్థకు అనుచిత లబ్ధి చేకూర్చిన అధికారులే ఇప్పటికీ కొనసాగుతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ విచారణను ఈ అధికారులు పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. విచారణకు వచ్చిన విజిలెన్స్ సిబ్బందికి తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

**నిబంధనల ఉల్లంఘటన**

హిందూపురం పరిధిలోని కొటిపి లేఅవుట్‌లో 4,636 మందికి గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణ బాధ్యతలను అప్పటి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కుటుంబానికి చెందిన రాక్రీట్ సంస్థకు అప్పగించారు. వీటిలో 2,675 కాంక్రీట్ పునాదులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. వీటికిగాను ఇప్పటికే రూ.12.37 కోట్ల బిల్లులు రాక్రీట్ సంస్థకు చెల్లించారు. అయితే పునాదుల్లో ఏమాత్రం నాణ్యత కనిపించడం లేదు. నిబంధనల మేరకు 9 పిల్లర్లతో కాంక్రీట్ పునాది నిర్మించాల్సి ఉండగా.. చాలావరకు 6 పిల్లర్లు మాత్రమే వేశారు. పిల్లర్ల కోసం తవ్విన గుంతలు కూడా నిబంధనల మేరకు లేవు. 6 అడుగులు తవ్వాల్సిన చోట కేవలం 2 అడుగులు తవ్వి పిల్లర్లు నిర్మించారు. చాలా వరకు పునాదులకు సీసీ బెడ్డింగ్ వేయలేదు. పైపైన తవ్వి పునాదుల నిర్మాణం చేపట్టారు. పునాదుల నాణ్యతపై మరోసారి విచారణ జరపాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రకాశ్‌రెడ్డి అనుచరుడికే మళ్లీ పనులు**

గత ప్రభుత్వ హయాంలో హిందూపురం పరిధిలోని కొట్నూరు లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను రామగిరి మండలానికి చెందిన గుత్తేదారుకు అప్పగించారు. ఆయన తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డికి నమ్మినబంటు. గుత్తేదారు సోదరుడు ఇప్పటికీ ప్రకాశ్‌రెడ్డి వద్దే పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విజిలెన్స్ విచారణలో భాగంగా నిర్మాణాలను కొంతకాలం నిలిపివేశారు. అయితే హౌసింగ్ అధికారులు మళ్లీ ప్రకాశ్‌రెడ్డి అనుచరుడికే ఇళ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించడం గమనార్హం. ఇప్పటికే వారికి పెద్దమొత్తంలో బిల్లులు కూడా చెల్లించినట్లు సమాచారం. దీని వెనుక హిందూపురానికి చెందిన తెదేపా నాయకుల హస్తం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

**నాణ్యత బ్రహ్మాండంగా ఉంది..**

హిందూపురం పరిధి కొటిపిలో రాక్రీట్ సంస్థ నిర్మించిన పునాదుల్లో నాణ్యత బ్రహ్మాండంగా ఉంది. ఎక్కడా లోపాలు లేవు. బిల్లుల విషయంలోనూ అక్రమాలు జరగలేదు. చేసిన పనికే బిల్లులు మంజూరు చేశాం. కొన్ని పునాదులకు మాత్రం ఫిల్లింగ్ చేయకపోవడంతో ఆ మేరకు బిల్లులు నిలుపుదల చేశాం. కె.వెంకటనారాయణ, పీడీ, హౌసింగ్

# మాన్యం.. దైన్యం



శ్రీకాళహస్తి: పురాతన గుడిమల్లం ఆలయానికి సంబంధించిన మాన్యాలు అక్రమార్కుల పరమైనా యంత్రాంగం నిస్తేజంగా చూస్తోంది. దస్త్రాలు పక్కాగా ఉన్నా రాజకీయ ప్రాబల్యంతో ఏళ్లుగా కబ్జాదారులు సాగు చేసుకుంటున్నారు. ఆలయానికి ఆదాయం రాకపోవడం అటుంచితే.. దాతలు చేపట్టే అభివృద్ధి పనులకు అవసరమైన భూమి కోసం అధికారులు వెంపర్లాడాల్సిన పరిస్థితి. గుడిమల్లం ఆలయానికి సమీపంలోని గుడిమల్లం, గుండ్లకండ్రిగ, చెల్లూరు ప్రాంతంలో 28 ఎకరాలు అక్కడి రైతులు అక్రమంగా సాగు చేసుకుంటున్నారు. చుట్టుపక్కల దాదాపు 500 ఎకరాల్లో ఇప్పటికీ 360 ఎకరాలు ఆయా ప్రాంత రైతుల చేతుల్లో ఉన్నాయి. మిగిలిన భూములు అటవీ ప్రాంతంలో ఉన్నట్లు దస్త్రాలను బట్టి వెల్లడవుతోంది. ప్రస్తుతం ఆలయానికి సమీపంలో ఆక్రమణల్లో ఉన్న భూముల విలువ రూ.15 కోట్లకు పైమాటే. ఇప్పటికీ ఆలయ మాన్యం అనుభవిస్తున్న వారు ఆలయానికి ఒక్క పైసా చెల్లించకపోవడం గమనార్హం. ఇటీవల భూ వివాదంలోని నాలుగు ఎకరాల స్థలాన్ని సీసీఎల్ ఆలయానికి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేసింది. ఈ భూములు అనుభవిస్తున్న వారు అడ్డుకుంటున్నారు.

**దాతలున్నా.. స్థలమేదీ**

భక్తులు ఇటీవల ఆలయ అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు ముందుకొస్తున్నారు. కల్యాణ మండపాలు, అతిథిగృహాలు, విశ్రాంతి భవనాలతో పాటు కనీస వసతులు కల్పించేందుకు దాతలు ఆసక్తి చూపుతున్నా అవసరమైన స్థలం లేక అభివృద్ధికి అడుగులు పడటం లేదు.

**ఉన్నతాధికారులకు నివేదికలు**

ఆలయ మాన్యం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండటంపై ఉన్నతాధికారులకు నివేదించాం. సర్వే చేసి భూములు అప్పగించడం లేదా గుత్త చెల్లిస్తే అభివృద్ధి చేపట్టేందుకు వీలుంటుంది. ఇదే విషయాన్ని దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు తెలియజేశాం. – రామచంద్రారెడ్డి, ఈవో

**అభివృద్ధికి విఘాతం**

ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ హయాంలో రూ.2 కోట్ల నిధులు కేటాయించారు. ఘనంగా శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. అయితే నిధులు ఏమయ్యాయో తెలియకుండా పోయింది.


# వచ్చామా.. వెళ్లామా!

భీమవరం : రీసర్వేలో భూమి తగ్గిందని ఒకరు, అడంగల్ పేరు తప్పులు సరి చేయాలని మరొకరు... పాస్ పుస్తకం ఇప్పించాలని ఇంకొకరు.. ఇలా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఏళ్లుగా తిరుగుతూనే ఉన్నాం.' అంటూ వాపోతున్నారు రెవెన్యూ సదస్సులకు హాజరవుతున్న రైతులు.

**ప్రభుత్వ లక్ష్యం ఉన్నతమైనా..** ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడి కొంత మంది కింది స్థాయి సిబ్బంది తీరుతో భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. రెవెన్యూ సమస్యలు గ్రామ స్థాయిలో పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ నెల 13 నుంచి జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో సదస్సులు నిర్వహిస్తున్నారు. కానీ వీటిపై ముందస్తు ప్రచారం లేకుండా వినతులు తీసుకోవడానికి మాత్రమే అధికారులు పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎఫ్ఎంబీ, అడంగల్, 22ఏ జాబితా, నివాస స్థలాల జాబితా, రెవెన్యూ గ్రామపటం, ఇతర వివరాలతో అధికారులు సదస్సులకు హాజరు కావాల్సి ఉంది. వీటిని సదస్సుల్లో ప్రదర్శించాల్సి ఉన్నా కొన్నిచోట్లే అమలవుతున్నాయి.

ఏదీ ప్రచారం.. తణుకు, ఇరగవరం, అత్తిలిలో నిర్వహిస్తున్న సదస్సులపై విమర్శలు వస్తున్నాయి. ఏదో వచ్చాం వెళ్లాం అన్నట్లుగా కార్యక్రమాలు ఉన్నాయని అర్జీదారులు వాపోతున్నారు. గతంలోనూ ఇవే అర్జీలను అధికారులకు ఇచ్చామని అయినా పట్టించుకోలేదని అంటున్నారు. కాళ్ల, వీరవాసరం, అన్నవరం తదితర చోట్ల మొదటి రోజు నిర్వహించిన సదస్సుల్లో కనీసం 20 ఫిర్యాదులు కూడా రాలేదంటే ప్రచారం ఏ విధంగా నిర్వహించారో అర్థం చేసుకోవచ్చు.

క్షేత్రస్థాయికి వెళ్లకుండానే.. గత ప్రభుత్వ హయాంలో రీసర్వే ప్రక్రియను అస్తవ్యస్తంగా చేశారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండానే సర్వే పూర్తయినట్లు



నివేదికలు సమర్పించడంతో తప్పులు దొర్లాయి. వీటిలో అత్యధికంగా భూముల విస్తీర్ణం తగ్గుదల, సరిహద్దు తేడాలు, సంయుక్త ఎల్‌పీ నంబర్ల కేటాయింపుపై రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు అందుతున్నాయి. ఆచంట మండలంలో కొన్ని గ్రామాల్లో రికార్డుల ప్రకారం సర్వే పూర్తయిందని చెబుతున్నారు. కానీ సర్వే రాళ్లు వేసి సంబంధిత రైతులకు భూమి అప్పగించ లేదు. సరిహద్దుల్లో సర్వే రాళ్లు వేయకుండా సర్వే పూర్తయిందంటే ఎలాగని రైతులు ప్రశ్నిస్తున్నారు. సదస్సుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని డీఆర్‌వో వెంకటేశ్వరరావు అన్నారు.

ఉండి మండలం ఎన్.ఆర్.పి. అగ్రహారంలో తనికెళ్ల వెంకటేశ్వరరావుకు ఎకరా 80 సెంట్ల భూమి ఉంది. రీ సర్వేలో 20 సెంట్లు తగ్గింది. సరి చేయాలని అర్జీ సమర్పించారు. డి.వి.ఎస్.గిరిధర్‌కు నాలుగు ఎకరాల భూమి ఉంది. అడంగల్‌లో ఎకరా 10 సెంట్లు వేరే రైతు పేరుతో నమోదైంది. ఆ తప్పులను సరి చేయాలని తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పెంటపాడు మండలం పడమరవిప్పర్రులో శీలా రామకృష్ణకు యానాలపల్లి కండ్రిగలో నాలుగున్నర ఎకరాల పొలం ఉంది. జగనన్న రీసర్వేలో నాలుగు సెంట్లు పక్కనున్న రైతుకు కలిసింది. సమస్య పరిష్కరించాలని రీసర్వే సదస్సులు, గ్రామసభల్లో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదు.

# విజ్ఞానం.. వినోదం

కశింకోట : కాసేపు సేదతీరేందుకు, ఆటవిడుపు కోసం పిల్లలతోపాటు పెద్దలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించేందుకు శారదావనం శరవేగంతో సిద్ధమవుతోంది. విద్యార్థులకు అడవులను ప్రత్యక్షంగా చూపించడం, పర్యావరణంపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా 600 ఎకరాల రిజర్వు అటవీ భూమిలో 25 ఎకరాల మేర అందమైన ఉద్యానాన్ని బయ్యవరం సమీపాన జాతీయ రహదారి పక్కన రూ.1.40 కోట్లతో పూర్తి చేశారు. రెండో విడత మరో రూ.60 లక్షలతో మరిన్ని పనులు జరుగుతున్నాయి.

అటవీ భూమిలో విద్యార్థులకు అటవీ సంపదను, మొక్కలను పరిచయం చేస్తూ మొక్కల పెంపకం చేపట్టారు. బొటానికల్ గార్డెన్‌తో పాటు జంతు ప్రదర్శనశాల ఏర్పాటుకు కృషి జరుగుతోందని జిల్లా అటవీశాఖ అధికారులు తెలిపారు. పర్యాటకులను ఆకర్షించేందుకు పలు సౌకర్యాలను కల్పిస్తున్నారు. సందర్శకుల కోసం పచ్చదనంతో నిండిన వాతావరణంతో పాటు ప్రకృతిసిద్ధంగా ఉండేలా చెక్కతో నిర్మిస్తున్న



అందమైన విశ్రాంత భవనం, చిన్నారులకు ఆటల ప్రాంగణం, ఆరోగ్యకరమైన స్వచ్ఛమైన నీటిని అందించే ప్లాంట్, థియేటర్ అడుగడుగునా ప్రశాంతతను, ఆహ్లాదాన్నిపంచే మొక్కలు, కుటీరాలు, ఫలహారశాల తదితర నిర్మాణాలన్నీ చెక్కతో చేయడం ప్రత్యేకతను సంతరించుకుంటోంది. సామాజిక అటవీశాఖ డీఎఫ్‌వో లక్ష్మణ, సబ్‌డివిజనల్ అటవీ అధికారి ఎ.సునీల్‌కుమార్, అనకాపల్లి అటవీ ప్రాంత అధికారి జ్యోతిర్మయి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

అటవీ సంపదపై అవగాహన కల్పించేందుకు..: సాధారణంగా పర్యాటకులకు అటవీప్రాంతంలో ప్రవేశం ఉండదు. ప్రజానీకానికి అడవులను, అటవీ సంపదపై అవగాహన కల్పించేందుకు శారదావనాన్ని అభివృద్ధి చేస్తున్నాం. విద్యార్థులకు పర్యావరణం, ప్రకృతి వనాలను పరిచయం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే మొదటి విడత నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రెండో విడత పనులు ప్రారంభమయ్యాయి. వేసవి నాటికి పర్యాటకులకు ప్రవేశం కల్పించడమే ధ్యేయంగా శరవేగంతో పనులు జరుగుతున్నాయి.

– పొన్నాడ జ్యోతిర్మయి, జిల్లా అటవీరేంజ్ అధికారిణి

# చలిగాలులు.. చిరు జల్లులు

ఉండి : అన్నదాతలను అననుకూల వాతావరణం వేధిస్తోంది. చలి తీవ్రతకు తోడు మంగళవారం ఉదయం నుంచి మేఘాలు కమ్మేసి మధ్యమధ్యలో చిరుజల్లులు పడటంతో వ్యవసాయ పనులకు అంతరాయం ఏర్పడింది. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు సాగుదారులు పడరాని పాట్లు పడుతున్నారు. యంత్రాలతో ఒడ్డుకు చేర్చిన ధాన్యంలో వారం, పది రోజులైనా తేమశాతం నిర్ణీత స్థాయికి తగ్గకపోవడంతో విక్రయాలకు అవకాశం చిక్కడంలేదని రైతులు వాపోతున్నారు.

**తేమశాతంతో నష్టం..** జిల్లాలో 2.05 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగైంది. 80 శాతం విస్తీర్ణంలో పంట మాసూళ్లు పూర్తయ్యాయి. 4.10 లక్షల టన్నుల ధాన్యాన్ని ఆర్ఎస్‌కేల ద్వారా సేకరించాలనేది ప్రభుత్వ లక్ష్యం. 3,32,602 టన్నుల ధాన్యాన్ని (81.12 శాతం) కొనుగోలు చేయగలిగారు. ఈ నెల మొదటి వారంలో 'ఫెయింజల్' తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట, మురుగు కాలువ గట్లు, రహదారుల పక్కన పోసిన ధాన్యాన్ని పూర్తిగా ఆరకుండానే విక్రయించుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. నిబంధనల ప్రకారం తేమ 17 శాతం లోపు ఉన్న ధాన్యానికి కనీస మద్దతు ధర లభిస్తోంది. అంతకు మించితే ప్రతి ఒక్క శాతానికి రూ.23 చొప్పున ధర తగ్గిస్తారు. కొద్ది రోజులుగా చలితీవ్రత కారణంగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. మరోవైపు చిరిగిన సంచులిస్తున్న ప్రాంతాల్లో పట్టుబడి, ఎగుమతి, దిగుమతి సమయాల్లో కొంత ధాన్యం తరిగిపోయి నష్టపోతున్నట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సేకరణ ఇలా..**జిల్లాలో ఒక్క పెంటపాడు మండలంలో మాత్రమే లక్ష్యానికి మించి ధాన్యాన్ని సేకరించారు. తర్వాత వీరవాసరం– 98, ఇరగవరం– 95, పాలకోడేరు– 94, పెనుమంట్ర– 89, పెనుమంట్ర– 88, ఉండి– 86, తణుకు– 84, గణపవరం మండలంలో 80 శాతం మేర ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో మాసూళ్లు ఆలస్యమవుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో సేకరణ కూడా తక్కువగా ఉంది. మండలాల వారీగా ఆకివీడు 23, యలమంచిలి 33, కాళ్లలో 45, నరసాపురం 50, మొగల్తూరు 57 శాతం మేర మాత్రమే ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి.

**చిరిగిన సంచులు వెనక్కి..!..** రైతు సేవాకేంద్రాల్లో చిరిగిన సంచులను వెనక్కి రప్పించేందుకుప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నాం. వాటి స్థానే అవసరమైన సంచులు పంపిస్తున్నాం. జిల్లాలో 81.12 శాతం ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేశాం.సరోజ, డీఎస్‌వో

**వరి కోతలు వాయిదా వేసుకోండి జేసీ**

అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతల్ని రెండు మూడు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలన్నారు. అలాంటి అవకాశం లేని చోట్ల రైతు సేవా కేంద్రాల ద్వారా తేమశాతానికి అనుగుణంగా ధాన్యం విక్రయించుకోవచ్చన్నారు.

# అధికారులూ..ఇవేం దారులు?!!

గాజువాక : ఇంటి ముందు సీసీ రోడ్డు నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదని ఆ ప్రాంత ప్రజలు భావించారు. రోడ్డు నిర్మించాకగానీ తెలియలేదు.. కొత్త కష్టాలు మొదలయ్యాయని. గాజువాక 70వ వార్డు కుంచమాంబకాలనీ–తోకాడ మధ్య 260 మీటర్ల మేర 12 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్డు వేశారు. రహదారి, కల్వర్టులకు జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి రూ.1.67 కోట్లు మంజూరు కావడంతో ఈ పనులు పూర్తిచేశారు. అయితే ఈ రోడ్డును ఓ ప్రణాళిక ప్రకారం వేయకపోవడంతో కొత్త సమస్యలు తలెత్తాయి. నిర్మాణం తరువాత సమీప ఇళ్లల్లోని వారు రోడ్డుమీదికి రావడం కష్టమైపోతోంది. చాలాచోట్ల ఇళ్లకు..రోడ్డుకు మధ్య ఖాళీ ప్రదేశం ఉంది. అక్కడ ఇంకో రోడ్డు నిర్మించేంత ఖాళీ ఉంది. రోడ్డు ఎత్తులో...ఇళ్లు దిగువలో ఉన్నాయి. ప్రజల బాధలు పట్టించు కోకుండా... కేవలం 'రోడ్డు వేశాం.. మా పనైపోయింది' అనేలా చేస్తే ప్రయోజనం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాలువలు ఆధునికీకరించి ఇళ్ల వరకు ఎత్తు చేస్తామని జీవీఎంసీ అధికారులు చెప్తున్నా.. ఇప్పటికే రెండు నెలలు పూర్తికావడంతో ఇకముందు జరుగుతుందన్న నమ్మకం లేదని స్థానికులు చెప్తున్నారు.

# ప్రాశస్త్యం.. ప్రవర్ధమానం

శ్రీకాళహస్తి : పంచభూత లింగాల్లో మన రాష్ట్రంలో ఉన్న ఏకైక క్షేత్రంగా.. వాయులింగ క్షేత్రంగా ఖండాంతర ఖ్యాతి గడిస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయం దినదిన ప్రవర్ధమానం చెందుతోంది. ఇక్కడున్న ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా తెదేపా హయాంలో బృహత్తర ప్రణాళిక ఏర్పాటుకు ఆరేళ్ల కిందట బీజం పడింది. వైకాపా హయాంలో ప్రణాళికలు తరచూ మార్చడంతో ఐదేళ్ల పుణ్యకాలం పూర్తయింది తప్ప.. ఈ దిశగా అడుగులు పడిన దాఖలాలు లేకుండాపోయాయి. టెంపుల్ టూరిజం ప్రకటన నేపథ్యంలో పెరుగుతున్న రద్దీ, ఆదాయం తగ్గట్లుగా భక్తులకు కల్పించాల్సిన వసతులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

**ప్రత్యార్థకంగా ప్రణాళిక అమలు**

ఆలయానికి వస్తున్న భక్తుల వసతుల దృష్ట్యా బృహత్తర ప్రణాళిక అమలు ఒక్కటే పరిష్కారం. తిరుమలకు వెళ్లే భక్తుల్లో 60 శాతం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వస్తున్నారు. వారాంతంలో రోజుకు 25 వేల మందికి పైగా వస్తున్నారు. వచ్చిన భక్తులకు సంతృప్తికర దర్శనం అన్నది మాటలకు పరిమితం అవుతోంది. రాహు, కేతు పూజలకు దాదాపు రెండు గంటలు, దర్శనం కోసం మరో రెండు గంటలు ఇలా భక్తులు దర్శనం పూర్తి చేసుకునేందుకు దాదాపు నాలుగు నుంచి ఆరు గంటలు శ్రమించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో భక్తులు కూర్చుని విశ్రాంతి తీసుకునేందుకు క్యూ సముదాయాలు లేవు. ఒక్కసారిగా ఆలయంలోకి వచ్చాక మళ్లీ వెనక్కి వెళ్లేందుకు వీల్లేని పరిస్థితి. మధుమేహ



వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బృహత్తర ప్రణాళిక అమలైతే ఇక్కడకు వచ్చే భక్తులకు 90 శాతం సమస్యలు తీరినట్లే మరి.

**రద్దీయే కాదు.. ఆదాయమూ ఘనమే**

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వస్తున్న భక్తుల సంఖ్యతో పాటు ఆలయానికి వచ్చే ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. అందుకు తగ్గ వసతులైతే లేవనే చెప్పాలి. రాహు, కేతు సర్పదోష క్షేత్రంగా విరాజిల్లుతున్న ఇక్కడి ఆలయానికి ఏటా వస్తున్న ఆదాయం, రద్దీ, పూజలకు పెరుగుతున్న ఆదరణ, హుండీ ఆదాయం అంకంతకూ పెరుగుతోంది.

**కూటమి ప్రభుత్వంలో ప్రక్షాళన దిశగా..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రధానంగా దళారుల నియంత్రణ, దర్శనార్థం వచ్చే భక్తులకు అవసరమైన సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 'ప్రసాద' పథకం ద్వారా అత్యంత ఆధునాతన వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. యూపీఐ చెల్లింపులు, ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని టాయిలెట్స్ అందుబాటులోకి తీసుకురావడం, ఆలయాల్లో శుభ్రత, పారదర్శక పాలన అందిస్తూ ముందుకెళ్తున్నారు.

**వసతులు అందుబాటులోకి తెస్తున్నాం**

భక్తుల సేవయే భగవంతుని సేవ. ఇప్పటికే సామాన్య భక్తులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులోకి తీసుకువస్తున్నాం. రద్దీ సమయంలో భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా క్యూ సముదాయాల ఏర్పాట్లను పరిశీలిస్తున్నాం. పాలకులు, భక్తుల సలహాలు, సూచనలతో ఆలయ అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.
– టి.బాపిరెడ్డి, ఈవో, శ్రీకాళహస్తీశ్వరాలయం

# బియ్యం అక్రమ రవాణాపై ఏదీ విజి'లెన్స్'?

తిరుపతి : చిత్తూరుకు చెందిన ఓ నాయకుడు అప్పటి పెద్ద మంత్రి అండతో రేషన్ బియ్యం తరలించేవారు. పుత్తూరు, శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆయా ప్రాంతాల్లో బియ్యం సేకరించి పంపేవారు. సూళ్లూరుపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు తమిళనాడు, గూడూరు డివిజన్ ప్రాంతాల్లో రేషన్ సేకరించి తరలించేవారు. ఐదేళ్లు ఇష్టారాజ్యంగా దందా చేసిన వారిలో ఒకరిద్దరు మినహా మళ్లీ అక్రమ దందా సాగిస్తున్నట్లు సమాచారం. ఉప ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి ఆశ్చర్యపోయేలా వెలుగు చూస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ నిఘా కొరవడింది. రాష్ట్రంలో బియ్యం అక్రమ రవాణా మూలాలు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉన్నాయి. నగర,



పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.10–13 వరకు చెల్లించి సేకరిస్తున్నారు. డంపింగ్ ప్రాంతాల్లో భద్రపరిచి.. సరిహద్దులు దాటిస్తున్నారు. గత ఐదేళ్లు అడ్డదిడ్డంగా రేషన్ బియ్యం తరలించిన మాఫియా.. కూటమి ప్రభుత్వం కొలువైన కొద్ది రోజుల తర్వాత మళ్లీ అక్రమ రవాణాకు తెరతీశారు. చిత్తూరు, పుత్తూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట కేంద్రాలుగా రోజూ పదుల సంఖ్యలో వాహనాలు తరలిపోతున్నా విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టడం లేదు. గత ఆరు నెలల్లో ఐదు వాహనాలను మాత్రమే పట్టుకున్నారు.

**సమాచారం వస్తే స్థానిక పోలీసులకు..**

అక్రమ రవాణా సాగుతున్నట్లు విజిలెన్స్‌కు సమాచారం వస్తే స్థానిక పోలీసులకు చెప్పి విజిలెన్స్ అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. ఐదు టన్నుల కన్నా ఎక్కువగా ఉంటేనే విజిలెన్స్ దృష్టి సారిస్తోంది. అంతకన్నా తక్కువ ఉంటే స్థానిక పోలీసులు పట్టుకోవాలని అంటున్నారు. వారి మధ్య సఖ్యత లేకపోవడం వల్ల అక్రమ రవాణా సాగుతోంది. నిజానికి బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పౌర సరఫరాల శాఖ పూర్తిగా చోద్యం చూస్తోంది.

**సూత్రధారుల కోసం అన్వేషణ**

తిరుపతి ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేస్తున్న అనేక పనుల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా ఓ భాగం మాత్రమే. అయినా ఇటీవల తిరుపతి బొమ్మల క్వార్టర్స్ వద్ద లారీని పట్టుకున్నాం. సూళ్లూరుపేట వద్ద 2, నాయుడుపేట, దొరవారిసత్రం వద్ద మరో రెండు వాహనాలు పట్టుకుని పౌర సరఫరాల శాఖకు అప్పగించాం. బియ్యం తరలింపులో సూత్రధారులు ఎవరనే విషయంపై దర్యాప్తు జరుగుతుంది. – కరీముల్లా షరీఫ్, తిరుపతి ప్రాంతీయ అధికారి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

# వారికి కరెంటన్నా భయం లేదు




అనంతపురం : కూడేరు సెక్షన్ పరిధిలో విద్యుత్తుశాఖ ఏర్పాటు చేసిన వివిధ సామర్థ్యం ఉన్న 12 నియంత్రికలను దుండగులు పగులకొట్టి అందులో ఉండే కాపర్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. ఆరు నెలల కాలంలో ఇలాంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాధారణంగా కరెంటు సరఫరా అయ్యే సామగ్రి, పరికరాలను ముట్టుకోవాలంటే అందరూ భయపడతారు. విద్యుత్తు సరఫరా ఆయ్యే నియంత్రికలు, పరికరాలను ముట్టుకుంటే ఎక్కడ షాక్ కొట్టి ప్రాణాలు కోల్పోతామేమోనని ప్రతి ఒక్కరూ జంకుతారు. కొంతమంది మాత్రం విద్యుత్తు నియంత్రికలనే ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. వ్యవసాయ, గృహ సర్వీసులకు విద్యుత్తు సరఫరా ఇచ్చేందుకు పొలాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన నియంత్రికలను దుండగులు పగులకొట్టి (ధ్వంసం చేసి) వాటిలో ఉండే రాగి, ఆయిల్ వంటి వాటిని ఎత్తుకెళుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గత ఏడాది కాలంలో 16 కేవీ, 25 కేవీ, 63 కేవీ, 160 కేవీ సామర్థ్యం ఉన్న 80 నియంత్రికలను పగులకొట్టి వాటిలో ఉండే ఆయిల్, సామగ్రిని దొంగిలించారు. నియంత్రికలను దొంగలు ధ్వంసం చేస్తుండటంతో విద్యుత్తు సరఫరా లేక సాగు చేసిన పంటలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసం చేసిన నియంత్రిక స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడంలో విద్యుత్తు అధికారులు జాప్యం చేస్తున్నారని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం**

గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన నియంత్రికలకు సంబంధించి పోలీసుశాఖ వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదు. ఎఫ్ఐఆర్ పత్రం ఉంటే కొత్త నియంత్రిక ఏర్పాటు చేసేందుకు అంచనా తయారు చేసేందుకు వీలవుతుందని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. త్వరితగతిన అంచనా వేసి నియంత్రిక ఏర్పాటు చేయకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. పగులకొట్టిన వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతూ రైతులు విద్యుత్తు కార్యాలయాల చుట్టూ వ్యయ, ప్రయాసలకు ఓర్చి తిరుగుతున్నారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి వివిధ రకాల పంటలు సాగుచేశామని, అవి కళ్లముందే ఎండుతున్నాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు**

గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్న నియంత్రికలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాపీ ఇవ్వాలని పోలీసు అధికారులకు విద్యుత్తు అధికారులు కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా త్వరగతిన కొత్తవి ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. నియంత్రికలు ఎక్కువగా పగులకొట్టిన ప్రాంతాల్లో విద్యుత్తు విజిలెన్స్ పోలీసులు సంబంధిత ప్రాంత రైతులతో కలిసి గస్తీ నిర్వహిస్తున్నారు. త్వరలోనే నియంత్రికకు నాలుగు వైపులా ట్యాగ్ వెల్డింగ్ చేయిస్తాం. ఇలా చేయడం వల్ల దుండగులు నియంత్రికను సులువుగా పగులకొట్టలేరు.
సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్తుశాఖ

**వారికి రూ.వేలల్లో ఆదాయం.. విద్యుత్తుశాఖకు రూ.లక్షల్లో నష్టం**

నియంత్రికలను ధ్వంసం చేసి అందులో ఉండే సామగ్రి, ఆయిల్‌ను దోచుకెళుతున్న దొంగలకు వచ్చేది రూ.వేలల్లో మాత్రమే. అయితే విద్యుత్తుశాఖకు మాత్రం రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. లీటరు ఆయిల్ ధర 108, కిలో కాపర్ రూ.1,000 ఉంటుంది. ఒక 25 కేవీ నియంత్రికలో 30 నుంచి 35 కేజీల కాపర్, 70 నుంచి 80 లీటర్ల వరకు ఆయిల్ ఉంటుంది. అయితే దోచుకెళ్లిన దొంగలు ఆయిల్, కాపర్‌ను అతి తక్కువ ధరకే అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని పోలీసులు చెబుతున్నారు. అక్కడక్కడ దొంగలు పట్టుపడినా పోలీసులు వారి నుంచి ఆయిల్, కాపర్ రికవరీ చేసి విద్యుత్తుశాఖకు అందజేసినా అది స్క్రాప్ కిందకు మాత్రమే వెళుతుందని విద్యుత్తుశాఖ అధికారులు తెలిపారు. ఏడాది కాలంలో వివిధ సామర్థ్యం గల నియంత్రికలు 80 వరకు దుండగులు ధ్వంసం చేయడంతో విద్యుత్తుశాఖకు రూ.80 లక్షల నష్టం వాటిల్లింది.

# డిస్ట్రిబ్యూటరీ కమిటీలన్నీ ఏకగ్రీవం



అనంతపురం : జిల్లా జలవనరుల శాఖలో డిస్ట్రిబ్యూటరీ కమిటీల(డీసీ) ఎన్నికలు పూర్తి అయ్యాయి. మంగళవారం అనంత, గుంతకల్లులో నిర్దేశిత డివిజన్ కార్యాలయాల్లో ఈ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఏవైన వివాదాలు, గొడవలు జరిగే అవకాశం ఉందన్న ఉద్దేశంతో పోలీసులు భారీగా మోహరించారు. ఒక రోజు ముందుగానే సంబంధిత కాలువల పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షుల (డబ్ల్యూయూఏ) మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో ఏ డీసీకి పోటీ తలెత్తలేదు. ఈనెల 14న జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎంపికైన వారే డీసీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక చేశారు. ఆరు కమిటీలూ ఏకగ్రీవం అయ్యాయి. అయితే.. తాడిపత్రి ఉప కాలువ(టీబీసీ) డీసీ కమిటీ వ్యవహారంలో తెరచాటుగా కొంత వివాదం రాజుకున్నట్లు తెలుస్తోంది. అందుకే నిర్దేశిత సమయం ముగిసినా ఎంపికను పూర్తి చేశారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ పర్యవేక్షణలో మొత్తమీ ఆరు డీసీ కమిటీలు ఎంపిక అయ్యాయి. అనంత లోకలైజేషన్ డివిజన్ ఆవరణలో ఈఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, డీఈ రమణారెడ్డి ఆధ్వర్యంలో హెచ్ఎల్ఎంసీ, ఎమ్పీఆర్ దక్షిణ, ఉత్తర కాలువలు, డీసీ డివిజన్ కార్యాలయంలో ఈఈ అబ్దుల్ షమీమ్, డీఈ రాజశేఖర్ సారథ్యంలో టీబీసీ, గుంతకల్లులో జీబీసీ, ఆలూరు ఉప కాలువ కమిటీలకు ఎన్నికలు జరిగాయి. అన్ని చోట్లా ఒక్కొక్క నామపత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్లు సంబంధిత ఎన్నికల అధికారులు ప్రకటించారు.

**గడువు ముగిసినా.. ఎన్నిక**

తాడిపత్రి డీసీ మినహా.. అన్ని డీసీ కమిటీలు నిర్దేశిత సమయంలోనే పూర్తి అయ్యాయి. కానీ.. తాడిపత్రి ఉప కాలువ(టీబీసీ) కమిటీ మాత్రం నిర్దేశిత సమయం ముగిసిన తర్వాత ఎన్నిక జరగడం విశేషం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అధ్యక్ష స్థానానికి ఉదయం 9 నుంచి 9.15 గంటలోపే నామినేషన్ దాఖలు చేయాలి. ఉదయం 10.30 గంటల్లోపే ఎన్నిక పూర్తి చేయాలి. ఉపాధ్యక్ష స్థానానికి ఉదయం 11 నుంచి 11.15 గంటల్లోపే నామపత్రాలు దాఖలు పరచాలి. ఎంపిక మొత్తం 12.15 గంటల్లోపే పూర్తి చేయాలి. కాని.. టీబీసీ డీసీ ఎంపిక ప్రక్రియ మధ్యాహ్నం 12.08 గంటల తర్వాత మొదలైంది. అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు గడువు ముగిసిన తర్వాత నామినేషన్లు స్వీకరించడం విశేషం. నిర్దేశిత సమయానికి కేవలం పుట్లూరు మండలం కోమటికుట్ల డబ్ల్యూయూఏ అధ్యక్షురాలు ప్రమీలమ్మ ఒక్కరే హాజరయ్యారు. మిగతా వారందరూ మధ్యాహ్నం 12 గంటల తర్వాతే వచ్చారు.

**కొత్త డీసీల సారథులు వీరే..**

హెచ్ఎల్ఎంసీ డీసీ అధ్యక్షుడిగా కె.కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి.రమేశ్‌బాబు, ఎమ్పీఆర్ దక్షిణ కాలువ డీసీ అధ్యక్షుడిగా కొర్రపాటి శేఖర్, ఉపాధ్యక్షుడిగా కె.చంద్రాయుడు, ఎమ్పీఆర్ ఉత్తర కాలువ డీసీ అధ్యక్షుడిగా కె.రాజారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.వెంకటేసు, టీబీసీ డీసీ అధ్యక్షురాలిగా కె.ప్రమీలమ్మ, ఉపాధ్యక్షుడిగా పి.సత్యనారాయణ రెడ్డి, జీబీసీ–జీఎస్‌బీసీ డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బి.మర్రయ్య, ఎ.రామకృష్ణ, ఆలూరు డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్.కిష్టప్ప, ఎం.రామాంజనేయులు ఎంపిక అయ్యారు.

# మార్కెట్‌కు తెస్తే.. నష్టాలే

పలమనేరు : టమాటాలను మార్కెట్‌కు తీసుకొస్తే చేతి నుంచి సొమ్ములు ఖర్చు చేయాల్సి వస్తోంది. మొన్నటి వరకు టమాటా పెట్టెలు మార్కెట్‌కు తెచ్చి విక్రయిస్తే వచ్చే సొమ్ములు పెట్టిన ఖర్చులకు సరిపోయేవి. ఇప్పుడు అదీ రావడం లేదు. దీంతో రైతులు పంటను తోటల్లోనే వదిలేస్తున్నారు. పలమనేరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో 9 వేల హెక్టార్లలో టమాటా సాగవుతోంది. ధరలు మాత్రం రైతులతో దోబూచులాడుతున్నాయి. మధ్యవర్తుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వస్తేనే పంటకు మంచి ధర లభిస్తుంది. తమిళనాడు నుంచి పెద్ద వ్యాపారులు రావడానికి ఇక్కడ మార్కెట్‌లో సరైన వసతి లేదు. పది చక్రాల లారీలు ఇక్కడ మార్కెట్‌కు సరిపోవు. దీంతో వారు సమీపంలోని కర్ణాటకలోని ఒడ్డిపల్లె మార్కెట్‌కు వస్తుంటారు. ప్రభుత్వం మార్కెట్ వసతి మెరుగు పరచాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని పలమనేరు మార్కెట్ కమిటీ



కార్యదర్శి సంజీవ్‌కుమార్ తెలిపారు.

**ఖర్చు మోపెడు** ఎకరా సాగుకు రూ.లక్ష వరకు ఖర్చవుతోంది. ఎకరాకు 500 నుంచి 600 బాక్సుల టమాటా పండుతోంది. 15 కిలోల పెట్టె ధర రూ.180 లెక్కన విక్రయిస్తే పెట్టిన ఖర్చు మాత్రమే వస్తుంది. రవాణా ఖర్చు అదనం. కుటుంబం మొత్తం ఇదే పని చేస్తున్నా కూలి కూడా గిట్టుబాటు కావడంలేదు.

# అక్కడ జలకళ.. ఇక్కడ వెలవెల

కుప్పం : జల వనరులను నిర్లక్ష్యం చేస్తే ఎలా ఉంటుందో కుప్పం నియోజకవర్గాన్ని.. సద్వినియోగం చేసుకుంటే ఎలా ఉంటుందో పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రాన్ని పరిశీలిస్తే ఇట్టే తెలుస్తుంది. వైకాపా హయాంలో కల్లబొల్లి మాటలు చెప్పడం మినహా జల సంరక్షణకు కనీస చర్యలు తీసుకోకపోవడంతో స్థానిక చెక్‌డ్యామ్‌లు బోసిపోతుండగా.. కర్ణాటకలో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంతో జలసంరక్షణ సాధ్యమైంది. ప్రభుత్వ విధానాల వల్ల భూగర్భ జలాల వృద్ధితో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదని కన్నడవాసులు అంటున్నారు.

**జగన్ హయాంలో జలవనరులపై నిర్లక్ష్యం**

ఐదేళ్ల జగన్ హయాంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.కోట్లలో నిధులు ఖర్చు చేసినట్లు ఊదరగొట్టినా క్షేత్రస్థాయిలో జలసంరక్షణను గాలికొదిలేసింది. కుప్పంలో పాలారు.. పలమనేరు నియోజకవర్గంలో కైగల్, కౌండిన్య నదుల్లో జలసంరక్షణకు చర్యలు చేపట్టలేదు. రెండేళ్ల కిందట వర్షాలకు నదులు నిండినా.. జలసంపద అనతి కాలానికే వృథాగా తమిళనాడుకు చేరిపోయింది. ఆనకట్టల మరమ్మతులను విస్మరించడం.. కొత్తవాటి నిర్మాణాలకు నిధులు



విదల్చకపోవడంతో.. నదీ జలాల సద్వినియోగానికి అవకాశం లేకపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు** కూటమి ప్రభుత్వ పాలనలో నీటి వనరుల అభివృద్ధితోపాటు కొత్తగా ప్రాజెక్టులు సాకారమవుతాయని అన్నదాతలు ఆశిస్తున్నారు. నదీ జలాల సద్వినియోగంతోపాటు హంద్రీ– నీవా కాలువలో నీటిని పారించి.. సాగు,తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**హంద్రీ–నీవా పేరుతో మసిపూసి**

కుప్పం, పలమనేరు నియోజకవర్గాలకు నీళ్లిచ్చామంటూ.. జగన్ సర్కారు మసిపూసి మారేడుకాయ చేసింది. ముగింపు దశ పనుల పేరుతో దాదాపు రూ.వంద కోట్లను ఖర్చు చేసి ఆఖరికి సినిమా సెట్టింగ్‌ను తలపించే విధంగా కుప్పం బ్రాంచి కాలువలో నీటిని పారించింది. ప్రచారానికి సైతం రూ.కోట్లలో ఖర్చు చేసింది.

**అటు చూడు**

శాంతిపురం మండల సరిహద్దు కర్ణాటక పరిధిలోని సొక్కరబండ గ్రామం వద్ద 20 అడుగుల లోతైన బావిలో సమృద్ధిగా నీరుంది. ఎగువన చెరువులో నీటి నిల్వ వల్ల దిగువన బావులు, బోర్లలో కనీస మట్టంలోనే జలకళ సంతరించుకోవడంతో.. సాగు భూములు చక్కటి పంటలతో కళకళలాడుతున్నాయి. ఏడాదిలో రెండు.. మూడు పంటలు పండిస్తున్నారు.

**ఇటు మోడు** ఇది శాంతిపురం మండల కేంద్రానికి సమీపంలో బోసిపోయిన పాలారు చెక్‌డ్యాం. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 42 కి.మీ. పరిధిలోని పాలారులో 37 చెక్‌డ్యాంలు ఉండగా.. దాదాపు అన్నీ ఎండిపోయాయి. ఎగువ ప్రాంతంలో వర్షాలకు చెరువులు, కుంటలు నిండితే మిగులు జలాలు పాలారు చేరుతాయి. వైకాపా హయాంలో పాలారును పట్టించుకోలేదు. జలసంరక్షణకు చర్యలు చేపట్టకపోవడంతో ఈ ఏడాది శీతాకాలం ఆరంభంలోనే నీటి వనరులు ఒట్టిపోయాయి. వేసవికి మునుపే నీటి ఎద్దడి ఖాయమని జనం ఆందోళన చెందుతున్నారు.

# భూ విలువల సవరణకు కసరత్తు

చిత్తూరు : కొత్త ఏడాది 2025 జనవరి 1 నుంచి సవరించిన భూ విలువల అమలుకు స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల ప్రకారం పట్టణాలు, పల్లెల్లో ఒకేసారి అమలుకు సన్నద్ధమవుతోంది. కొత్త భూ విలువలు, నిర్మాణ విలువల సవరణపై యంత్రాంగం కసరత్తు మొదలెట్టింది. రిజిస్ట్రేషన్లు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, ప్రస్తుత ధరలు, గతంలో ఎన్నిచోట్ల పెంచారు, పెంపు శాతం ఎంత? అనే వివరాలపై అధ్యయనం చేస్తున్నారు.

**తాజాగా 10-15 శాతంలోపే**

సాధారణంగా ఏటా పట్టణాల్లో, రెండేళ్లకోసారి పల్లెల్లో భూ విలువల్ని సవరిస్తారు. గతంలో సవరణలు సక్రమంగా జరగలేదనే విమర్శల కారణంగా ఈ సారి విలువల సవరణను 10–15 శాతంలోపే చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. జేసీ పర్యవేక్షణలో జిల్లా కమిటీల ఆమోదం తెలిపిన తర్వాత.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సవరించిన విలువల్ని నోటీసులో ఉంచుతారు. వీటిపై ఈ నెల 24 వరకు అభ్యంతరాలు, సలహాలు స్వీకరిస్తారు. వీటిపై 27 వరకు పరిశీలన



జరుగుతుంది. తర్వాత 2025 జనవరి 1 నుంచి కొత్త విలువలు అమలవుతాయి. భూవిలువలు పెరిగిన క్రమంలో స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుముల్లో కాస్త పెరుగుదల ఉంటుంది. ఒకటో తేదీ నుంచి పెరిగే అదనపు మోత తప్పించుకునేందుకు ఈ నెలాఖరులోగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని క్రయవిక్రయదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పోటెత్తే అవకాశం ఉంది.

**గతంలో ఇష్టానుసారం**

వైకాపా ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారం భూ విలువల్ని సవరించారనే విమర్శలు వచ్చాయి. గతంలో ఉన్న విలువపై కనిష్ఠంగా ఐదు శాతం నుంచి గరిష్ఠంగా 70 శాతం వరకు సవరణలు చేశారు. సవరించిన విలువల్ని 2023 జూన్ 1 నుంచి అమలు చేశారు. ఆ ప్రభావంతో గత వార్షిక లక్ష్యాల సాధనపై ప్రభావం చూపాయి. గత వార్షికంలో నిర్ణీత లక్ష్యాల్ని అధిగమించలేకపోయాయి. 2023–24 వార్షికాదాయ లక్ష్యం రూ.181 కోట్లు కాగా.. ఆర్జించింది రూ.92.52 కోట్లే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక స్థిరాస్తి రంగంలో కాస్త వేగం కనిపిస్తోంది.

# 5 ఏళ్ల విజ్ఞానాంధకారం

కర్నూలు : విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాల అభివృద్ధిని గత ఐదేళ్లుగా వైకాపా పాలకులు పట్టించుకోక పోవడంతో వీటి మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల వికాసానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటున్న గ్రంథాలయాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో లభించడం లేదు. కొత్త పుస్తకాలు కావాలని అభ్యర్థులు కోరుతున్నా నిధుల కొరత కారణంగా గత ప్రభుత్వం కొనుగోలు చేయలేదు.'కూటమి' ప్రభుత్వం 'మెగా' డీఎస్సీ విడుదలకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే టెట్ ఫలితాలొచ్చాయి.. నిరుద్యోగులు 'పోటీ' పడేందుకు సిద్ధమవుతున్నారు. శిక్షణ కేంద్రాలకు వెళ్లలేని పేద విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్తున్నారు. అక్కడ పాత సిలబస్ పుస్తకాలే దర్శనమిస్తున్నాయి.. వాటితో 'పోటీ'పడేదెలా అంటూ నిరుద్యోగులు మథన పడుతున్నారు.

**పట్టించుకోని వైకాపా**

2014-19 కాలంలో తెదేపా ప్రభుత్వ హయాంలో పది భవనాల నిర్మాణాలకు సుమారు రూ.4 కోట్లు ఖర్చు చేశారు. వైకాపా ప్రభుత్వంలో నాలుగు భవనాలకు రూ.1.50 కోట్లు కేటాయించారు. ఇందులో మూడు భవనాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. తెదేపా ప్రభుత్వ హయాంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలే సుమారు 70 వేల వరకు కొనుగోలు చేయడం విశేషం. అప్పట్లో పుస్తక దాతలు సైతం ఎక్కువగా స్పందించేవారు.

వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019 నుంచి ఇప్పటివరకు ఒక్కసారే పుస్తకాలు కొనుగోలు జరిగింది. అదీ 2021-22లో రూ.37 లక్షల విలువ చేసే 40 వేల పుస్తకాలు కొనుగోలు చేశారు. ఒక్కో మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయానికి 6 వేల నుంచి 7 వేల పుస్తకాలు సరఫరా చేశారు.

**రూ.కోట్లల్లో సెస్సు బకాయిల**

కర్నూలు నగరపాలక సంస్థతోపాటు పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో వసూలవుతున్న ఇంటి పనుల్లో 8 శాతం గ్రంథాలయ సెస్సు కింద వసూలు చేస్తున్నారు. వాటిని గ్రంథాలయాల ఖాతలో జమ చేయాలి.. కానీ పూర్తిస్థాయిలో అందడం లేదు. సంబంధిత అధికారులకు విన్నవించినా ప్రయోజనం శూన్యమే. కర్నూలు నగరంలో జిల్లా గ్రంథాలయ సంస్థతోపాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 58 గ్రంథాలయాలు ఉన్నాయి. వీటి నిర్వహణకు ఏటా సుమారు రూ.6 కోట్ల వరకు రావాల్సి ఉంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు సమకూరాయి. కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థకు ప్రభుత్వం నుంచి రూ.7 కోట్ల వరకు రావాల్సి ఉంది.

**పోటీపడతాం.. కొత్త పుస్తకం కావాలి**

గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రంథాలయాలకు ఒక్క పుస్తకం ఇవ్వలేదు. నగరంలోని గ్రంథాలయంలో డీఎస్సీకి సంబంధించి 816, టెట్‌కు 637, గ్రూప్-1కు 798, గ్రూప్-2 665, గ్రూప్-3 226, గ్రూప్-4కు సంబంధించి 107 పుస్తకాలు ఉన్నాయి. పాత సిలబస్ ఉన్న పుస్తకాలతో విద్యార్థులు పరీక్షలకు 'పోటీ' పడలేకపోతున్నారు. అతి త్వరలో మెగా డీఎస్సీ ప్రకటన విడుదలయ్యే అవకాశం ఉంది. పోటీ పడే నిరుద్యోగులు పెద్దఎత్తున గ్రంథాలయాలను ఆశ్రయించే అవకాశముంది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, దాతలు స్పందించి పుస్తకాలు సమకూర్చాలని నిరుద్యోగులు విన్నవిస్తున్నారు.

**ఇక్కడికి తరలొస్తారు**

నగరంలోని జిల్లా గ్రంథాలయానికి కేవలం నిరుద్యోగులే నిత్యం 100 మంది నుంచి 120 మంది వస్తుంటారు. వీరి సౌకర్యార్థం పదేళ్ల కిందట మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ ఆధ్వర్యంలో రీడింగ్ హాలు నిర్మించారు. మెగా డీఎస్సీ విడుదల కానుంది.. తాజా పుస్తకాలు అందుబాటులోకి తీసుకొస్తే నిరుద్యోగులు మేలు చేకూరుతుంది. “జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తే బాగుంటుంది. కొత్త పుస్తకాలు తెప్పించాలి. దీనిపై మంత్రి టీజీ భరత్ దృష్టి సారించాలని ” నిరుద్యోగ యువత విన్నవిస్తోంది.

**భవనం కూలుతోంది**

ఆదోని పట్టణంలోని ఆకాశవంతెన కింది భాగంలో శాఖ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. భవనం శిథిలావస్థకు చేరింది. నాలుగు గదులుండగా ఓ గదిలో పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. పాఠకులు కూర్చునేందుకు ఫర్నిచర్ లేదు. భవనాన్ని మరో ప్రాంతంలో నిర్మించాలని కొన్నేళ్లుగా కోరుతున్నా.. ప్రతిపాదనలకే పరిమితమైంది. నిరుద్యోగ యువత కోసం అవసరమైన రైల్వే, ఈపీఎఫ్, గ్రూప్స్, సివిల్స్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. మూడేళ్లుగా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు సరఫరా కాకపోవడంతో యువత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**కొత్త పుస్తకాలు కావాలండోయ్**

ఎమ్మిగనూరు పట్టణంలో రూ.33 లక్షలతో గ్రంథాలయాన్ని నిర్మించినా పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు లేక నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఏడాది నుంచి సరఫరా చేయడం లేదు. ఉన్న వాటితోనే సర్దుబాటు చేసుకోవాల్సి వస్తోందని నిరుద్యోగులు పేర్కొన్నారు.

# కారు కాయలకు కారుచౌక బేరం

పాకాల : మామిడి కాయలంటే సాధారణంగా మే, జూన్ మాసాల్లోనే మార్కెట్‌లో సందడి చేస్తాయి. ఇతర సీజన్లలో అడపాదడపా కొన్ని చెట్లలో కాయలు కనిపించినా అవి పరిమతంగానే కాస్తాయి. వాటిని 'కారు కాయల' పేరుతో స్థానిక మార్కెట్లలోనే విక్రయిస్తారు. ఐతే ఈ ఏడాది అందుకు భిన్నంగా ప్రస్తుతం పలు తోటల్లో చెట్లనిండా కాయలు కళకళలాడుతున్నాయి. కాలంకాని కాలంలో మామిడి కాపు రావడంతో తమకు కాసుల పంట పండుతుందని రైతులు సంబరపడ్డారు. అయితే ధరలు మాత్రం చేదు అనుభవాల్ని మిగుల్చుతున్నాయి. మొదట్లో టన్ను కాయలు రూ.30 వేలు పలకడంతో ఈ ధర కనీసం రూ.50-60 వేల వరకు చేరుతుందని భావించారు. వారాల వ్యవధిలోనే సగానికి పడిపోవడంతోపాటు స్థానిక మార్కెట్లో కాయలను అడిగేవారు కరవయ్యారు. కొందరు తోటల వద్దకే వెళ్లి మంగు, మచ్చలున్న కాయలను కనిష్ఠంగా టన్ను కేవలం రూ.10 వేలకు కొంటున్నారు. మంచి రంగుతో నాణ్యమైన కాయలకు గరిష్ఠంగా రూ.20-25 వేలు చెల్లిస్తున్నారు. వీటిని తమిళనాడులోని ఆర్కాడు, రాణీపేట, చెన్నైతో పాటు బెంగళూరుకు తరలించి పచ్చళ్ల తయారీకి విక్రయిస్తున్నారు. రాష్ట్రంలోని కడప, నంద్యాల, ప్రొద్దుటూరు ప్రాంతాలకు సైతం తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ఆశించిన దాని కంటే అధికంగా పంట రావడం, నాణత లేకపోవడంతో ధరలు తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

# డ్రోన్ హబ్‌లో ఉపాధి రెక్కలు



కర్నూలు : ఓర్వకల్లులో ఏర్పాటుచేసే డ్రోన్ హబ్‌లో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులు ఆకర్షించేందుకు వీలుగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఓర్వకల్లు ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో అక్కడ అవసరమైన వసతులపై ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ విస్తృత చర్యలు ప్రారంభించింది. ఆ సంస్థ సీఎండీ దినేశ్‌కుమార్ శని, ఆదివారాల్లో జిల్లాలో పర్యటించారు. కొమరోలు, పాలకొలను గ్రామాలు డ్రోన్ హబ్ ఏర్పాటుకు అనువుగా ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ణయించారు. అతిత్వరలోనే స్థలాలను ఖరారు చేసి 300 ఎకరాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించనున్నారు. ఆయా సంస్థలను పెద్దఎత్తున ఆకర్షించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వమే రూ.15 కోట్లతో 'కామన్ యూజర్ ఫెసిలిటీ' కేంద్రాన్ని ఏర్పాటుచేయనుంది. ఫలితంగా ఆ కేంద్రంలోని అధునాతన యంత్రాలు, ఉపకరణాలతో డ్రోన్లకు అవసరమైన వివిధ రకాల పరీక్షలను అతితక్కువ ఖర్చుతో చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. ఆయా సంస్థల యాజమాన్యాలు పెట్టాల్సిన పెట్టుబడి ఇతర ప్రాంతాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుంది. ఫలితంగా దేశ, విదేశీ ప్రతినిధులు తమ సంస్థలను డ్రోన్ హబ్‌లో ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతారు. దీంతోపాటు అన్ని సంస్థలు ఒకేచోట ఉంటే అవి పోటీపడి మరీ పలురకాల డ్రోన్లు తయారుచేసేందుకు మార్గం సుగమమవుతుంది.

**ఫైబర్‌నెట్ సేవలు ఊపందుకొనేలా**

దినేశ్‌కుమార్ ఫైబర్‌నెట్ ఎండీగానూ ఉన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఫైబర్‌నెట్ సేవలు విస్తరించేలా కసరత్తు చేస్తున్నారు. ఫైబర్‌నెట్ కనెక్షన్‌తో అతి తక్కువ ధరకే అంతర్జాల సదుపాయం, ఫోన్, పలు టీవీ ఛానళ్లు వీక్షించే అవకాశమున్నా గత వైకాపా ప్రభుత్వం ఆయా సేవలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఉమ్మడి జిల్లాలో ఫైబర్‌నెట్ సేవలు ఏమాత్రం అభివృద్ధి చెందలేదు. పైపెచ్చు ఫైబర్‌నెట్ వినియోగదారులకు అవసరమైన సేవలు అందించకపోవడంతో పలువురు తమ కనెక్షన్లు రద్దు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఫైబర్‌నెట్ కనెక్షన్లు పెరిగేలా సెట్‌టాప్ బాక్సులను అందుబాటులో ఉంచనున్నారు.

**త్వరలో ఆర్‌టీజీఎస్ కేంద్రాలు**

రాష్ట్ర ప్రభుత్వం 'రియల్‌టైం గవర్నెన్స్ సొసైటీ' (ఆర్.టి.జి.ఎస్.)ని ఏర్పాటుచేసి దాని కార్యకలాపాలను అమరావతి నుంచి నిర్వహిస్తోంది. రానున్న రోజుల్లో ఆ సంస్థకు అనుబంధంగా జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాటుచేయనుంది. అందుకు అవసరమైన భవన నిర్మాణాలను కలెక్టరేట్ ప్రాంగణంలో గతంలోనే ప్రారంభించారు. ఆ పనులు పూర్తిచేసి జిల్లాలోనే ఆర్.టి.జి.ఎస్. సేవలు అందించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఆర్.టి.జి.ఎస్.కు ఉన్న పలు నిఘా కెమెరాల దృశ్యాలను జిల్లాలోనే చూసేందుకు.. విశ్లేషించేందుకు అవకాశం కలుగుతుంది. పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈ విభాగంలో విశ్లేషిస్తూ ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తుంటారు.

**300 ఎకరాల కేటాయింపు**తొలిదశలో మొత్తం 150 ఎకరాలను వివిధ సంస్థలకు కేటాయిస్తారు. మిగిలిన 150 ఎకరాల్లోనూ లేఅవుట్ వేసి భవిష్యత్తులో వచ్చే కొత్త సంస్థలకు కేటాయించేందుకు వీలుగా సిద్ధం చేస్తారు. డ్రోన్ హబ్‌ను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు వీలుగా ప్రత్యేకంగా బృహత్తర ప్రణాళికను రూపొందించనున్నారు. డ్రోన్ల వినియోగం పెరగాలంటే వాటిని ఉపయోగించే నైపుణ్యాలున్న మానవవనరుల అవసరం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని డ్రోన్ సేవలందించాలనుకునే వారిని సుశిక్షితులైన డ్రోన్ పైలెట్లుగా ప్రభుత్వమే తీర్చిదిద్దనుంది. ఎలాంటి డ్రోన్లనైనా ఆయా పైలెట్లు ఉపయోగించి ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తారు. ఆయా శిక్షణ కార్యక్రమాలను సైతం డ్రోన్ హబ్ ప్రాంతంలోనే నిర్వహించనున్నారు. డ్రోన్ హబ్‌లో సుమారు ఐదు వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి లభించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

# ఆశ్రమానికి భూ సంతర్పణ




కర్నూలు: శ్రీశైలంలో ఆశ్రమాల పేరుతో రూ.కోట్ల విలువైన భూమిని ఆలయ అధికారులు కొందరు ప్రైవేటు వ్యక్తులకు అడ్డగోలుగా ధారాదత్తం చేస్తున్నారు. ఆయా ఆశ్రమాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పి తూతూమంత్రంగా సాగిస్తున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో ఒక్క సెంటు భూమిని ఆశ్రమాలకైనా, సత్రాలకైనా, సంస్థలకైనా కేటాయించాలంటే రాష్ట్ర ప్రభుత్వ అనుమతి అవసరం. ఆ మేరకు స్పష్టమైన నిబంధనలున్నాయి. వాటితో ఏమాత్రం సంబంధం లేకుండా వైకాపా పాలనలో శ్రీశైలంలోని ఆలయ అధికారులు శివదత్త ఆశ్రమానికి 10 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఎలాంటి భూ కేటాయింపు ఉత్తర్వులు లేకుండా ఆ ఆశ్రమ నిర్వాహకులు భవనం సైతం నిర్మించారు. పూర్వ ఈవో లవన్న హయాంలో కళ్లెదుటే అక్రమ నిర్మాణం జరుగుతున్నా అప్పటి అధికారులు చోద్యం చూశారు. నిర్వాహకులకు కొందరు అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో కిందిస్థాయి అధికారులకు తెలిసినా ఏమీ తెలియనట్లు వ్యవహరించారు. దీంతో సుమారు రెండేళ్ల కిందటే ఆశ్రమ నిర్మాణం సైతం పూర్తయింది.

**ఆశ్రమ నిర్వాహకుడు ఎవరో?**

శివదత్త ఆశ్రమ నిర్వాహకుడు ఎవరన్న విషయం శ్రీశైలంలోని చాలామందికి తెలియదు. ఆ ఆశ్రమంలో ఆధ్యాత్మిక కార్యకలాపాలు జరుగుతున్న దాఖలాలు పెద్దగా లేవు. పి.విజయకుమార్ మీనన్ అనే వ్యక్తి ఆశ్రమ నిర్వాహకుడిగా ఉన్నట్లు చూపారు. ఆయనకు స్థలం కేటాయించేటప్పుడు గతంలో ఆ ఆశ్రమం నిర్వహించిన కార్యకలాపాలు ఏమిటి? ఎన్నేళ్ల నుంచి నిర్వహిస్తున్నారన్న వివరాలేవీ సేకరించలేదు. ఈ ఉదంతాల్లో రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు సమాచారం.

**పాతవాటికే మరోచోట స్థలం**

శివదత్త ఆశ్రమానికి సంబంధించిన ఓ భవనం గోశాల దగ్గర ఉండేది. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాస్తవానికి ఆ భూమిని కూడా అధికారికంగా ఆశ్రమానికి కేటాయించిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో దానికి ప్రత్యామ్నాయంగా మరోచోట భూమిని కేటాయించాల్సిన అవసరమే లేదు. ఆవిధంగా ప్రత్యామ్నాయ ప్రాంతంలో భూమిని అనధికారికంగా కేటాయించారు. దానికి సంబంధించిన దస్త్రాలూ లేవు.

**పూర్వ ఈవో అండదండలు**

పూర్వ ఈవో లవన్న సమయంలోనే అనధికారికంగా భూకేటాయింపు, భవన నిర్మాణం జరిగింది. దీంతోపాటు ఆశ్రమ నిర్వాహకుడు తన ఆశ్రమానికి కుళాయి కనెక్షన్ ఇప్పించాలని, పైపులైను వేయాలని.. అవసరమైన రుసుములను చెల్లిస్తానని రెండేళ్ల కిందట దరఖాస్తు చేసుకున్నారు. ఆయా సౌకర్యాలు కల్పించాలంటే నిబంధనల ప్రకారం భూకేటాయింపు ఉత్తర్వులను దరఖాస్తుతో జతచేయాలి. ఆ భూకేటాయింపు ఉత్తర్వులను ఆశ్రమ నిర్వాహకులు సమర్పించకపోవడంతో తాము పైపులైను వేయించలేమని వారికి తేల్చి చెప్పారు. తన కిందిస్థాయి అధికారులు నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తిస్తుంటే సమర్థించాల్సిన అప్పటి ఈవో వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆశ్రమానికి మంచినీటి వసతి కల్పించాలని ఆయన ఆదేశాలివ్వడం గమనార్హం.

**ఆలయ ఉద్యోగి కనుసన్నల్లోనే..**

శ్రీశైలం ఆలయంలోనే విధులు నిర్వరిస్తున్న ఓ ఉద్యోగి ఆ అనధికారిక భూకేటాయింపు వెనుక కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన ప్రోత్సాహంతోనే ఆశ్రమం పేరుతో అన్నిరకాల ఆలయ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా భూకేటాయింపు చేసినట్లు సమాచారం. ఈవోలు ఆ ఆశ్రమం జోలికి వెళ్లకుండా ఆయనే నియంత్రిస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. అనధికారికంగా చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటుచేయడానికి అనుమతులిచ్చారన్న ఆరోపణలతో కొద్దిరోజుల కిందటే ఓ అధికారిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఏకంగా రూ.లక్షల విలువైన స్థలాన్నే సొంతం చేసుకున్నవారిపైనా, వారికి సహకరించిన వారిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

# తియ్యగా మింగేస్తుంది

కర్నూలు : పంచలింగాలకు చెందిన నిర్మల (25) రెండేళ్ల కిందట గర్భిణిగా ఉన్న సమయంలో మధుమేహం బారిన పడ్డారు. ప్రస్తుతం టైప్-1 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. నియంత్రణలో లేకపోవడంతో కర్నూలు సర్వజన ఆస్పత్రిలోని ఎండోక్రైనాలజీ విభాగంలో చేరి చికిత్స తీసుకుంటున్నారు.

కర్నూలు కృష్ణానగర్‌కు చెందిన రవీంద్ర (35) మధుమేహం బారినపడి చికిత్స తీసుకుంటున్నారు. వేసవి సెలవుల్లో కాశీకి వెళ్లారు. మధుమేహం, రక్తపోటు పెరిగిపోయి కోమాలోకి వెళ్లారు. ఉత్తరప్రదేశ్ వద్ద మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయారు. అధిక ఒత్తిడి.. మధుమేహం, రక్తపోటు నియంత్రణ లేకపోవడంతో మందులు తీసుకుంటున్నా ప్రయోజనం లేకపోయింది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 10 నుంచి 12 శాతం మందికిపైగా జనం మధుమేహం బారిన పడ్డారు. వారిలో ప్రీడయా బెటిస్ ఉన్నవారు సుమారు 5.6 శాతం మంది ఉంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. దేశ జనాభాలో 11.1 శాతం మంది మధుమే హం కారణంగా గుండె, మూత్రపిండాల వ్యాధులబారిన పడిన చనిపోతున్నారు. ఎన్‌సీడీ 2.0 ప్రకారం కర్నూలు జిల్లా పరిధిలో 38,627 మంది మధుమేహం బారినట్లు తేలింది. ఇది లెక్క కేవలం 35 ఏళ్లు పైబడినవారు మాత్రమే. అందరికీ పరీక్షలు చేస్తే ఈ సంఖ్య మరింత పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

**ఏటా 25 వేల వరకు ఓపీ**

కర్నూలు సర్వజన ఆస్పత్రికి ఏటా 25 వేల వరకు ఓపీ ఉంటుంది. ప్రతి నెలా 2,500 వరకు ఓపీ ఉంటుండగా.. ఐపీ 60కిపైగా ఉంటుంది. బాధితులు ఆయా వార్డుల్లో చికిత్స పొందుతుంటారు. సర్వజన వైద్యశాలలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఓపీ ఉంటుంది. సూపర్ స్పెషాలిటీ విభాగంలో 5వ నంబరులో వైద్యులు చూస్తారు. ప్రతి నెలా సుమారు వెయ్యి మంది ఇన్సులిన్ తీసుకుంటారు.

రోగుల పరిస్థితి ఎక్కువగా ఉన్నా ఎండోక్రైనాలజీ విభాగం మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. సూపర్ స్పెషాలిటీ విభాగమైన న్యూరో ఫిజీషియన్ వార్డు ఇందులో కలిసి ఉండటం.. ప్రత్యేకంగా వార్డు లేకపోవడం.. ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ అసిస్టెంట్లు లేకపోవడం తదితర సమస్యల కారణంగా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదన్న విమర్శలున్నాయి. **నిత్యం పర్యవేక్షణ తప్పనిసరి**

డాక్టర్ శ్రీనివాసులు, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి


మధుమేహం బారినపడినవారు నిత్యం తమ పాదాలను చూసుకొంటూ ఉండాలి. దెబ్బతగిలినా.. ఏదైనా గుచ్చుకున్నా వారికి నొప్పి తెలియదు. ఫలితంగా ఇన్‌ఫెక్షన్ ఎక్కువై పాదం సైతం తీసేయాల్సి ఉంటుంది. నిత్యం కాళ్లకు కొబ్బరి నూనె రాస్తూ ఉండాలి. గాయాలను గుర్తించి వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

బూట్లు వేసుకున్నప్పుడు తప్పనిసరిగా సాక్స్ ధరించాలి. లేకుంటే చర్మం దెబ్బతిని ఇన్‌ఫెక్షన్‌కు గురై బొబ్బలు వచ్చే ప్రమాదముంది. ప్రధానంగా ఒత్తిడి, జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, కుటుంబ నేపథ్యం తదితర కారణాలతో మధుమేహం బారినపడేవారి సంఖ్య ఎక్కువ. మధుమేహం నియంత్రణలో లేకుంటే గుండె, మూత్రపిండాలు, కంటి సమస్యలు వస్తాయి. దీనిబారిన పడినవారు వారంలో కనీసం ఐదు రోజుల్లో ఒక గంట నడక సాగించాలి. వీలైనంతవరకు అన్నం తీసుకోవడం తగ్గించాలి. నెలకు ఒకసారి మధుమేహం పరీక్ష చేయించుకోవాలి.

# ఆరోగ్య సర్వే

నంద్యాల : 1: 50 ఏళ్ల మహిళ రొమ్ముపై గడ్డలొచ్చాయని, ఎలాంటి నొప్పి లేదని నంద్యాల సర్వజన ఆసుపత్రికి వచ్చారు. వాటిని పరిశీలించిన వైద్యులు రొమ్ము క్యాన్సర్ అని నిర్ధారించారు. కర్నూలుకు వెళ్లి వారు మెరుగైన చికిత్స చేయించుకోవడంతో ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారు. 2: 45 ఏళ్ల మహిళలకు నెలసరి సరిగా రాకపోవడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ స్క్రీనింగ్ పరీక్షలు చేయగా క్యాన్సర్ అని తేలింది. దీంతో వైద్యులను సంప్రదించి మందులు వాడుతున్నారు.

మారిన జీవనశైలి.. ఆహార అలవాట్ల వల్ల చాలామంది ప్రజలు రోగాల బారినపడుతున్నారు. ఆరోగ్యం పట్ల అవగాహన లేక.. సకాలంలో అనారోగ్య సమస్యల్ని గుర్తించలేకపోతున్నారు. వ్యాధి ముదిరాక ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం గతంలో టీబీ, కుష్ఠు వ్యాధుల గుర్తింపునకు మాత్రమే ఇంటింటి సర్వే చేపట్టేది. ప్రస్తుతం క్యాన్సర్, బ్రెయిన్ స్ట్రోక్, గుండె జబ్బులు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్థుల సంఖ్య క్రమంగా




పెరుగుతోంది. వాటిని గుర్తించేలోపే ప్రాణాల మీదకు తెస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య స్థితి ఎలా ఉందో తెలుసుకోవడానికి కూటమి ప్రభుత్వం ఎన్‌సీడీ 3.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈనెల 14 నుంచి ఇంటింటి సర్వే చేపట్టనున్నారు.

**తొలిసారిగా క్యాన్సర్ స్క్రీనింగ్**

చాలామంది మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్న నేపథ్యంలో 3.0 ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా తొలిసారిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు. 30 ఏళ్లు దాటిన మహిళలకు క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయో లేవో తెలుసుకోనున్నారు. నోటి, గర్భాశయ ముఖద్వారం, రొమ్ము క్యాన్సర్లను గుర్తించి వారి లక్షణాలను మెడికల్ ఆఫీసర్లకు తెలియజేస్తారు. వారు సర్వజన ఆస్పత్రిలో నిపుణుల పర్యవేక్షణలో వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స అందించనున్నారు. క్యాన్సర్‌తో పాటు బీపీ, చక్కెర వ్యాధి, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు కూడా ఇంటి దగ్గరే చేయనున్నారు.

**18 ఏళ్లు నిండిన వారిపై దృష్టి**

సంక్రమిత, అసంక్రమిత (ఎన్‌సీడీ) వ్యాధుల సర్వే 3.0 ద్వారా 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరి ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేసి అంచనా వేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందు కోసం ఇప్పటికే వైద్యాధికారులు మూడు రోజుల పాటు ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, మెడికల్ ఆఫీసర్లకు, ఆశా వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. వారు ఈనెల 14వ తేదీ నుంచి ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. గ్రామాల్లో రోజుకు 15 నుంచి 20 ఇళ్ల వరకు సర్వే చేయనున్నారు.

**సిబ్బందికి శిక్షణ.. పరికరాలు**

ఇంటింటి సర్వే చేయడానికి వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. బీపీ పరీక్ష పరికరం, మధుమేహ వ్యాధిని గుర్తించడానికి గ్లూకోమీటరు, రక్తహీనతను గుర్తించేందుకు హిమోగ్లోబిన్ మీటర్‌తో పాటు గర్భాశయ ముఖద్వార పరీక్షలు చేయడానికి గైనిక్ పరికరాలు కూడా వారికి అందజేశారు. సర్వే ఆరు నెలలకు పైగా కొనసాగే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

**సర్వే పకడ్బందీగా చేస్తాం- డా.వెంకటరమణ, డీఎంహెచ్‌వో, నంద్యాల**

గతంలో ఎన్‌సీడీ 2.0 పేరుతో ఇంటింటి సర్వే చేపట్టాం. ప్రస్తుతం తొలిసారి క్యాన్సర్ వ్యాధిపై కూడా సర్వే చేస్తున్నాం. క్యాన్సర్ లక్షణాలను గుర్తించడానికి మూడు రోజుల పాటు సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. రోగుల వ్యాధులను గుర్తించడంతో పాటు అవగాహన కూడా కల్పిస్తున్నాం. సర్వే పకడ్బందీగా చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం.

# దిగువన తడారిన పంటలు

ఎమ్మిగనూరు “ దిగువ కాల్వ పరిధిలో రెండెకరాల ఆయకట్టు ఉంది.. మూడేళ్లకు కలిపి నీటి తీరువా పన్ను రూ.800 చెల్లిస్తున్నా. ఎనిమిదేళ్ల కిందట రెండు పంటలు పండేవి.. నీళ్లు సమృద్ధిగా అందడంతో ఎకరానికి 40 సంచుల ధాన్యం వచ్చేది.. ప్రస్తుతం నీరు సరిగా అందడం లేదు. ఎనిమిదేళ్లగా వర్షాధారంగానే పంటలు సాగు చేస్తున్నా. వరి సాగు మరిచిపోయాం.. పొలం ఉండి కూడా బియ్యం కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని” శ్రీనివాసులు ఆవేదన వ్యక్తంచేశారు. పశ్చిమప్రాంత జీవనాడి తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టు రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఎగువన భారీగా జలచౌర్యం జరుగుతుండటంతో చి'వరి'ఆయకట్టు బీళ్లుగా మారింది. ఈ కాల్వ ద్వారా ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందించాలి. కాల్వ 1- 250 కి.మీ వరకు కర్ణాటక, 251 కి.మీ నుంచి 350 కి.మీ వరకు ఏపీ పరిధిలో ఉంది. నిత్యం 750 క్యూసెక్కులు విడుదల చేయాలి. ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి 1.52 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలి. మొత్తం 24 టీఎంసీలు ఎగువ నుంచి రావాల్సి ఉంది. నీటి వాటా సరిగా రాక చివరి ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ఏనాడూ పట్టించుకోలేదు. ప్రభుత్వమైన దృష్టి సారించాలని రైతులు విన్నవిస్తున్నారు.

**అక్రమంగా మళ్లించుకొంటున్నారు**ఎగువ ప్రాంతంలో కొందరు పైపులైన్ వేసి మళ్లించుకొంటున్నారు. ఏటా 4 నుంచి 6 టీఎంసీల నీటిని చౌర్యం చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి మోకా వరకు 55 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కాల్వ పొడవునా మోటార్లు పెట్టి నీటిని కి.మీ మేర తీసుకెళ్తున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదు. నిబంధనల మేరకే దిగువకు విడుదల చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. మధ్యలో జరుగుతున్న జలచౌర్యాన్ని అడ్డుకోలేకపో తున్నారు.

**రూ.200 కోట్ల పెట్టుబడులు**ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి రైతులు ఎకరానికి రూ.30 వేలు- రూ.40 వేలు, మిరప రైతులు రూ.1.20 లక్షలు- రూ.1.80 లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. పత్తి 14 వేల ఎకరాలు, మిరప 16 వేల ఎకరాలు, ఇతర పంటలు 45 వేల ఎకరాల వరకు సాగు చేశారు. ఆయా పంటలకు సుమారు రూ.200 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టారు. ఎమ్మిగనూరు సబ్‌డివిజన్‌కు 400 క్యూసెక్కులకు సగం కూడా రావడం లేదు.

# ఖజానాకు చేరని సమాచారం.. అందని వేతనం

కర్నూలు : జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ అధికారులు, ఉద్యోగులకు ఇప్పటివరకు జీతాలు అందలేదు. అక్టోబరు నెలకు సంబంధించిన జీతాలు 12 రోజులు గడిచినా ఈ నెలలో వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కాలేదు. ఈ నేపథ్యంలో వేతనాలు ఎప్పుడు అందుతాయా అని రాష్ట్రవ్యాప్తంగా ఆ శాఖ అధికారులు, ఉద్యోగులందరూ ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను రద్దు చేసి మద్య నిషేధ, ఆబ్కారీ శాఖలో విలీనం చేసిన సంగతి విదితమే. ఈ ఏడాది సెప్టెంబరు నెలలో శాఖను పునర్‌వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సెబ్ స్టేషన్లు తిరిగి మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ స్టేషన్లుగా మారాయి.

**అసలు సమస్య ఎక్కడ..**

పరిపాలన, పునర్‌వ్యవస్థీకరణకు సంబంధించిన వివరాలను ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఖజానా శాఖకు పంపనట్లు తెలిసింది. ఫలితంగా సమస్యలు ఎదురవుతున్నాయి. అసలు ఎందుకు జాప్యం జరుగుతోంది.. సమస్య ఎక్కడుంది.. తదితర వివరాలను రాష్ట్ర కార్యాలయానికి ఫోన్ చేసి తెలుసుకునేవారే కరవయ్యారు. ఈ నేపథ్యంలో అక్టోబరు నెలకు సంబంధించిన జీతాలు మంజూరు కాలేదు. అసలు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి.



ఉమ్మడి జిల్లాలో ఒక డిప్యూటీ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అసిస్టెంట్ కమిషనర్, ఇద్దరు ఐఎంఎల్ డిపో మేనేజర్లు, ఇద్దరు పర్యవేక్షణాధికారులు, ముగ్గురు సహాయ పర్యవేక్షణాధికారులు, 27 మంది సీఐలు, 39 మంది ఎస్సైలు, 68 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 136 మంది కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. వీరు వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

**రుణాలు చెల్లించలేక..**

చాలామంది ఉద్యోగులు అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు. మరికొందరు రుణాలు తీసుకుని గృహాలు నిర్మించుకున్నారు. ఇంకొందరు వివిధ అవసరాల నిమిత్తం రుణాలు తీసుకున్నారు. వీరందరూ సకాలంలో ఈఎంఐలు చెల్లించాల్సి ఉంది. నవంబరు 12వ తేదీ వచ్చినా ఇప్పటివరకు జీతాలు పడకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఈఎంఐలు కట్టకుంటే సమస్యలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇంటి అవసరాలకు డబ్బులు లేక పలువురు అప్పులు చేస్తున్నారు. అసలు జీతం ఎప్పటికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు చొరవ తీసుకుని జీతాలు త్వరితగతిన మంజూరు చేయించాల్సి ఉంది.

# సైబర్ కేటుగాళ్లు

డోన్ : సైబర్ నేరగాళ్ల మాట నమ్మి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మోసపోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు వెల్లడించారు. శ్రీరామనగర్‌కు చెందిన కృష్ణమూర్తి, శిరీష ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. శిరీష వర్క్‌ఫ్రం హోమ్ చేస్తుండటంతో సైబర్‌నేరగాళ్లు ఆమెకు ఫోన్ చేసి తాము ముంబయ్ నుంచి మాట్లాడుతున్నామని, ఫెడెక్స్ కొరియర్‌లో మీ పేరిట వచ్చిన పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని, మీ ఆధార్‌కార్డు ఉందని, ఇక్కడికి మీరు వేగంగా రావాలని, లేదంటే కేసు నమోదవుతుందని భయపెట్టారు. తాము అంత దూరం రాలేనమనడంతో...మీకు లింక్ పంపిస్తున్నామని, వీడియోకాల్ చేయాలని చెప్పడంతో ఆమె చేశారు. మీ పేరిట 8 అకౌంట్లు వివిధ



రాష్ట్రాల్లో ఉన్నాయని, మీ అకౌంట్‌కు బ్లాక్ అమౌంట్ వచ్చిందని, ఏ అకౌంట్లలో ఎంత బదిలీ అయిందో తెలుసుకోవాలంటే కొంత నగదు అన్ని ఖాతాల్లో వేసి పరిశీలించాలన్నారు. ఐసీఐసీఐలో ఉన్న పర్సనల్ లోన్ అమౌంట్ రూ.2.50 లక్షలతో పాటు పర్సనల్ అకౌంట్‌లో ఉన్న రూ.1.10 లక్షలు మొత్తం రూ.3.60 లక్షలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో ఆమె బ్యాంకుకు వెళ్లి ఆరా తీశారు. మోసపోయామని గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రైతు మురి'సెనగ'

ఆళ్లగడ్డ : జిల్లాలో రైతులు ఈ ఏడాది సెనగ వైపు దృష్టి సారించారు. ఎస్సార్బీసీ, కేసీ, తెలుగుగంగ కాల్వలతో పాటు కుందూలోనూ నీటి ప్రవాహం ఉండటంతో తడుల్ని అందించుకోవచ్చన్న ఆశతో రైతులు పంట సాగుకు ముందుకొస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 17,795 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచగా, 12,929 మంది రైతులు 12,732 క్వింటాళ్ల విత్తనాలు కొనుగోలు చేసి సాగుకు సిద్ధమయ్యారు. ఆళ్లగడ్డ, బనగానపల్లి, డోన్ నియోజకవర్గాల పరిధిలో కొలిమిగుండ్ల, సంజామల, బనగానపల్లి, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఆళ్లగడ్డ, డోన్ మండలాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. అనువైన నల్లరేగడి పొలాలు ఉండటంతో రైతులు మొగ్గు చూపారు. వర్షాధార పంట కావడం, వాతావరణంతో పాటు, ఇతర పరిస్థితులు అనుకూలించడం, తక్కువ పెట్టుబడి, తక్కువ పంట కాలంలోనే చక్కటి లాభాలు గడించవచ్చన్న ఆశతో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురవడం, మరీ ముఖ్యంగా అక్టోబరులో కురిసిన వర్షాలతో సెనగ విత్తుకు పొలాలు అనువుగా మారాయి. గత ఏడాది సాధారణం కంటే తక్కువగా సాగు చేయగా ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువగా సాగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

# ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం బిల్లులకు మోక్షం



పుట్టపర్తి : పేదల సొంతింటి కల నెరవేర్చే ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది. ఆ పథకం లబ్ధిదారులు అప్పులు చేసి చేపట్టిన ఇంటి నిర్మాణం బిల్లులను మంజూరు చేయకుండా ఐదేళ్లూ ఇబ్బంది పెట్టింది. తెచ్చుకున్న అప్పులకు వడ్డీల కట్టలేకున్నామని.. బిల్లులు మంజూరు చేసి తమను ఆదుకోవాలని లబ్ధిదారులు కలెక్టరేట్, గృహనిర్మాణ శాఖ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షిణలు చేసినా కనికరం చూపలేదు. అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులందరికీ బకాయి పడిన బిల్లులు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వారి కోసం అప్పటి తెదేపా ప్రభుత్వం 2014 – 2019 మధ్య ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకాన్ని ప్రారంభించింది. జిల్లాలో వేలాది ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు, ఎస్సీ, ఎస్టీ అబ్ధిదారులకు రూ.2.50 లక్షల చొప్పున యూనిట్ విలువగా నిర్ణయించింది. సగానికిపైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇంటి నిర్మాణం పూర్తయ్యే నాటికి నాలుగు దశల్లో బిల్లులు చెల్లించారు. నిర్మాణ దశల వారీగా బిల్లులు అప్‌లోడ్ చేసినప్పటికీ 2019 సార్వత్రిక ఎన్నికల ప్రకటన రావడంతో బిల్లులు నిలిపి వేశారు. జిల్లా వ్యాప్తంగా 27,720 ఇళ్ల నిర్మాణ బిల్లులు రూ.32.03 కోట్లు లబ్ధిదారులకు చెల్లించాల్సి ఉండగా, వైకాపా అధికారంలోకి రావడంతో నయాపైసా చెల్లించలేదు. బిల్లులు మంజూరుకాక లబ్ధిదారులు విసిగిపోయారు. అప్పు చేసి ఇంటి నిర్మాణం చేపట్టలేక చాలా మంది ఎక్కడికి అక్కడే పనులు నిలిపివేశారు.

**యాప్‌లో వివరాల నమోదు..**


ఆ పథకం లబ్ధిదారులకు బిల్లులుగా చెల్లించాలని తాజాగా ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆనందం వ్యక్తమవుతోంది. నెల రోజులుగా గృహనిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇళ్ల పరిస్థితిపై సర్వే చేశారు. ప్రస్తుతం ఇళ్లు ఏ దశలో ఉన్నాయో తెలుసుకుని యాప్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించారు. త్వరలో లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయనున్నారు. పునాది దశలో ఉన్న వారికి పీఎంఏవై 2.0లో అనుమతి ఇచ్చి పూర్తి చేయించాలని నిర్ణయించారు.

**ఏడేళ్లుగా ఎదురుచూపు - వెంకటలక్ష్మమ్మ, కంచనగారిపల్లి**

తెదేపా ప్రభుత్వ హయాంలో పక్కా గృహం మంజూరైంది. నిర్మాణం చేపట్టాం. ఇందుకు గాను 30 బస్తాల సిమెంటు, రూ.25 వేలు బిల్లు ఇచ్చారు. ఇంకా రావాల్సిన బిల్లు కోసం ఏడేళ్లుగా ఎదురు చూస్తున్నాం. సుమారు రూ.70 వేలు బిల్లు పెండింగ్‌లో ఉంది. చేసిన అప్పునకు వడ్డీలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాం. ప్రస్తుతం ప్రభుత్వం బిల్లులు ఇస్తామని చెబుతోంది. ఇప్పుడైనా బిల్లు వస్తే కొంత భారం తగ్గుతుందని ఆశిస్తున్నాం.ప్రభుత్వానికి నివేదిక పంపాం – వెంకటనారాయణ, గృహ నిర్మాణశాఖ అధికారి, శ్రీసత్యసాయి జిల్లా

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు ఏఏ దశల్లో ఉన్నాయి. ఎంత బిల్లు మంజూరు చేశారు. తదితర వివరాలను యాప్‌లో నమోదు చేశాం. త్వరలో ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే బిల్లులు మంజూరు చేస్తాం.

# ఆనంద తీరాలు.. మత్స్యకారులకు ప్రోత్సాహకాలు



అనంతపురం : చతికల బడిన మత్స్యశాఖకు కూటమి ప్రభుత్వం జవసత్వాలను అందించేందుకు సమాయత్తం అవుతోంది. ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వ హయాంలో నిధులు ఇవ్వకుండా, అరకొర రాయితీలు ఇచ్చారు. ఆరంగాన్ని నమ్ముకున్న వారిలో నిరాశ, నిస్పృహ ఆవహించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాలో చేపల పెంపకానికి పూర్వవైభవానికి అడుగులు పడ్డాయి. బడ్జెట్‌లో మత్స్యశాఖకు నిధులు కేటాయించడం, ఈ ఏడాది చెరువులు, ప్రాజెక్టులకు నీరు రావడం శుభపరిణామం. మత్స్యకారులు, అధికారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం చేపల పిల్లల పెంపకం, చేపలు సరఫరా లక్ష్యాలతోపాటు పలు పథకాల అమలుకు 75 శాతం రాయితీ ప్రకటించారు. లైసెన్సు ఉన్న ప్రాజెక్టుల్లో మత్స్యశాఖ అధికారులే చేపల వదులుతారు. చెరువుల్లో చేపల పెంపకాన్ని సొసైటీలు 60 శాతం, మత్స్యశాఖ 40శాతం చొప్పున భరిస్తారు. జిల్లాలో చేపల పెంపకానికి అధికారులు సన్నాహాలు ప్రారంభించారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి**

జిల్లాలో చేపల పెంపకానికి ఐదు లైసెన్సుడ్ ప్రాజెక్టులు, 99 చెరువులు ఉన్నాయి. అందులో బైరవానితిప్ప, జీడిపల్లి, ఎంపీఆర్, పీఏబీఆర్, చాగళ్లు లైసెన్సు ఉన్న రిజర్వాయర్లు. చాగళ్లు, పీఏబీఆర్, జీడిపల్లి ప్రాజెక్టులు లీజుకిస్తారు. ఎంపీఆర్, బీటీపీ ప్రాజెక్టులు లైసెన్సులిచ్చి చేపల పెంపకం చేపడుతారు. జిల్లాలో మొత్తం 251.50 లక్షల చేపలను పెంచి 9 వేల టన్నులు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. చేప పిల్లల పెంపకం 61.25 లక్షల లక్ష్యంగా కాగా, అందులో 36.75 లక్షలు లైసెన్సు ప్రాజెక్టుల్లో వదులుతారు. బీటీపీకీ 6.48 లక్షలు, ఎంపీఆర్‌కు 8.23 లక్షల చేప పిల్లలను ఉచితంగా సరఫరా చేస్తారు. బయట నుంచి 21.50 లక్షల చేప పిల్లలను కొనుగోలు చేసి ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద హెక్టారుకు 1000 చొప్పున చెరువులకు చేప పిల్లలను రాయితీతో పంపిణీ చేస్తారు.

పీఎంఎంఎస్‌వై పథకం కింద బోట్లు వలలు 75 శాతం రాయితీతో మత్స్యకారులకు పంపిణీ చేస్తారు. 90 మందికి బోట్లు, 90 మందికి వలలు రాయితీతో అందిస్తారు.

బోటు పూర్తి ధర రూ.30 వేలు కాగా అందులో 22,500 రాయితీ పోను, మిగిలింది రూ.7,500 మత్స్యకారుల వాటా కింద చెల్లించాలి. వలలు పూర్తి ధర రూ.30 వేల కాగా అందులో 22,500 రాయితీ పోను మిగిలింది రూ.7,500 మత్స్యకారులు కట్టుకోవాల్సి ఉంది. జిల్లాలో 50 ఏళ్లు దాటిన 837 మంది మత్స్యకారులకు నెలకు 4 వేలు చొప్పున ప్రభుత్వం పింఛన్ పంపిణీ చేస్తుంది.

**బడ్జెట్‌లోనిధులు**

– అంకె పోతన్న, పూర్వపు అధ్యక్షుడు (మత్స్య సహకార సంఘం)

జిల్లాలో 50 శాతం హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులకు నీరిచ్చారు. 60 శాతం వర్షంపునీరు చెరువులకు చేరింది. ప్రాజెక్టులకు, చెరువులకు చేప పిల్లలు ఉచితంగా పంపిణీ చేయాలి. 2014–19లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మత్స్యకారులను గుర్తించి పరికరాలు అందించారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. రాయితీ పథకాలు మళ్లీ పునరుద్ధరించి, అర్హులైన మత్స్యకారులకు పనిముట్లు అందించి ఆదుకోవాలి. చేప పిల్లలను ప్రాజెక్టులకు, చెరువులకు ఉచితంగా పంపిణీ చేయాలి.

**పంపిణీకి సన్నద్ధం**

– శ్రీనివాసనాయక్, ఉప సంచాలకులు (మత్స్యశాఖ)

ఏటా నవంబరు నెలలో చేప పిల్లల పంపిణీ జరుగుతుంది. సుమారు అన్ని చెరువులకు నీరు చేరింది. ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. 61.25 లక్షల చేప పిల్లలు సిద్ధంగా ఉన్నాయి. అందులో ఐదు లైసెన్సు ఉన్న ప్రాజెక్టులకు 36.75 లక్షలు చేప పిల్లలు వదులుతాం. పీఎంఎంఎస్‌వై కింద హెక్టారుకు 1000 చొప్పున చేప పిల్లలను సొసైటీలకు రాయితీతో పంపిణీ చేస్తాం. ఈ పథకం కింద బోట్లు, వలలు మంజూరయ్యాయి. అర్హులైన వారికి 75 శాతం రాయితీతో పంపిణీ చేస్తాం. జిల్లాలో 50 ఏళ్లు దాటిన మత్స్యకారులు ఎవరైన ఉంటే ప్రభుత్వ పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి. అర్హులైన వారికి కచ్చితంగా పింఛన్ మంజూరు చేయడం జరుగుతుంది.

| | |
|---|---|
| అంశం | : చేపల పెంపకం |
| చెరువులు | : 99 |
| ప్రాజెక్టులు | : 05 |
| సొసైటీలు | : 54 |
| మత్స్యకారులు | : 4,330 మంది |
| చేపపిల్లలు | : 251 లక్షలు |
| ఏటా చేపల ఉత్పత్తి | : 9 వేల టన్నులు |

# ఆన్‌లైన్ వేదికగా.. ఆర్థికాభివృద్ధి దిశగా

చిత్తూరు : డ్వాక్రా మహిళలు తయారు చేసే వివిధ వస్తువులకు డిజిటల్ మార్కెటింగ్ చేయించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తరహాలో ప్రత్యేక యాప్ రూపొందించి విక్రయాలు పెంచుకోవడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ప్రణాళికలు రూపొందించింది. మహిళల ఆదాయ వనరుల పెంపుతోపాటు వారి ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పిస్తున్నారు.

మెప్మా ద్వారా పట్టణ ప్రాంతాల్లోని డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాల మంజూరుతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. చేతివృత్తులు, చేనేత వస్త్రాలు, ఆహార ఉత్పత్తులతో మహిళలు ఇప్పటికే వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వీటికి సరైన ప్రచారం, ధర, మార్కెటింగ్ ఉండటం లేదు. ఈ అంశాలను గుర్తించిన మెప్మా డ్వాక్రా మహిళల ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా విక్రయించాలని ప్రణాళిక రచించింది. నాణ్యత, నమ్మకమే పెట్టుబడిగా డ్వాక్రా ఉత్పత్తులను అందంగా ప్యాకింగ్ చేసి మార్కెటింగ్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్ యాప్‌ను అందుబాటులో తెచ్చారు.

**మార్కెటింగ్ ఇలా..**

ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫాంపై సరికొత్త యాప్‌ను రూపొందించారు. ప్లే స్టోర్‌లో 'మైస్టోర్' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే ఉచితంగా కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించవచ్చు. వస్తువుల్ని బుక్ చేసుకున్న 7 రోజుల్లోపు కొనుగోలుదారులకు డోర్ డెలివరీ చేస్తున్నారు. ఇతర ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌లలో 30–40 శాతం వరకు విక్రయాలకు కమీషన్ తీసుకుంటుండగా.. మైస్టోర్ యాప్‌లో కేవలం 6 శాతం మాత్రమే కమీషన్ తీసుకుంటున్నారు. బుక్ చేసుకున్న కొనుగోలుదారులు చెల్లించే నగదును నేరుగా డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాలో జమ చేసేలా ఏర్పాట్లు చేశారు. చిత్తూరు జిల్లాలో దాదాపు 156, తిరుపతి జిల్లాలో 196 రకాల వస్తువులు అందుబాటులో ఉండగా.. మరో 121 రకాల వస్తువుల్ని పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 237 మంది తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేశారు. అధికంగా పలమనేరులోని టెర్రకోట బొమ్మలకు ఎక్కువ ఆర్డర్లు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో రూ.29,100 వ్యాపారం కూడా జరిగింది.

చర్యలు చేపట్టాం.. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే మెప్మా ధ్యేయం. వారి వ్యాపారాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాం. రాధమ్మ, మెప్మా పీడీ, ఉమ్మడి జిల్లా

# చదువుల గుడి.. పెరటి బడి

కదిరి : ఇకపై శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పండించిన తాజా కాయగూరలతో వండిన కూరలనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డించనున్నారు. ఇందుకోసం పాఠశాల ఆవరణలో పెరటితోట సాగుచేస్తున్నారు. పీఎం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సేంద్రియ పద్ధతిలో కాయగూరల పంటలు పండిస్తున్నారు. జిల్లాలో మొత్తం 130 ప్రభుత్వ పాఠశాలల్లో 'న్యూట్రిషన్ గార్డెన్' ఏర్పాటు చేశారు. విద్యార్థులు మంచి ఆహారం అందించడంతోపాటు పర్యావరణ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

**14 రకాల పంటల సాగు..**

అనువైన స్థలం, నీటి సౌకర్యం, ప్రహరీ ఇలా అన్ని వసతులున్న పాఠశాలలను ఎంపిక చేశారు. బీర, చిక్కుడు, దోస, కాకర, టమాటా, వంగ, బెండ, కాలిఫ్లవర్, ముల్లంగి, మునగ, కరివేపాకు, పచ్చిమిర్చి,



అలసంద, గోరుచిక్కుడుతోపాటు అన్ని రకాల ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా.. సేంద్రియ పద్ధతిలో పండించిన కాయగూరలతో వండి పెట్టడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని భావించి సర్వశిక్షా అభియాన్ ద్వారా నిధులు కేటాయించి ఆయా పాఠశాలలకు విత్తనాలు సరఫరా చేశారు.

**తెగుళ్ల నివారణపై ప్రత్యేక దృష్టి**

న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటుకు అనువైన స్థలం,పెరటితోటలు పెంచుతున్నాం వసతులున్న పాఠశాలలను ఎంపిక చేసి పెరటి తోటలు పెంచుతున్నాం. విద్యార్థులే స్వయంగా పండించిన ఆకుకూరలు, కూరగాయాలు మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తున్నారు. స్థలం తక్కువగా ఉండటంతో అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు వీలుకాలేదు. న్యూట్రిషన్ గార్డెన్ మంచి ఫలితాలు సాధిస్తుండటంతో త్వరలోనే అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.– రామకృష్ణ, ఏడీ, డీఈఓ కార్యాలయం

# కుటుంబాల లెక్క తప్పింది

కర్నూలు : "పల్లె, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటిని మ్యాపింగ్ (జియో ట్యాగింగ్) చేయాలని జీఎస్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.శివప్రసాద్ ఈనెల మొదటి వారంలో ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 15వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో పరిశీలిస్తే కుటుంబ మ్యాపింగ్ సర్వే నత్తనడకన సాగుతోంది.. సచివాలయ ఉద్యోగులు కొందరు సర్వేకు దూరం ఉండగా.. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలున్నాయి." ఉమ్మడి జిల్లాలో 30 శాతం సర్వే పూర్తైంది. పంచాయతీలు, పురపాలక, నగరపాలకల్లో 13.33 లక్షల కుటుంబాలు ఉంటున్నాయి. గత వారం రోజుల్లో కర్నూలు జిల్లాలో 1.84 లక్షల కుటుంబాలు, నంద్యాల జిల్లాలో 2.20 లక్షల కుటుంబాలు కలిపి 4.05 లక్షల కుటుంబాలను సర్వే చేశారు. ఒక్కో క్లస్టర్ పరిధిలో 10–20 కుటుంబాలు కనిపించడం లేదు. వారు స్థానికంగా లేకపోయినా గతంలో వాలంటీర్లు ఇక్కడ ఉన్నట్లు మ్యాపింగ్ చేశారు.

**సచివాలయ ఉద్యోగుల అలసత్వం**

ఉమ్మడి జిల్లాలో 1,188 గ్రామ, వార్డు సచివాలయాలుండగా ప్రస్తుతం 9,798 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో చాలామంది సచివాలయ ఉద్యోగులు సర్వే చేయకుండా తప్పించుకుంటున్నారు. కల్లూరు అర్బన్ వీకర్ సెక్షన్ కాలనీ పరిధిలో ఇద్దరు సచివాలయ సిబ్బంది గ్రూప్–2 పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకుగాను సెలవులో వెళ్లారు. వారి పరిధిలోని క్లస్టర్లలో కుటుంబాల సర్వే ఇతర సిబ్బందికి భారంగా మారింది. మరికొందరు తమకు ఆరోగ్యం బాగాలేదని.. డీఎస్సీకి సిద్ధమవుతున్నామని.. ఉన్నత కొలువుల కోసం శిక్షణ తీసుకుంటున్నామని.. ఇలా పలు కారణాలతో సెలవు పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యి నుంచి 1,500 మంది సచివాలయ ఉద్యోగులు సెలవుల్లో ఉంటూ కుటుంబ సర్వే చేయడం లేదన్న ఆరోపణలున్నాయి.

**సాంకేతిక సమస్యలు**

సాంకేతికపరంగా నవీకరించిన యాప్ ద్వారా సచివాలయ సిబ్బంది తమ చరవాణిలో కుటుంబ వివరాలు నమోదు చేస్తున్నారు. క్లస్టరు వారీగా వివరాలు సేకరించి చిత్రం తీసి నమోదు చేయాల్సి ఉంది. ఆ తర్వాత కుటుంబసభ్యుల్లో ఒకరి నుంచి ధ్రువీకరణ కోసం వేలిముద్రలను అనుసంధానం చేయాలని ఆదేశాలు వచ్చాయి. బయోమెట్రిక్ తీసుకొనేందుకు కొన్నిచోట్ల డివైజ్‌లు పనిచేయడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సమస్య వేధిస్తోంది. సచివాలయాల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవడంతో మ్యాపింగ్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. మరోవైపు క్షేత్రస్థాయిలో త్వరగా పూర్తి చేయాలని ఉన్నత స్థాయి నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. ఎంపీడీవోలు, పురపాలక, నగరపాలక కమిషనర్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. కానీ వారు సరిగా దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి.

**20 శాతం మంది జాడ లేదు**

గతంలో వైకాపా పాలనలో వాలంటీర్లు కుటుంబ మ్యాపింగ్ సర్వే చేశారు. అప్పట్లో చేసిన సర్వేకు.. ప్రస్తుతం చేస్తున్న కుటుంబ సర్వేకు మధ్య తేడా ఉంది. గతంలో స్థానికంగా కుటుంబాలు లేకపోయినా వాలంటీర్లు ఉన్నట్లు కుటుంబ మ్యాపింగ్ చేశారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులు చేస్తున్న సర్వేలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. కర్నూలు నగరపాలక సంస్థతోపాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు పురపాలక సంఘాల పరిధిలో సుమారు 15–20 వేల కుటుంబాలు కనిపించడం లేదని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. స్థానికంగా లేని కుటుంబాలను షిఫ్టింగ్ చేసేందుకు యాప్‌లో ఆప్షన్ లేకపోవడంతో మ్యాపింగ్‌ను పక్కన పెట్టేస్తున్నారు.

## చీరకట్టులో బాపుబొమ్మలా కావ్య థాపర్

టాలీవుడ్ లో కమర్షియల్ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తోన్న ముద్దుగుమ్మ కావ్య థాపర్. రీసెంట్ గా ఈ బ్యూటీ గోపీచంద్ 'విశ్వం' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అయితే కావ్య థాపర్ కి టైం సరిగా కలిసి రావడం లేదని చెప్పొచ్చు. అందుకే స్టార్ హీరోలతో మూవీస్ చేస్తోన్న బ్యాక్ టూ బ్యాక్ డిజాస్టర్స్ అందుకుంటుంది. కావ్య థాపర్ హీరోయిన్ గా నటించిన 'ఈగల్', 'ఊరు పేరు భైరవకోన', 'డబుల్ ఇస్మార్ట్', 'విశ్వం' ఈ ఏడాది రిలీజ్ అయ్యాయి. అయితే ఈ సినిమాలన్నీ డిజాస్టర్ అయ్యాయి. సినిమాలలో గ్లామర్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్న కూడా కావ్య థాపర్ కి ఏ మాత్రం కలిసి రాలేదని చెప్పాలి. అయితే ఈ సినిమాలు ఫ్లాప్ అయిన కావ్య థాపర్ ఇండస్ట్రీలో అందరి దృష్టిలో పడింది. దీంతో టైర్ 2 హీరోలకి ఆమె ఛాయస్ గా మారింది. ఆమె మరికొన్ని కమర్షియల్ సినిమాలకి కూడా హీరోయిన్ గా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే టాక్ వినిపిస్తోంది. డిజిటల్ ఎంట్రీ కూడా



ఇచ్చిన కావ్య థాపర్ 2023లో విజయ్ సేతుపతి ఫర్జీలో నటించింది. ఈ సిరీస్ కి మంచి టాక్ వచ్చింది. ఇదిలా ఉంటే కావ్య థాపర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన అప్డేట్స్ తో పాటు గ్లామర్ ఫోటోలని కూడా కావ్య థాపర్ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలకి లక్షల్లో లైక్స్ వస్తాయి. ఎప్పుడు గ్లామర్ అవుట్ ఫిట్స్ తో కనిపించే కావ్య థాపర్ సడెన్ గా చక్కనైన చీరకట్టులో మెస్మరైజ్ చేసే ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. వైట్ కలర్ చీరలో ఆమె అచ్చమైన తెలుగమ్మాయిలా, అందమైన బాపు బొమ్మలా ఉందనే మాట వినిపిస్తోంది.

నెటిజన్లు కూడా కావ్యా థాపర్ ఫోటోపై ఇంటరెస్టింగ్ కామెంట్స్ చేస్తున్నారు. ఇలా ట్రెడిషనల్ స్టైల్ క్యారెక్టర్ కావ్య థాపర్ కి పడితే కచ్చితంగా ఆకట్టుకుంటుందని అనుకుంటున్నారు. ఒక్క సినిమాతో కమర్షియల్ బ్రేక్ పడితే ఆమె టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా మారిపోతుందని అంటున్నారు. ఈ ఏడాది ఆమెకి ఏ విధంగా కలిసి రాలేదు. వచ్చే ఏడాది అయిన కావ్య థాపర్ కెరియర్ ని టర్న్ చేసే సినిమా పడుతుందేమో వేచి చూడాలి.

## బ్లాక్ షర్ట్‌లో క్యూట్ దివి

తెలుగు బిగ్ బాస్‌తో ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ దివి. అంతకు ముందు పలు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేసిన దివికి పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ బిగ్ బాస్‌లో కొన్ని వారాలు ఉన్నా మంచి గుర్తింపు లభించింది. సోషల్ మీడియాలో ఈమె బిగ్‌బాస్ వల్ల మంచి పాపులారిటీ సొంతం చేసుకుంది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం. హీరోయిన్‌గా పలు సినిమాల్లో నటించిన ఈ అమ్మడు ఈ మధ్య కాలంలో వెబ్ సిరీస్‌ల్లోనూ నటిస్తూ బిజీగా ఉంది. ఎంత బిజీగా ఉన్న సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసి వార్తల్లో నిలుస్తూ ఉంది. బిగ్ బాస్ తో వచ్చిన పాపులారిటీతో దివి సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. అంతే కాకుండా సోషల్ మీడియాలోనూ హీరోయిన్స్ రేంజ్‌లో ఫాలోయింగ్‌ను దక్కించుకుంది.



ముఖ్యంగా ఈమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో హీరోయిన్స్ రేంజ్‌లో ఫాలోవర్స్ సంఖ్య ఉంది. కనుక ఈ అమ్మడు సోషల్ మీడియాలో స్టార్ అయింది. అయితే హీరోయిన్‌గా మాత్రం ఆఫర్ల కోసం వెయిట్ చేస్తోంది. వెబ్ సిరీస్‌ల్లో, చిన్న సినిమాల్లో ప్రస్తుతం నటిస్తున్న ఈమెకు పెద్ద సినిమాల్లో, ప్రముఖ హీరోల సరసన నటించే అవకాశాలు దక్కడం లేదు, చిరంజీవి ఆఫర్ ఇస్తానంటూ హామీ ఇచ్చి, అన్నట్లుగానే ఛాన్స్ ఇచ్చారు. చిరంజీవి ఇచ్చిన ఛాన్స్ ఆమె కెరీర్ కి పెద్దగా ఉపయోగపడలేదు. ప్రాముఖ్యత లేని పాత్ర ఇవ్వడంతో పాటు, నటించే స్కోప్ దక్కలేదు. చిరంజీవితో సన్నివేశాలకు ఛాన్స్ దక్కలేదు. ముందు ముందు అయినా ఈ అమ్మడికి టాలీవుడ్ లో పెద్ద హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు మరిన్ని వస్తాయా అనేది చూడాలి. తెలుగు అమ్మాయి కాకుంటే వరుసగా టాలీవుడ్‌లో హీరోయిన్ ఛాన్స్‌లు దక్కించుకునేంత అందం, ప్రతిభ ఉన్న దివికి ఇక్కడి అమ్మాయి కావడమే పెద్ద నేరం అన్నట్లుగా మారింది అంటూ ఆమె ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివికి ఉన్న అందంతో తెలుగులో కాకుండా ఇతర భాషల్లో ప్రయత్నిస్తే బాగుంటుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలతో వైరల్ అవుతోంది. ఈసారి పెద్దగా స్కిన్ షో చేయకుండానే ఆకట్టుకుంది. బ్లాక్ షర్ట్ ధరించి భలే ఉందే అనిపించింది. లూజ్ హెయిర్‌తో క్యూట్ లుక్ లో బ్లాక్ షర్ట్ తో డిఫరెంట్ లొకేషన్‌లో మేకప్ పెద్దగా లేకుండా తీసుకున్న ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోల్లో దివి చాలా బాగుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఈ ఫోటోలపై మీరు ఒక లుక్ వేయండి.




## ముచ్చటగా మూడు లాక్ చేసిందిలా!




'మిస్టర్ బచ్చన్' తో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన భాగ్యశ్రీ భోర్సే సుపరిచితమే. అమ్మడికి తొలి సినిమా ఫ్లాప్ ఇచ్చినా? నటన పరంగా పాస్ అయిపోయింది. వచ్చిన అవకాశంతో ట్యాలెంటెడ్ బ్యూటీనని నిరూపించుకుంది. సొగసరి నటనలో ఈజ్ ఉంది. హీరోయిన్ పక్కన హీరోయిన్ అనే లెక్కలో కాకుండా వినూత్నమైన నటనతో రీచ్ అయింది. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ , రానా నటిస్తోన్న 'కాంత'లో హీరోయిన్ గా నటిస్తోంది. ఇది భాగ్యశ్రీకి రెండవ సినిమా.

తాజాగా మూడవ సినిమా కూడా ఖాతాలో వేసుకుంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమా నిర్మిస్తుంది. ఇది రామ్ కి 22వ సినిమా. ఇందులో ఆయనకు జోడీగా భాగ్యశ్రీని ఎంపిక చేసారు. ఎనర్జిటిక్ స్టార్ కి జోడీగా తీసుకున్నారంటే? ఆయన నటన మ్యాచ్ చేయాలి. అందులో భాగ్య శ్రీ ఎక్కడా తగ్గే నటి కాదు. రామ్ కి పోటీగా నటించగల సమర్దురాలే. 'మిస్టర్ బచ్చన్' లో రవితేజకి జోడీగా పోటీగా నటించింది. అమ్మడు ఎక్కడా డెబ్యూ అనే ఫీల్ తీసుకురాకుండా చేయడంతో మంచి సక్సస్ అయింది. మహేష్ బాబు.పి దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమా మరికొన్ని గంటల్లో అధికారికంగా ప్రారంభం కానుంది. లైనప్ లో ఉన్న సినిమాలు గనుక సక్సెస్ అయితే భాగ్య శ్రీ ట్యాలెంట్ కి తక్కువ సమయంలోనే స్టార్ లీగ్ లో చేరడానికి అవకాశం ఉంది. అమ్మడు టాలీవుడ్ కంటే ముందే బాలీవుడ్లో లాంచ్ అయింది. అక్కడ 'యారియాన్-2'లో నటించింది. ఇటీవల రిలీజ్ అయిన 'చందు ఛాంపియన్' తోనూ అలరించింది. కానీ అక్కడ ఆశించిన విధంగా ఛాన్సులు రాలేదు. ఈ క్రమంలోనే టాలీవుడ్ లో అడుగు పెట్టింది. అయితే అమ్మడి కెరీర్ ప్రారంభమై ఏడాది మాత్రమే గడిచింది. మును ముందు మంచి భవిష్యత్ ఉంది. భాగ్య శ్రీది ఔరంగాబాద్. మోడలింగ్ నుంచి సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది.

## నిహారిక గ్యాంగ్ గ్లామర్ బ్లాస్ట్



మెగా ఫ్యామిలీ నుంచి వచ్చిన ఏకైక హీరోయిన్ నిహారిక.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే. యాంకర్ గా కెరీర్ స్టార్ట్ చేసిన అమ్మడు.. అనేక షార్ట్ ఫిల్మ్స్ లో నటించారు. ముద్దపప్పు ఆవకాయ్, నాన్న కూచి వంటి పలు లఘుచిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు. ఆ తర్వాత యంగ్ హీరో నాగచైతన్య ఒక మనసు మూవీతో హీరోయిన్ గా మారారు. డెబ్యూ చిత్రంలో తన యాక్టింగ్ తో అలరించారు. విమర్శకుల నుంచి ప్రశంసలు కూడా దక్కించుకున్నారు. ఆ తర్వాత హీరోయిన్ గా వరుస సినిమాలు చేశారు నిహారిక. కానీ అనుకున్నంత స్థాయిలో హిట్స్ సాధించలేకపోయారు. సూర్య కాంతం మూవీతో మోస్తరు హిట్ ను సొంతం చేసుకున్నారు. అదే సమయంలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పేరుతో నిర్మాణ సంస్థను స్టార్ట్ చేశారు. తన బ్యానర్ పై పలు వెబ్ సిరీస్ లు నిర్మించారు. రీసెంట్ గా కమిటీ కుర్రోళ్ళు సినిమాను రూపొందించారు. ఆగస్టులో రిలీజ్ అయిన ఆ మూవీ సూపర్ హిట్ అయ్యి నిర్మాతగా నిహారికకు సక్సెస్ తెచ్చి పెట్టింది. ఓవైపు నిర్మాతగా వ్యవహరిస్తూనే.. మరోవైపు సినిమాల్లో కూడా నటిస్తున్నారు నిహారిక. టాలీవుడ్ హీరో మంచు మనోజ్ తో కలిసి వాటి ది ఫిష్ లో యాక్ట్ చేస్తున్నారు. ఇప్పటికే ఆమెకు సంబంధించిన ఫస్ట్ లుక్ రిలీజ్ అయి ఆకట్టుకుంది. కోలీవుడ్ లో మరో సినిమా చేస్తున్నారు మెగా డాటర్. మద్రాస్ కారన్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మలయాళం హీరో ఆర్డీఎక్స్ ఫేమ్ షేన్ నిగమ్ సరసన నటిస్తున్నారు. అదే సమయంలో తన ఫ్రెండ్స్ తో ఎప్పటికప్పుడు వెకేషన్స్ అండ్ పార్టీస్ కు హాజరవుతుంటారు నిహారిక. ఈ మధ్యకాలంలో వితికా షేరు, మహాతల్లి జానుతో నిహారిక ఎక్కువ కనిపిస్తున్నారు. టూర్స్ కు వెళు_న్నారు. పార్టీలు చేసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. అందుకు సంబంధించిన పిక్స్ ఎవరో ఒకరు ఇన్స్ స్టాలో షేర్ చేస్తున్నారు. వాటి కింద కామెంట్స్ తో తమ ఫ్రెండ్ షిప్ ను వ్యక్తపరుస్తున్నారు. రీసెంట్ గా మహాతల్లి జాను కొత్త పిక్ ను షేర్ చేశారు. అంతా కలిసి బ్రంచ్ కు వెళ్లినట్లు క్యాప్షన్ ఇచ్చారు. అంతా ఫుల్ ఫన్నీగా గడుపుతూ ఫోటో దిగినట్లు ఈజీగా తెలుస్తుంది. అందులో నిహారిక స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తున్నారు. వైట్ కలర్ డ్రెస్ వేసుకున్న మెగా డాటర్ తన నవ్వుతో మాయ చేస్తున్నారు. తన స్టిల్స్ ఫిదా చేస్తున్నారు. సింపుల్ గా కనిపిస్తూనే ఆకట్టుకుంటున్నారు. తన లుక్స్ తో మైమరపిస్తున్నారు. ప్రస్తుతం ఆ ఫోటో వైరల్ గా మారగా.. నెటిజన్లు తెగ స్పందిస్తున్నారు. నిహారిక గ్యాంగ్ పిక్ సూపర్ అని కామెంట్లు పెడుతున్నారు. గ్లామర్ బ్లాస్ట్ అదిరిపోయిందని చెబుతున్నారు.

## చీరలో కాజల్ సోదరి నిషా అందం

నిషా అగర్వాల్ .. పరిచయం అవసరం లేదు. కాజల్ అగర్వాల్ గారాల చెల్లెలు. తెలుగు సినిమా కథానాయికగాను సుపరిచితురాలు. సోదరీమణుల మధ్య గొప్ప అనుబంధం ఆకర్షిస్తుంది.. అయితే నిషా అగర్వాల్ కొన్నేళ్ల పాటు సినిమాల్లో నటించినా కానీ, తన సోదరి కాజల్ కంటే ముందే పెళ్లి చేసుకుని లైఫ్ లో సెటిలైంది. తన భర్త పిల్లలు కాపురం అంటూ తన పంథాలో ఉంది. నిషా ఫ్లాష్ బ్యాక్ లోకి వెళితే.. తెలుగులో పలు చిత్రాల్లో నటించింది. వరుణ్ సందేశ్ .. నారా రోహిత్ లాంటి యువహీరోల సరసన హిట్ చిత్రాల్లో నటించింది. ఆ తర్వాత కెరీర్ ఆశించిన రేంజుకు చేరకపోవడంతో పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకుంది. ముంబైకి చెందిన వ్యాపారవేత్త కరణ్ వలేచాను 2013 డిసెంబర్ 28 న పెళ్లాడింది నిషా. ఈ జంటకు కిడ్స్ ఉన్నారు. కెరీర్ జర్నీలో వరుణ్ సందేశ్ - నిషా జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా ఏమైంది ఈవేళ బాక్స్ ఆఫీస్ వద్ద విజయం సాధించింది. తదుపరి చిత్రం



సోలో మంచి విజయం అందుకుంది. నారా రోహిత్- నిషా అగర్వాల్ జంటకు ఇది బ్లాక్ బస్టర్ మూవీ. 2011 చివరిలో ఈ మూవీ విడుదలైంది .ఇందులో నిషా మెడికల్ కాలేజీ విద్యార్థిగా నటించగా రోహిత్ వీర ప్రేమికుడిగా కనిపించాడు. ఆ తర్వాత ఏమైంది ఈవేళ రీమేక్ %-%ఇష్టం%-% (2012) చిత్రంతో నిషా తమిళంలో అడుగుపెట్టింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘోరంగా విఫలమైంది. 2013 లో సుకుమరుడులో నటించింది. భయ్య భయ్య తో మలయాళ చిత్ర పరిశ్రమలోనూ ప్రవేశించింది. అటుపై చివరిసారిగా మలయాళ చిత్రం కజిన్స్ లో కనిపించింది. నిషా అగర్వాల్ పెళ్లి చేసుకున్న తర్వాత నటనను విరమించాలని నిర్ణయించుకుంది. 27 అక్టోబర్ 2018 న ఈ జంటకు ఇషాన్ వలేచ అనే కుమారుడు కలిగాడు. నిషా ఇటీవల సోషల్ మీడియాల్లో స్పీడ్ గా ఉంది. నిరంతరం ఫోటోషూట్లను షేర్ చేస్తూ, కొన్ని వాణిజ్య ప్రకటనలను షేర్ చేస్తూ ఆదాయ ఆర్జన చేస్తోంది. అయితే నిషా నటనలో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించే ఆలోచనలో ఉందని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి.

## సైలెంట్ కిల్లర్‌లా టాలీవుడ్‌లో కన్నడ బ్యూటీ

ఇటీవలి కాలంలో నిధి అగర్వాల్, రష్మిక మందన్న, నభా నటేష్, కృతి శెట్టి లాంటి కన్నడ భామలు తెలుగు సినీపరిశ్రమలో వరుసగా అవకాశాలు అందుకుంటున్న సంగతి తెలిసిందే. మలయాళీ భామలతో పోటీపడుతూ కన్నడం నుంచి కథానాయికల హవా టాలీవుడ్ లో పెరిగిందనడానికి ఇది సూచిక. ఇప్పుడు మరో కన్నడ బ్యూటీ టాలీవుడ్‌లో ఆరంగేట్రంతోనే వేవ్స్ క్రియేట్ చేస్తోంది. సైలెంట్ కిల్లర్ లా దూసుకొస్తున్న ఈ బ్యూటీ పేరు రుక్మిణి వసంత్. 2023లో కన్నడ దర్శకుడు హేమంత్ రావ్ తెరకెక్కించిన 'సప్త సాగరదాచే ఎల్లో' - సైడ్ A అండ్ SSE సైడ్ B చిత్రాలలో రుక్మిణి తన చక్కటి నటనతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత కేజీఎఫ్ ప్రశాంత్ నీల్ కథ అందించిన భగీరలోను నటించింది. ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. నటిగా రుక్మిణికి మంచి మార్కులు పడ్డాయి. అదే క్రమంలో రుక్మిణి వసంత్‌కి టాలీవుడ్ లో విజయ్ దేవరకొండ సహా పలువురి సినిమాల్లో ఆఫర్లు వచ్చాయి. అయితే ఇంతలోనే రామ్ పోతినేని సరసన నటించేందుకు ఓకే చెప్పిందని కథనాలొచ్చాయి. రుక్మిణి వసంత్‌ను పలువురు చిత్రనిర్మాతలు సంప్రదించారని, వాస్తవానికి దాదాపు డజను స్క్రిప్టులు విన్నా కానీ దేనికీ సంతకం చేయడానికి పెద్దగా ఆసక్తి చూపలేదని తెలిసింది. కానీ చివరికి రామ్ పోతినేనితో కలిసి ఒక చిత్రానికి సంతకం చేసిందని సమాచారం. రవికిరణ్ కోలాతో కలిసి



విజయ్ దేవరకొండ చిత్రంలో ఆమె నటిస్తుందని పుకార్లు వచ్చాయి.. కానీ ఆమె దానిని తిరస్కరించిందని కూడా కథనాలొచ్చాయి. తమిళంలో టాప్ స్టార్స్ విజయ్ సేతుపతి, శివకార్తికేయన్‌లతో సినిమాలకు సంతకాలు చేసింది. శివ రాజ్‌కుమార్ భైరతి రణగల్, భగీరా సహా పలు కన్నడ చిత్రాలలోను రుక్మిణి నటిస్తోంది. సేతుపతి సినిమా త్వరలో విడుదలకు రానుంది. ఇందులో తన షూటింగ్‌ను రుక్మిణి ముగించింది. శివకార్తికేయన్‌తో దర్శకుడు ఏఆర్ మురుగదాస్ తెరకెక్కిస్తున్న చిత్రం ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. శివరాజ్ కుమార్ భైరతి రణగల్ అనే చిత్రంలోను రుక్మిణి కథానాయిక. ఈ సినిమా ట్రైలర్ ఇటీవలే విడుదలై ఆకట్టుకుంది. రుక్మిణి వ్యక్తిగత విషయాలు పరిశీలిస్తే ఆసక్తికరం. అశోక చక్ర గ్రహీత కల్నల్ వసంత్ వేణుగోపాల్ కుమార్తె ఈ ప్రతిభావని. లండన్‌లోని రాయల్ అకాడమీ ఆఫ్ డ్రామాటిక్ ఆర్ట్స్ నుండి నటన నుండి పట్టభద్రురాలైంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536